RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in


Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake
Printing of
Daily News Papers

26.04.2024 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:19 | సంచిక:278

# పదేండ్ల మోసం, వందేళ్ల విధ్వంసం

## జెపి పాలనపై కాంగ్రెస్ ప్రజా ఛార్జీషీట్ విడుదల రేవంత్ రెడ్డి

హైదరాబాద్ ఏప్రిల్ 25: పదేండ్ల మోసం, వందేళ్ల విధ్వంసం పేరుతో బిజెపి పాలనపై కాంగ్రెస్ ప్రజా ఛార్జీషీట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడారు. రూ.400 ఉన్న సిలిండర్‌ను రూ.1200లకు పెంచారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రూ.60 ఉన్న పెట్రోల్ ఇప్పుడు రూ.110లకు పెరిగిందని, ఆ రోజు రూ.80 ఉన్న మంచినూనె ఈ రోజు రూ.180 అయిందని దుయ్యబట్టారు. సామాన్యులు కూడా బ్రతకలేని నిత్యవసర ధరలుపెరిగాయని, పదేళ్లలో మోడీ వైఫల్యంపై ప్రజలకు వివరించాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 7 లక్షల ఉద్యోగాలే ఇచ్చారని, రైతుల ఆదాయం రెండింతలు చేస్తామనిమోడీ మోసం చేశారని, రైతులను ఆదుకుంటామని మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చారని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు.నల్ల చట్టాలు రద్దు చేయాలని ఢిల్లీ సరిహద్దులో లక్షల మంది రైతులు 16 నెలలు ధర్నాలుచేశారన్నారు. స్విస్ బ్యాంకులో లక్షల కోట్ల నల్లధనం తెస్తానని మాట తప్పారని, రూ.15 లక్షలు ప్రతి పేదవాడి ఖాతాలో వేస్తానని దేశాన్ని మోసం చేశారన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని, జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లపై బిజెపి కుట్రలు చేస్తోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు.రిజర్వేషన్ల రద్దుకే 400 సీట్లు కావాలని మోడీ అంటున్నారని ధ్వజమెత్తారు. బిజెపి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్లు రద్దు చేసినట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒబిసి రిజర్వేషన్లు 27 శాతం నుంచి 50 శాతం పెంచుతామని భయం మోడీకి పట్టుకుందన్నారు. జిఎస్‌టి పేరుతో కేంద్ర దోపిడికి పాల్పడిందని, భక్తులం అని చెప్పుకునే బిజెపి చివరికి అగర్బత్తీలను కూడా వదలడం లేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. అగ్గిపెట్టె, సబ్బు బిళ్ల, అగర్బత్తీలపై జిఎస్‌టి బాదడం మోడీకి న్యాయమా? అని ప్రశ్నించారు.




# కాంగ్రెస్ పార్టీ సేవలు ఎనలేనివి...

## ప్రధాని స్వర్గీయ ఇందిరా హయాంలోనే మెదక్ అభివృద్ధి, పేదలకు చేయూత
## నర్సాపూర్ నియోజకవర్గం వెల్దుర్తి ప్రచార సభలో
## ...ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్







సంగారెడ్డి ఏప్రిల్ 25 ప్రజ బలం ప్రతినిది: దేశానికి, రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో చేసిందని ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంత ప్రజానీకానికి ఒరగబెట్టింది ఏమీ లేదని ఆయన దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్సాపూర్ నియోజకవర్గం వెల్దుర్తి మండలం కేంద్రం బాలాజీ గార్డెన్ లో నిర్వహించిన సభలో ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ప్రసంగించారు. దేశ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించినటువంటి మెదక్ పార్లమెంటు స్థానం నుంచి తనకు పోటీ చేసే అవకాశం రావడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇందిరమ్మ హాయంలోనే ఈ మెదక్ ప్రాంతం అభివృద్ధి జరిగిందని తెలిపారు. పేదలకు భూములు, ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీలలో ఐదు పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్సీగా కొనసాగుతున్న వెంకటరామిరెడ్డి బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగిన ఆయన ఇప్పుడు ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవ చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. తాను ఎల్లవేళలా జనంలోనే ఉంటూ మానవత్వంతో సేవా కార్యక్రమాలను చేస్తూ వస్తున్నానని తెలిపారు. ఎంపీ

ఎన్నికలలో తనను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని మెదక్ ప్రజలను కోరారు. మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంటు నుంచి ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకునే సత్తా తనకుందని అన్నారు. గతంలో బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి తనకు ఎంపీ సీటు ఇస్తానని నమ్మించి మోసం చేశాడని, అయినా కృంగిపోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజా పాలనను కొనసాగిస్తుందని, దాంతోనే కాంగ్రెస్ లోకి వచ్చానని పేర్కొన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన నీలం మధు గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత ఎన్నికలలో డబ్బు గెలిచిందని, ఈ పార్లమెంట్ ఎన్నికలలో అదే డబ్బును ఓడిస్తామని అన్నారు. బీఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నాయని, ఆయా పార్టీల మాటలు నమ్మవద్దని సూచించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన నీలం మధును ఈ పార్లమెంటు ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ డిసిసి అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ మహిళ ఇన్చార్జి సుజాత సత్యం, సుహాసిని, కాంగ్రెస్ పార్టీ వెల్దుర్తి మండల అధ్యక్షులు మహేష్ రెడ్డి, ఎంపీపీ నరేందర్ రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి ఆంజనేయులు, మాజీ మండలాధ్యక్షులు నరసింహారెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ లీడర్ నరసింహారెడ్డి, యూత్ లీడర్ మల్లేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో 3 రోజులు మోడీ ప్రచారం



హైదరాబాద్, ఏప్రిల్ 25 పార్లమెంట్ ఎన్నిల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. దీంతో ఇక ప్రచారం మరింత ఊపందుకోనుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సభలు, రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ అదినేత కేసీఆర్ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. ఇక బీజేపీ అభ్యర్థులు కూడా ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు ప్రధాని మోదీ కూడా రంగంలోకి దిగబోతున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారైంది.ఏప్రిల్ 30వ తేదీ, మే 3, 4 తేదీల్లో ప్రధాని మోదీ తెలంగాణలో పర్యటించి లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఈనెల 30 జహీరాబాద్‌లో బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తర్వాత శేరిలింగంపల్లిలో ఐటీ కంపెనీ ఉద్యోగులతో ప్రధాని సమావేశమవుతారు. తర్వాత మే 3వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపారు. అదే రోజు భువనగిరి, నల్లగొండ పార్లమెంటు స్థానాలను కలుపుతూ మరో సభ నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 4వ తేదీన మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని నారాయణపేట, చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని వికారాబాద్‌లో మోదీ ప్రచార సభలు నిర్వహిస్తారని వివరించారు.తెలంగాణలో ఈసారి మెజారిటీ స్థానాలపై కమలం పార్టీ కన్నేసింది. పది స్థానాలు టార్గెట్‌గా పెట్టుకుంది. ఈ క్రమంలోనే ఇప్పటికే నామినేషన్ కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు పాల్గొంటున్నారు. నామినేషన్లు ముగియగానే ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రులు, జాతీయ నాయకులు ప్రచారం చేయనున్నారు. రోడ్‌షోలు, సభలు నిర్వహించనున్నారు. ప్రజలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా బీజేపీ దూకుడు పెంచబోతుంది

# అవినాష్ తప్పు చేయలేదు

## సర్దిచెప్పే ప్రయత్నం చేసిన జగన్



కడప, ఏప్రిల్ 25 పులివెందులలో పర్యటిస్తున్న సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వైఎస్ వివేక హత్య కేసులో తనపై తన పార్టీ అభ్యర్థి అవినాష్‌పై వస్తున్న ఆరోపణలపై స్పందించారు. ఈ కేసులో అవినాష్ ఎలాంటి తప్పు చేయలేదని నమ్మాను కాబట్టే ఆయనకు టికెట్ ఇచ్చానని స్పష్టం చేశారు. ఈ కేసులో అవినాష్ ప్రమేయం ఉందన్న సునీత, షర్మిల కామెంట్స్‌కు ఇన్‌డైరెక్ట్ కౌంటర్ ఇచ్చారు. పసుపు మూకలతో చెల్లెమ్మలు చేతులు కలపారని ఆరోపించారు జగన్. తనను నేరుగా ఎదుర్కోలేక అంతా కలిసి ఒక్కసారి దాడి చేస్తున్నారని వాపోయారు. అందుకే వివేక హత్య కేసును తెరపైకి తీసుకొచ్చి అవినాష్‌ను టార్గెట్ చేశారని అన్నారు. అవినాష్‌ను నాశనం చేయాలని రాజకీయాల నుంచి ఎలిమినేట్ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. పులివెందుల కల్చర్, కడప కల్చర్, రాయలసీమ కల్చర్ అంటూ అవాకులు పేలుతున్నారని విమర్శించారు జగన్. అలాంటి సంస్కృతి తమకు లేదన్నారు జగన్. మంచి చేయడం మంచికి అండగా నిలబడటమే తెలుసున్నారు. నాలుగు దశాబ్ధాలుగా టీడీపీ అక్రమాలను ఎదుర్కొంటి ఈ పులివెందుల బిడ్డలే అన్నారు. పులివెందుల అంటే అభివృద్ధికి, నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఇదో సక్సెస్ స్టోరీ అని చెప్పుకొచ్చారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తలపెట్టిని అభివృద్ధిని మరో రెండు అడుగులు ముందుకే తీసుకెళ్లామన్నారు. అలాంటి పులివెందులలో వైఎస్, జగన్ ముద్రలేకుండా చేయాలని కొందరు కుట్ర పన్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి యత్నిస్తున్నారని అన్నారు. వారి కుట్రలో భాగంగానే కొందరు వైఎస్ వారసులమని ముందుకొస్తున్నారని సునీత, షర్మిలను ఉద్దేశించి విమర్శించారు. అలాంటి వాళ్లకు బుద్ధి చెప్పాల్సింది, వైఎస్‌కు నిజమైన వారసులెవరో చెప్పాల్సింది ప్రజలే అన్నారు. అలాంటి ప్రజల్లో తనకు మంచి పేరు ఉందని దాన్ని తట్టుకోలేక తన ఇద్దరు చెల్లెళ్లతో కలిసి పచ్చ మూక కుట్ర చేస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబాన్ని టార్గెట్ చేసిందెవరో... ఆయనపై కేసులు పెట్టిందెవోర... విగ్రహాలు తొలగిస్తామన్నదెవరో ప్రజలకు బాగా తెలుసున్న జగన్... అలాంటి వారితో చేతులు కలిపిన వ్యక్తులు వైఎస్ వారసులు ఎలా అవుతారని అన్నారు. పసుపు చీరలు కట్టుకొని వైఎస్ఆర్ శత్రువులతో చేతులు కలిపిన వారు వారసులా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని విడగొట్టిన కాంగ్రెస్‌కు ఎవరు ఓటు వేస్తారని ప్రశ్నించారు. తమ ఓట్లు చీలిస్తే ఎవరికి ప్రయోజనమో గుర్తించాలని ప్రజలకు సూచించారకు. తన చిన్నాన్నను చెప్పింది ఎవరో దేవుడికి, జిల్లా ప్రజలకు బాగా తెలుసు అన్నారు జగన్. నిందితులకు ఎవరు మద్దతు ఇస్తున్నారని కూడా తెలుసు అన్నారు. వివేకాకు రెండో భార్య సంతానం ఉన్నది నిజం కాదా అని ప్రశ్నించారు. హత్య జరిగిన రోజు ఎవరు ఫోన్ చేస్తే అవినాష్ అక్కడకు వెళ్లారో... పదే పదే మీడియాలో ఆయన సంధిస్తున్న ప్రశ్నలు నిజం కాదా అని నిలదీశారు. వైఎస్ అవినాష్ రెడ్డి ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టే ఆయనకు టికెట్ ఇచ్చానన్నారు. అలాంటి వ్యక్తి జీవితాన్ని నాశనం చేయాలని చూడటం బాధాకరమన్నారు. ఇలాంటి కుట్రలు చేయడానికి చెల్లెళ్లను ఎవరు పంపించారో ప్రజలకు బాగా అర్థమైందన్నారు. అన్యాయంగా నాడు ఎన్నికల్లో ఓడించిన వాళ్లే ఇప్పుడు కుట్రలు చేస్తున్నారని... వారిచ్చిన స్క్రిప్టులనే వీళ్లు చదువుతున్నారని అన్నారు. అలాంటి వాళ్లు వైఎస్ వారసులు ఎలా అవుతారని ప్రశ్నించారు.

ప్రజాబలం

26.04.2024 శుక్రవారం

## మేడే స్ఫూర్తితో వర్గ ఉద్యమాలు నిర్మిద్దాం!

ప్రతి సంవత్సరం మే 1ని మేడేగా ప్రపంచ వ్యాప్తంగా తమ హక్కుల సాధన కోసం పోరాడుతామని కార్మికులు ప్రదర్శనలు, సభలు జరుపుతూ ఐక్యతను చాటుతారు. పాలకులు, పెట్టుబడిదారుల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని శపథం చేస్తారు. 19వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైన పారిశ్రామిక విధానం వలన కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. వారికి నిర్ణీత పని గంటలు పని లేకపోవటం, ఎటువంటి హక్కులూ లేక పోవటం, రోజులో 14 నుండి 15 గంటల నిర్బంధ పనివేళలు అమలు జరగటం కార్మికుల దుర్భర పరిస్థితికి అద్దం పట్టింది. పనికి వెళ్లినవాళ్లు ఎప్పుడు ఇంటికి తిరిగి వస్తారో తెలియదు. ఇలాంటి పరిస్థితి వేలాది మంది కార్మికులను పొట్టన పెట్టుకుంది. ఇందుకు పారిశ్రామికవేత్తల ధనదాహమే కారణం. దుర్భర పరిస్థితుల నుంచి బయటపడాలనే ఆలోచన కార్మికుల్లో ప్రారంభమైంది. ఆ ఆలోచన లో భాగమే 1884 అక్టోబర్ 7న అమెరికాలోని చికాగో నగరంలో నిర్వహించిన కార్మిక సదస్సు సంఘటిత వాణిజ్య వ్యాపార సంస్థల కార్మిక సంఘాలు ఇందుకు నడుం బిగించాయి. పీడనకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పని కోసం ఉద్యమించాలని అవగాహన సదస్సులో ఏర్పడింది. ఇందుకు కార్మిక సంఘాలు సన్నాహాలు ప్రారంభించాయి. సమ్మెకు సిద్ధమైనాయి. 1886 మే1 ఉదయం 10 గం. అమెరికా అంతటా సమ్మెసైరన్ మోగింది. 13 వేల పారిశ్రామిక సంస్థలు మూతపడ్డాయి. 3 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రారంభమైన 24 గం. తర్వాత కార్మికుల సంఖ్య 4 లక్షలకు చేరింది. చికాగో నగరంలో 40 వేల మంది కార్మికులు తమ కుటుంబాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అనేక దేశాల్లో ఎర్ర జండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వాలు బెంబేలుపడ్డాయి. పారిశ్రామికవేత్తల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. పెట్టుబడిదారుల కనుసైగలతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు నేలకొరిగారు.

కాల్పులకు వ్యతిరేకిస్తూ 1886 మే 4న 'హే' మార్కెట్ కార్మికులతో నిండిపోయింది. ఖబడ్దార్ మమ్ములను కాల్చి చంపుతారా అంటూ కార్మికుల ఆగ్రహావేశాల మధ్య సభ ప్రారంభమైంది. సభపై పోలీసులు దాడి చేయటంతో కార్మికులు తిరగబడ్డారు. చాలా మంది తలలు పగిలాయి, చేతులు, కాళ్లు తెగిపడ్డాయి. మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిచిపోయింది. ఏడుగురు పోలీసులు, ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కార్మిక నాయకులపై కేసులు బనాయించి 7 గురికి మరణశిక్ష, 8 మందికి 15 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. చికాగో కార్మికుల పై పోలీసుల హింసాకాండను ఖండిస్తూ అనేక దేశాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. కార్మికుల అమరత్వం 8 గంటల చట్టానికి నాంది పలికింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస పాలనలో భారత కార్మికులు కూడా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. రోజుకి 12 నుండి 25 గం. పని చేశారు. ఎటువంటి హక్కులు లేవు. పరిస్థితులను మెరుగుపర్చుకునే ఆలోచనకు వచ్చారు. చికాగో కార్మికుల పోరాటానికి ముందే భారత కార్మికులు 8 గం. పని దినం డిమాండ్ చేశారు.

భారతీయ రైల్వే కార్మికులు 1862లో 8 గం. పని డిమాండ్ చేస్తూ మొట్టమొదటి సమ్మె చేశారు. సమ్మెపై వలస పాలకులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. కొందరు కార్మికులు ప్రాణాలు కూడా కోల్పోయారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1882-90 మధ్య 25 సమ్మెలు జరిగాయి. బెంగాల్ జూట్ మిల్లుల్లో జరిగిన సమ్మెలు చాలా ముఖ్యమైనవి. 1905లో భారత ప్రభుత్వ ముద్రణాలయ కార్మికులు నెల రోజులు సమ్మె చేశారు. చారిత్రక విజయం సాధించారు. నవంబర్ 18, 1907లో బెంగాల్ లోని అసన్సోల్‌లో తమ డిమాండ్ల సాధన కోసం రైల్వే కార్మికులు సమ్మె చేశారు. ఈ సమ్మె దేశవ్యాప్తంగా విస్తరించింది. బాలగంగాధర్ తిలక్‌పై విచారణను వ్యతిరేకిస్తూ 1908 లో బొంబాయిలోని కాటన్, గ్రీవ్స్ మిల్లు కార్మికులు పని నిలిపి వేశారు. భారతదేశ శ్రామికవర్గం చేసిన మొట్టమొదటి రాజకీయ సమ్మె ఇది. అన్ని బట్టల మిల్లులు, రైల్వేవర్క్‌షాప్‌ల కార్మికులు 1920 సమ్మె చేశారు. బ్రిటిష్ వలస పాలకులు సైన్యాన్ని ప్రయోగించి అణచివేతకు పూనుకోగా 16 మంది కార్మికులు చనిపోయారు, 50మంది గాయపడ్డారు.

నెహ్రూ దగ్గర నుంచి మోడీ వరకు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు జరుపుతూనే ఉన్నారు. సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడుతూనే ఉన్నారు. రాజీవ్ గాంధీతో ప్రారంభమై నూతన ఆర్థిక విధాలు మన్మోహన్ సింగ్ పాలనలో తీవ్రమై ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడంతో పరిపూర్ణమైంది. ఎటువంటి మినహాయింపు లేకుండా మోడీ ప్రభుత్వం నూటికి నూరు శాతం పెట్టుబడిదారీ విధానాలను అమలు జరుపుతున్నది. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోకి విదేశీ పెట్టుబడులు చొరబడ్డాయి. పి.వి నరసింహారావు, మన్మోహన్ సింగ్ పాలనలో ప్రారంభమైన పెట్టుబడుల ఉపసంహరణ మోడీ పాలనలో పరాకాష్ఠకు చేరి మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను అమ్మకానికి పెట్టారు. 49 పరిశ్రమలను కారుచవకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టారు. బడా వ్యాపార వేత్తలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులను మొండి బకాయిల పేరుతో రద్దు చేశాడు. బిజెపి పార్టీ మొదటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు కలిగి ఉంది.

## నల్గొండ లో నామినేషన్లు

నల్లగొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా (2) సెట్లు కుందూరు జానారెడ్డి నామినేషన్ దాఖలు చేసారు. ఒక నామినేషన్ సెట్ ను రిటర్నింగ్ అధికారికి డిసిసి అధ్యక్షుడు శంకర్ నాయక్ సమర్పించారు. మరో నామినేషన్ సెట్ ను రిటర్నింగ్ అధికారికి డిసిసి మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి సమర్పించారు.

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### కొనుగోలు కేంద్రాల పరిశీలనలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. బోయినపల్లి మండలం కొదురుపాక, విలాసాగర్ లోని ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పించిన వసతులు, రిజిస్టర్లు తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని సేకరించాలని, ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలని, రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని ఆదేశించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ జితేంద్ర ప్రసాద్, తహసీల్దార్ పుష్పలత, అధికారులు, కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

**- ఏడుగురు పట్టుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు**


**- రూ.2,51,130 నగదు, 7 మొబైల్స్, 4 బైక్‌లను, ఫోర్ వీలర్ స్వాధీనం**



రామగుండంరామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ జ్యోతి నగర్ లోని ఒక లాడ్జ్ లో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు మంచిర్యాల టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్, ఎస్ఐ సిబ్బందితో కలిసి లాడ్జిపై దాడి చేశారు. గోదావరిఖని పవర్ హౌస్ కాలనీకి చెందిన దాసరి మల్లేష్, అడ్డగుంటపల్లికి చెందిన పెట్టం జంపయ్య, మల్కాపూర్ కు చెందిన కంచరపు వెంకట్ రావు, జీఎం కాలనీకి చెందిన సాయి వెంకటేష్, గాంధీ నగర్ కు చెందిన పూస వెంకన్న, పవర్ హౌస్ కాలనీకి చెందిన తవటం రమేష్, హనుమాన్ నగర్ కు చెందిన భీమేల్లి శ్రీనివాస్ లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ. 2,51,130 నగదు, 7 మొబైల్స్, 4 బైక్‌లను, ఫోర్ వీలర్ స్వాదీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తులను, స్వాధీనం చేసుకున్న నగదు, సెలఫోన్లు, ద్విచక్ర వాహనాలు, పెకముక్కలను తదుపరి విచారణ నిమిత్తం ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ లో అప్పగించారు.

## ఉపాధిహామీ పథకం తీసుకొచ్చింది కాంగ్రెస్

### లక్ష్మీపూర్ ఉపాధిహామీ కూలీలతో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి



జగిత్యాల, గ్రామాల్లో కూలీలు, వ్యవసాయ కూలీలకు వంద రోజులు ఉపాధి కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకం తీసుకువచ్చి కూలీలకు ఆర్థిక భరోసా కల్పించిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ జెడ్పిటిసి తాటిపర్తి శోభారాణి అన్నారు.

గురువారం జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ లో ఉపాధిహామీ పథకం కూలీలు పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి శోభారాణివారితో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ అన్ని వర్గాలకు న్యాయం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 లకే సిలిండర్ అందించిందని తెలిపారు.

,పింఛన్ రాని మహిళలకు నెలకు 2500 రూపాయలు అందించనుందని, అలాగే ఇల్లు లేనివారికి 5 లక్షలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని చెప్పారు.

దేవుడి పేరు చెప్పి ఓట్లు అడగడం బీజేపీకి సరికాదన్నారు.

గత పదేళ్లు కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కేసీఆర్ పాలించి ప్రజలకు చేసిందేమిలేదని, కార్పొరేట్ సంస్థలను పెంచిపోషించారని శోభారాణి విమర్శించారు.

కేసీఆర్ తన కుటుంబానికి ఆస్తులు సంపాదించి పెట్టాడు కానీ పేదలకు ఒరగబెట్టింది శూన్యమని పేర్కొన్నారు.

బీజేపీ, బారాస పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధిచెప్పాలని, ప్రజనాయకుడికి పట్టం కట్టలన్నారు.

నిత్యం ప్రజల మధ్య ఉంటూ కష్టాల్లో పలుపంచుకునే జీవన్ రెడ్డి ని నిజామాబాద్ ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి, సంక్షేమం, రైతు, యువత, నిరుద్యోగులు, మహిళలు, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న జీవన్ రెడ్డి ని మే13 న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటువేసి ఎంపీగా అవకాశం కల్పించాలని శోభారాణి కోరారు.

## పోలింగ్ సిబ్బంది రెండవ ర్యాండమైజేషన్ పూర్తి

హైదరాబాద్ ఏప్రిల్ 25:- జనరల్, పోలీస్ అబ్జర్వ ర్ ల సమక్షంలో జి హెచ్ ఎం సి ప్రధాన కార్యాలయంలో పోలింగ్ సిబ్బంది అధికారుల రెండోవ ర్యాండ మై జేశన్ ప్రక్రియ ను జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోజ్ పూర్తి చేసారు. ఈ కార్యక్రమంలో సి పి శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, జిల్లా కలెక్టర్, హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురుషెట్టి హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారి సికింద్రాబాద్, హేమంత్ కేశావ్ పాటిల్ ఈ వి డి ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## కల్వకుర్తి వాళ్లను నమ్మకండి

నారాయణపేట జిల్లా ముక్తల్ నియోజకవర్గం లో బిజెపి ఎంపీ అభ్యర్థి డీకే అరుణ జోరుగా ప్రచారం చేస్తున్నారు. పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి అరుణ కు ఘన స్వాగతం పలికారు గ్రామస్థులు...., బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ సందర్భంగా గ్రామస్తులు ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రజా సంక్షేమ పాలనలో మోదీ ప్రపంచానికే ఆదర్శం అని ఇక్కడ గ్రామస్థుల ఆశీస్సుల కోసం ఇక్కడికి వచ్చానని కోరారు. కాంగ్రెస్, బిఆరెస్ కు ఓటు వేస్తే మోరీలో వేసినట్లే నని మీ ప్రాంత ఆడబిడ్డను.. ఆదరిస్తారని ఆశిస్తున్నానుఅన్నారు. ఎక్కడో కల్వకుర్తి నుంచి వచ్చినోళ్లను నమ్మితే మరోసారి మోసపోతారు. తస్మాత్ జాగ్రత్త అని చెప్పారు... ఇచ్చిన ఏ ఒక్క గ్యారంటీ కూడా కాంగ్రెస్ అమలు చేయలేక పోయిందని ఇలానే ప్రజలను మోసం చేసి నోటికొచ్చినట్లు మాట్లాడిన కేసీఆర్ ఎక్కడికి వెళ్ళాడో చూసాం... రేపు రేవంత్ కూ అదే పరిస్థితి వస్తుందని జోష్యం చెప్పారు...మహిళా లకు ఫ్రీ బస్సు ఏమో గాని వారు నరకం అనుభవిస్తున్నారని అన్నారు అసలు ఈ స్కీం ఎవరు అడిగారని నిలదీస్తున్న ప్రజలు. మోదికి రాహుల్ కీ పొంతనే లేదు. ఎవరెన్ని కుట్రలు చేసిన మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయంఅని అన్నారు

## ఆగష్టు 15 లోపు రైతు రుణమాఫీ నిజం అయితే...

### రాజీనామా పత్రంతో అమరవీల స్థూపం వద్దకు రావాలి

### రేవంత్ రెడ్డికి ఎంఎల్ఎ హరీష్ రావు సవాల్

మెదక్: ఆగష్టు 15 లోపు రైతు రుణమాఫీ, ఆరు హామీలు అమలు చేయడం నిజం అయితే అమరవీరుల స్థూపం వద్దకు సిఎం రేవంత్ రెడ్డి రావాలని మాజీ మంత్రి, ఎంఎల్ఎ హరీష్ రావు సవాల్ విసిరారు. అమరవీల స్థూపం వద్దకు రాజీనామా పత్రంతో తాను వస్తానని, రేవంత్ రెడ్డికి దమ్మంటే రావాలన్నారు. మెదక్ రోడ్ షో లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన కామెంట్స్ చేశారు. 'రాజీనామా లేఖలను ఇద్దరం కలిసి మేధావులు చేతిలో పెడదాం. సిఎం రేవంత్ రెడ్డి చెప్పినవి అమలు చేస్తే తన రాజీనామా లేఖను ఆ మేధావులు స్పీకర్ కు ఇస్తారు. చేయకుంటే రేవంత్ రాజీనామా లేఖను గవర్నర్ కు ఇస్తారు. రాజీనామాకు సిద్ధమేనా అని అడుగుతున్నానని సవాల్ విసిరారు. గతంలో కొడంగల్ లో రాజకీయ సన్యాసం తీసుకుంటా అని రేవంత్ తోక ముడిచాడని, ఇప్పుడు అదే రిపీట్ అవుతుందని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులు, బి ఆర్ ఎస్ పార్టీ అంటే ఎండ కూడా బయపడుతుందని, 25 సంవత్సరాలలో మెదక్ లో గులాబీ జెండా ఎగురుతుందని వేరే జెండా ఎగురడం లేదు, మెదక్ జిల్లా గులాబీ అడ్డా, మళ్ళీ బి ఆర్ ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.10 ఏళ్లలో కెసిఆర్ ఏం చేశారని రేవంత్ రెడ్డి అడుగుతున్నారు. కెసిఆర్ తోనే కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని, కెసిఆర్ నిర్మించిన కలెక్టర్ ఆఫీస్ కు నామినేషన్ కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారన్నారు. పేగులు మెడలో రాక్షసులు వేసుకుంటారని సిఎం స్థాయి తగ్గించుకొని మాట్లాడాలి, మెదక్ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు రేవంత్ కు లేదని ఘాటుగా విమర్శించారు. జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కాలేజీలు కెసిఆర్ తెచ్చారు, అందమైన నాలుగు లైన్ రహదార్లు వేశామని చెప్పుకొచ్చారు.వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ అమలు అని బాండ్ పేపర్ మీద రాశారు, బాండ్ పేపర్ పరువు తీశారు, దేవుళ్ళను రాజకీయాలకు వాడుతున్నారు, రేవంత్ ఎవరి మీద ఓట్లు పెట్టినా జనాలు నమ్మడం లేదని చురకలంటించారు. ఆరు హామీలు అమలు కాలేదు కానీ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ ముఖ్యమంత్రి కి తన ఎత్తు గురించి ధ్యాస ఉంది గాని రైతుల సమస్య పట్ల ధ్యాసే లేదు అని మండిపడ్డారు. 200 పైగా రైతులు, 30 మంది ఆటో కార్మికులు చనిపోయినా కూడా వారి కుటుంబాలను రేవంత్ పరామర్శించడం లేదని ధ్వజమెత్తారు.బిజెపి రఘునందన్ మాటలు నమ్మడమంటే నీళ్లు లేని బావిలో దూకడమే నయం, దుబ్బాకల అలాగే మాట్లాడితే అక్కడ ప్రజల బుద్ధి చెప్పారు. బిజెపి ఏ వర్గాలకు మేలు చేయలేదు, బిఆర్ఎస్ ఈ ఎన్నికలలో గెలిస్తే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. బిఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ వాళ్ళ మెడలు ఉంచడం సాధ్యమవుతుందని, కాంగ్రెస్ వాళ్లను భూమి మీద దించాలంటే వెంకట్రామ రెడ్డిని గెలిపించాలని కోరారు.

# అసమాన గణిత శాస్త్రజ్ఞుడు రామానుజుడు

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో ఒకరిగా గుర్తింపు సాధించిన భారతీయుడు శ్రీనివాస రామానుజన్. గత సహస్రాబ్దిలో ప్రపంచానికి అత్యుత్తమ గణితశాస్త్ర సిద్ధాంతాలను, సూత్రాలను అందించిన అత్యుత్తమ అ'గణిత' మేధావి శ్రీనివాస రామానుజన్ భారతీయుడు కావడం మనందరికీ గర్వకారణం.అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ (డిసెంబర్ 22, 1887ఏప్రిల్ 26, 1920) 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. ఆయనకు పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పడింది. పదమూడేళ్లకే ఎస్ఎల్ లోనీ త్రికోణమితిపై రాసిన పుస్తకాన్ని ఔపోసన పట్టడమే కాదు తను సొంతంగా సిద్ధాంతాలు కూడా ప్రారంభించారు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ గణితం మీదే శ్రద్ధ చూపి మిగిలిన సబ్జెక్టులపై దృష్టి పెట్టక పోవడంతో ఎఫ్.ఎ. పరీక్ష తప్పారు. ఆ తరువాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చేరారు. అక్కడ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై రామానుజన్ విశేష పరిశోధనలు చేశారు.

1729 సంఖ్యను రామానుజన్ సంఖ్యగా పిలుస్తారు. తీవ్రమైన అనారోగ్యంతో హాస్పిటల్లో ఉన్నప్పుడు కూడా హార్డీతో 1729 సంఖ్య యొక్క ప్రత్యేకతను తెలియజెప్పి ఆయన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశారు. రామానుజన్ అనారోగ్యంతో హాస్పిటల్లో వున్నప్పుడు, హార్డీ ఆయనను పలుకరించటానికి వెళ్లి మాటల మధ్యలో తాను వచ్చిన కారు నంబరు 1729, దాని ప్రత్యేకత ఏమైనా ఉన్నదా ? అని అడిగారు. అందుకు రామానుజన్ తడుము కోకుండా ఆ సంఖ్య ఎంతో చక్కని సంఖ్య అని, ఎందుకంటే రెండు విధాలుగా రెండు ఘనముల మొత్తముగా వ్రాయబడే సంఖ్యా సమితిలో అతి చిన్నసంఖ్య అని తెల్పారు. ఈ సంఘటన గణితంపై ఆయనుకున్న అవ్యాజమైన అనురాగానికి, అంకిత భావానికి నిదర్శనం. మహా మేధావులు కూడా సాధించలేని సమస్యలను అలవోకగా ఎలాంటి పుస్తకాల సాయం లేకుండా సాధించి, ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్న భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్దులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

15ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్‌సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి.

వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. 3,500 గణిత ఫలితాలను సమీకరించిన రికార్డును సొంతం చేసుకున్న మేధావి. 1903లో మద్రాసు విశ్వ విద్యాలయంలో స్కాలర్‌షిప్ వచ్చింది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చి పడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. చిత్తు కాగితాలను కూడా బహు జాగ్రత్తగా వాడుకుంటూ గణితమే లోకంగా బతికేవారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వ విద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా.వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్దుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877–1947)కి పంపారు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి. హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. జీవిత చరమాంకంలో రామానుజన్ రాసిన మ్యాజిక్ స్క్వేర్, ప్యూర్ మాథ్స్‌కు చెందిన నెంబర్ థియరీ, మాక్ తీటా ఫంక్షన్స్ చాలా ప్రసిద్ధి పొందాయి. 33 ఏళ్ళకే ఆయన 1926, ఏప్రిల్ 26న మరణించారు. ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజి గౌరవం పొందిన తొలి భారతీయుడిగానూ, ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండో భారతీయుడిగానూ ఆయన చరిత్రకెక్కారు. రామానుజన్ స్వరాష్ట్రమైన తమిళనాడు, ఆ రాష్ట్ర వాసిగా ఆయన సాధించిన విజయాలకు గుర్తుగా ఆయన జన్మదినమైన డిసెంబర్ 22 ను రాష్ట్ర సాంకేతిక దినోత్సవంగా ప్రకటించింది. భారత ప్రభుత్వం 1962 వ సంవత్సరంలో ఆయన 75వ జన్మదినం నాడు, సంఖ్యా శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషిని కొనియాడుతూ స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. 2012లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ రామానుజన్ పుట్టినరోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించారు. 125వ జయంతి సందర్భంగా 2014ను భారత ప్రభుత్వం జాతీయ గణితశాస్త్ర సంవత్సరంగా ప్రకటించింది. రామానుజన్ ఆ కాలంలో సుప్రసిద్దులైన ఆయిలర్, గౌస్, జకోబి మొదలైన సహజ సిద్ధమైన గణిత మేధావులతో పోల్చదగిన వారు. రామానుజన్ లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన విదేశీ ప్రొఫెసర్ హార్డీ, అసలు తను గణిత శాస్త్రానికి చేసిన అత్యుత్తమ సేవ రామానుజాన్ని కనుగొనడమే అని వ్యాఖ్యానించడం విశేషం..

## విలక్షణ వ్యక్తిత్వం ఎంఎస్ఆర్‌కే సొంతం

విచిత్ర మనస్తత్వం....నిక్కచ్చిగా వ్యవహరించే నైజం. కుండలు బద్దలు కొట్టినట్లు మాట్లాడే ముక్కుసూటి తనం, నిండైన అమాయకత్వం, మచ్చలేని రాజకీయ జీవితం... వెరసి ఎం.సత్యనారాయణ రావు వ్యక్తిత్వం. మాచినేని సత్యనారాయణ రావు అంటే వెంటనే స్ఫురణకు రాక పోవచ్చు. ఎం ఎస్ ఆర్ అంటే తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు.కరీంనగర్ జిల్లాలోని రామడుగు మండలం వెదిర గ్రామంలో ఎంఎస్ఆర్ జనవరి 14, 1934న జన్మించారు. విద్యార్థి దశ నుండే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై స్పందించే వారు. హైదరాబాద్ లో వి.వి. కళాశాలలో చదువు తున్నపుడు తన గొంతు వినిపించే వారు. 1969 తొలి తెలంగాణ ఉద్యమంలో ఆయన చెన్నారెడ్డి లాంటి నాయకులతో కలిసి చురుకుగా పాల్గొన్నారు. 1971లో తెలంగాణ ప్రజా సమితి ఎంపీగా ఎంఎస్ఆర్ గెలుపొందారు. అనంతరం మరో రెండు పర్యాయాలు కాంగ్రెస్ ఎంపీగా గెలిచారు. 14 ఏళ్ల పాటు ఎంపీగా కొనసాగారు.1980 నుండి 1983 వరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన పార్టీ వ్యవహారాల్లో ఇందిరా గాంధీతో సన్నిహితంగా ఉన్నారు.

1990–94 వరకు ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2000 నుంచి 2004 వరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ పనిచేశారు. 2004–07 వరకు దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి మంత్రివర్గంలో దేవాదాయ, క్రీడ, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. 2007 తర్వాత ఆర్టీసీ చైర్మన్‌గా ఎం.సత్యనారాయణ రావు తిరిగి సేవలందించారు. 77–79 లోక సభ సభ్యుడుగా, హౌస్ కమిటీ బాధ్యునిగా ఆస్ట్రేలియా మరియు ఇతర దేశాలకు పార్లమెంటరీ ప్రతినిధి సభ్యునిగా వెళ్లారు.ఇందిరాగాంధీతో పాటు నెహ్రూ కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా ఆయనకు పేరుంది. చాలా సందర్భాల్లో ఆయన హైకమాండ్‌కి ఎదురు తిరిగేవారు కూడా. ఆయన ఎప్పుడు ఎలా స్పందిస్తారో అని హైకమాండ్ ఒక్కోసారి ఆందోళన చెందేది. తన పర భేదం లేకుండా వ్యాఖ్యానాలు చేసేవారు. అవి అప్పుడప్పుడు సంచలనాలుగా మారేవి. రాజకీయాలు వేడెక్కేవి. అలా ముఖ్యమంత్రిగా వైఎస్ ఉన్న సమయంలో సహచర మంత్రిగా 2006 లో, టిఆర్ఎస్ చీఫ్ కెసిఆర్ ను సవాలు విసిరి కరీంనగర్ లోక్ సభ ఉప ఎన్నికకు కారణమై, కేసిఆర్ గెలుపుకు బాధ్యులుగా, రాజీనామా చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షుడిగా ఎంఎస్ఆర్ విసిరిన సవాలుకు ప్రతిస్పందనగా కెసిఆర్ 2006 లో తెలంగాణకు ఎంపి పదవికి రాజీనామా చేశారు. తెలంగాణ వాదిగా, ఎంపీగా, మంత్రిగా ఎమ్మెస్సార్ ప్రత్యేక శైలి కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు రాజీనామాలు చేసిన నేపథ్యంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగిన ఆయన అందరికీ పరిచయమే. ముఖ్యంగా ఢిల్లీ పెద్దలతో ఆయన బాగా సత్సంబంధాలు కొనసాగించేవారు. చాలా వ్యవహారాల్లో ఢిల్లీ పెద్దలు ఆయన అభిప్రాయాల్ని లెక్కలోకి తీసుకునేవారు. నాగర్జున సాగర్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం సమయంలో రావు అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలిశారు. తెలంగాణ రాజకీయాలపై చర్చించారు. తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌తో విలీనం చేయడాన్ని ఆయన వ్యతిరేకించారు. జహర్‌లాల్ నెహ్రూతో నిజామా బాద్‌ను సందర్శించినప్పుడు ఆయన తన భావాలను వ్యక్తం చేసినట్లు చెప్పేవారు. రాజశేఖర రెడ్డి మరణం తర్వాత... ఉమ్మడి రాష్ట్రం... ఆంధ్రప్రదేశ్, తెలంగాణగా విభజించిన తర్వాత... ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరం అయ్యారు.

ఇందిరా గాంధీ తో సన్నిహితంగా మెలిగిన ఆయన... రాజకీయాలు బహు దూరంగా పైలెట్ గా ఉన్న రాజీవ్ గాంధీని, ఇందిర కోరిక మేరకు తానే రాజీవ్ ను మెప్పించి ఒప్పించి రాజకీయాల్లోకి తెచ్చానని చెపుతుండే వారు. పలు రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిగా ఉన్న సమయంలో ఒక సందర్భంలో ఉత్తర ప్రదేశ్ వెళ్ళినపుడు, నాటి యు. పి. కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్ దయాళ్ శర్మ, తనకోసం గంటల కొద్దీ వేచి ఉండి, స్వాగతం పలికి, దండ వేసిన అపూర్వ సంఘటనను గుర్తు చేసుకునే వారు. రాష్ట్ర రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఎం.ఎస్. ఆర్. కు కరోనా సోకి, తీవ్రత అధికం కావడంతో, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించించబడి, చికిత్స పొందుతూ, 2021 ఏప్రిల్ 26న తుదిశ్వాస విడిచారు. తెలంగాణ వాదిగా, ఎంపీగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా, ఆర్టీసీ చైర్మన్ గా ఎమ్మెస్సార్ ప్రత్యేక శైలి కనబరిచి, రాజకీయాల్లో ముక్కుసూటి మనిషిగా పేరొందిన ఎం ఎస్ ఆర్ మృతితో తెలంగాణ ఒక నిబద్ధత కలిగిన రాజకీయ నాయకున్ని కోల్పోయింది.

## సామాన్యుని సేవలో మేధో సంపత్తి

చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు (స్మాల్ అండ్ మీడియమ్ సైజ్డ్ ఎంటర్‌ప్రైజెస్, యస్‌యంఈలు) లాభాల బాటలో సాగడానికి, సామాన్యులకు అందుబాటులో శాస్త్రసాంకేతిక విప్లవ ఫలాలను నిలవటానికి, దేశ ఆర్థిక రంగం పరిపుష్టం కావడానికి సృజనశీల భావనలతో పాటు వినూత్న ప్రతిపాదనలతో కూడిన మేధో సంపత్తి ఆలోచనలు దోహదపడతాయనేది వాస్తవం. సాంప్రదాయ ప్రక్రియలకు ప్రత్యామ్నాయంగా క్రియాశీల, సరళ, బహుళ ప్రయోజన ఉపకరణాలు మార్కెట్‌లో ప్రవేశ పెట్టడానికి వినూత్న మేధో సంపత్తి అవసరం అవుతుందనే విషయాలను చర్చించడానికి ప్రతి ఏటా 26 ఏప్రిల్ రోజున విశ్వవ్యాప్తంగా 'ప్రపంచ మేధో సంపత్తి దినం (వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ డే)' పాటిస్తారు. వినూత్న ఆవిష్కరణలు, సృజనశీల ప్రక్రియలను ప్రోత్సహించే క్రమంలో మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుంది. ప్రపంచ మేధో హక్కుల దినం–2024 నినాదంగా 'ఐపి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు : వినూత్న ఆవిష్కరణలతో భవిష్యత్తు నిర్మాణం' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. కొన్ని దేశాల్లో ఏప్రిల్ 26 నుంచి 30 వరకు 'ప్రపంచ మేధో సంపత్తి వారోత్సవాలు' జరుపుకునే ఆనవాయితీ ఉన్నది. ప్రతి వ్యాపారానికి ఓ స్పష్టమైన ఆలోచన ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలు విస్తరించబడి ఉన్నాయి. ఓ ఆవిష్కర్త మెదడులో అంకురించిన వినూత్న సృజనశీల ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడం ద్వారా వ్యాపార సంస్థ ఆవిర్భవిస్తుంది. ఈ ఆలోచన విలక్షణతను కలిగి ఉన్నట్లైతే సామాన్యుని దృష్టిని ఆకర్షించి వ్యాపారం సత్వరమే వృద్ధి చెందుతుంది. మేధలో జనించిన నవ్య ఆలోచనలు మార్కెట్ అవసరాలకు అనుకూలంగా ఉండాలి. మార్కెట్‌లో సఫలమైన ఆలోచనలకు కారణమైన ఆవిష్కర్తలను, సృష్టి కర్తలను కొనియాడడానికి 'ప్రపంచ మేధో సంపత్తి దినం' వేదిక ఉపయోగపడాలి. ఆకర్షణీయ, ఉపయోగకరమైన వస్తువులు/ఉపకరణాలు/ఉత్పత్తులు/కంపెనీలు/పరిశ్రమలను ప్రోత్సాహపూర్వకంగా అభినందించడం మన కర్తవ్యంగా భావించాలి. సమాజ సేవతో పాటు దేశ ఆర్థిక గమనానికి ఊతం ఇవ్వగల చిన్న, మధ్య తరహా వ్యాపారాల ప్రగతి మేధో సంపత్తి మీదనే ఆధారపడి ఉండడంతో మేధో సంపత్తి హక్కులకు అధిక ప్రాధాన్యత సంతరించుకున్నది.

భారత ప్రభుత్వ వాణిజ్య మంత్రిత్వశాఖ పరిధిలోకి మేధో సంపత్తి హక్కులు వస్తాయి. వాణిజ్య రంగంలో ప్రముఖంగా వాడబడే కళా ఖండాలు, చిహ్నాలు, పేర్లు, చిత్రాలు (ఇమేజెస్) లాంటివి మేధో సంపత్తులుగా వర్గీకరించబడినవి. మేధో సంపత్తికి కారణమైన ఆవిష్కర్తకు సరైన హక్కులు, గుర్తింపు ఉండేలా చట్టాలు చేయబడ్డాయి. మేధో సంపత్తి హక్కులు రెండు రకాలుగా ఉంటాయి. సాహిత్య, కళాత్మక క్రియలకు సంబంధించిన 'కాపీ రైట్స్' కనీసం 50 ఏండ్లు వరకు ఉంటాయి. పారిశ్రామిక రంగంలో వాడే ట్రేడ్‌మార్కులు, జియోగ్రాఫికల్ ఇండికేటర్స్, పెటెంట్లు, చిహ్నాలు, డిజైన్లు, ట్రేడ్ సీక్రెట్లు లాంటివి కూడా మేధో సంపత్తి హక్కులుగా గుర్తించబడినవి. ఆవిష్కర్తలు, సృజనశీలురకు చట్టం ద్వారా హక్కులు ఇవ్వబడ్డాయి. మేధో సంపత్తి రంగంతో ఆర్థిక పురోగతి, ఉద్యోగ కల్పన, పారిశ్రామిక ప్రగతి, వ్యాపార వెసులుబాటు లాంటి ప్రయోజనాలతో పాటుగా సామాన్యుని జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఆవిష్కర్తకు పరిమిత కాల వ్యవధితో కూడిన మేధో సంపత్తి హక్కులు లభించటం వల్ల ఆవిష్కర్తలకు ప్రోత్సాహం/గుర్తింపు కలుగుతుంది. జాతీయ మేధో హక్కుల విధానం–2016 ప్రకారం 'క్రియేటివ్ ఇండియా బీ ఇన్నోవేటివ్ ఇండియా' నినాదంతో ముందు సాగడం జరుగుతున్నది. మేధో సంపత్తి హక్కుల పరిరక్షణకు 'డిపార్టుమెంటు ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్' నాయకత్వంలో 'సెల్ ఫర్ ఐపిఆర్ ప్రమోషన్ అండ్ మేనేజ్‌మెంట్' విభాగం విశేష కృషి చేస్తున్నది. ప్రపంచ ఆవిష్కరణ సూచిక (గ్లోబల్ ఇన్నోవేటివ్ ఇండెక్స్)–2023 నివేదిక ప్రకారం 166 దేశాల జాబితాలో భారత ర్యాంకు 46 ఇవ్వబడింది. ఇండియాలో ఐసిటి, సర్వీస్ ఎగుమతులు, వినూత్న వస్తు ఎగుమతులు, విశ్వవిద్యాలయ నాణ్యతలు లాంటివి ఇన్నొవేషన్ వృద్ధికి దోహదపడుతున్నాయి. గ్లోబల్ ఇన్నొవేటివ్ ఇండెక్స్ జాబితా తొలి ర్యాంకులో యుయస్ఏ, స్వీడెన్, సింగపూర్, స్విజర్లాండ్ ఉండగా తరువాత స్థానాల్లో నెథర్లాండ్, కొరియా, జర్మనీ, ఫిన్‌లాండ్, చైనా, జర్మనీ, బెల్జియమ్ లు ఉన్నాయి. ప్రపంచ ఆవిష్కరణ సూచిక జాబితాలో 46వ ర్యాంకు పొందిన భారత్‌లో నాణ్యమైన విద్యాసంస్థలు, ఉన్నత విద్య ప్రమాణాలు, మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, ఆవిష్కర్తల ప్రోత్సాహం, పరిశోధనలకు నిధులు లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఇన్నొవేషన్ రంగంలో మన దేశ ర్యాంకు మెరుగు పడుతుందనటంలో సందేహం లేదు. ఆధునికతకు, సరళ జీవన విధానానికి పునాది వినూత్న సృజనశీల ఆవిష్కరణ అని నమ్ముదాం. ఆవిష్కర్తలను అక్కున చేర్చుకుందాం.

# మళ్లీ నల్లధనంపైనే ఓట్లా?

2014లో యూపీఏ దశకం ముగిసిన తరువాత "నల్లధనం" అనే అంశాన్ని అందంగా ఆవిష్కరించి ఎన్నికలకు వాడుకున్న నరేంద్రమోదీ, తన పది సంవత్సరాల పరిపాలన తర్వాత తిరిగి అదే అంశంపై ఎన్నికలలో ఓట్లు అడగడం దేశ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు అనేక అనుమానాలకు తావు ఇచ్చినట్టు అవుతుంది. లేని గుజరాత్ మోడల్‌ను మీడియాలో ఉన్నట్లుగా భ్రమింపచేసి ప్రధాని కావాలన్న ఆకాంక్షను నెరవేర్చుకొని, ప్రజాస్వామ్య ప్రధాని నుంచి నియంతృత్వ రాజులాగా మారిపోతున్న మోదీని చూస్తుంటే చంద్రముఖి సినిమాలో గంగ కాస్త చంద్రముఖిగా మారే పరిణామక్రమం గుర్తుకు వస్తుంది. ఇక విషయానికి వస్తే 'నల్లధనం' అలియాస్ "కాలాధన్"మోదీ ఉచ్చరించి ఆచరించని ఒక అద్భుతం.దశాబ్ద కాలం క్రితం మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధాని హోదాలో పెట్టిన తొలి సంతకం నల్లధనం మీదనే. దానికి ఒక కమిటీని (ఎం.బి.షా కమిటీ) ఏర్పాటు చేస్తే ఆ కమిటీ వెలికితీసిన మొదటి పేరు గౌతమ్ ఆదాని, కానీ ఇప్పటి వరకు ఆదాని నుంచి నల్లధనాన్ని రికవరీ చేయకపోగా మోదీ స్వతహాగా అతనికి అండగా వుండి ప్రపంచంలోనే అగ్రగామి ధనవంతుడుగా తీర్చిదిద్దారు. మత భావోద్వేగాలేమో ప్రజల మెదడులోకి– దేశ ప్రజల సంపదేమో ఆదానీ, అంబానీల జేబులోకి అన్నట్టుగా దేశ స్థితిని దిగజార్చిన తర్వాత ఇప్పుడు రాజకీయాల్లో ఒక వికృత సంస్కృతిని తెచ్చిపెట్టారు. అదే "బలవంతపు వసూళ్లు–బెదిరింపు రాజకీయాలు". దీనికోసం ఎలక్ట్రోల్ బాండ్లను తెచ్చి రాజ్యాంగబద్ధ సంస్థలైన సీబీఐ,ఈడీలను, ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ అయినా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను తమ రాజకీయ అవసరాల కోసం వాడుకొని ఆర్థిక నేరగాళ్లకు రాజకీయ కోర్టులో క్లీన్ చీట్ ఇస్తున్నారు.అది ఎంతలా అంటే నువ్వు వ్యాపారస్తుడైవైతే బీజేపీ పార్టీకి బాండ్ రూపంలో విరాళాలు ఇవ్వాలి. ప్రతిపక్ష నాయకులు అయితే పార్టీలో నైనా చేరాలి, కాదు అంటే జైల్లో వుండాలి. బీజేపీ రాజకీయానికి ఒక మెండైన ఉదాహరణ. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న ప్రతిపక్ష పార్టీల పెద్ద తలకాయలు జైల్లో వుంటే, ఇదే కేసులో నోటీసులు అందుకున్న కీలక వ్యక్తి అయిన శరత్ చంద్రా రెడ్డి వెంటనే ఎలక్ట్రోల్ బాండ్ రూపంలో బీజేపీకి విరాళం ఇవ్వగానే సేఫ్ జోన్‌లో పడిపోయారు. ఒకే కేసులో ఇన్ని వైరుధ్యాలను చూస్తుంటే బీజేపీ ఈ ప్రక్రియ అంతా నల్లధనాన్ని తీయడానికి చేస్తున్నదా ..? లేక బెదిరించి ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టు ఆర్థికంగా లాభపడి రాజకీయ కక్షను తీర్చుకుంటుందా..? అనే అనుమానాలు దేశ ప్రజలకు రాక మానదు. ఈ మధ్య కాలంలో "వాషింగ్ పౌడర్ మోదీ" అనే నినాదం ప్రజల్లో బాగా వ్యాప్తి చెందుతోంది. ఈ నినాదం ప్రకారం ఎంత అవినీతి పరుడైనా సరే, బీజేపీలో చేరితే పతిత పావనం అయిపోయి పరిశుద్ధులుగా మారిపోతారు అని అర్థం.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేరా బీజేపీ పార్టీని ఒక "వాషింగ్ మిషన్"లాంటిదని అభివర్ణించారు. అక్రమంగా దేశ సంపదను దోచుకొని లక్షల కోట్ల నల్లధనాన్ని"దేశం దాటిస్తున్న దేశద్రోహులను బీజేపీలో చేర్చుకొని వారికి ఎంఎల్ఏ, ఎంపీలుగా టిక్కెట్లు ఇచ్చి చట్టసభల్లోకి పంపిస్తున్న మోదీ ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి చేస్తుందని ఇంకా ఎన్ని రోజులు ఈ దేశ ప్రజలు భ్రమలో బ్రతకాలి..? పరోక్షంగా మోదీ చేస్తున్న చర్యలను చూస్తుంటే ఆర్థిక నేరగాళ్లు దోచుకున్న సొమ్ము విదేశాల్లో వుండాలి, ఆర్థిక నేరస్థుడు ఏమో ప్రజా ప్రతినిదిగా చట్ట సభల్లో మోదీ ప్రక్కన వుండాలి అనేలా కనబడుతున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం అయిన అశోక్ చవాన్‌ను 2014 లో అప్పటి ప్రధాని అభ్యర్థిగా వున్న నరేంద్రమోదీ రాజకీయ ప్రసంగంలో భాగంగా ఆదర్శ్ చవాన్ (ఆదర్శ కుంభకోణంలో ప్రధాన నిందితుడు) అని నామకరణం చేసి ఆ కుంభకోణాన్ని ప్రధాన ఎన్నికల అస్త్రంగా వాడుకున్న విషయం దేశం ఇంకా మర్చిపోలేదు. కానీ ఇప్పుడు అదే అశోక్ చవాన్‌ను బీజేపీలోకి చేర్చుకొని రాజ్యసభ ఎంపీని చేసి 2024లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో స్టార్ కాంపెయినర్ పదవిని కట్టబెట్టారు.

ఇలా చాలామంది ఆర్థిక నేరగాళ్లను కాషాయమనే వాషింగ్ పౌడర్‌తో కడిగేసి ప్రజాస్వామ్యంలో మచ్చలేని నేతలుగా తీర్చిదిద్దుతున్న ఘనత మోదీ ప్రభుత్వానికే దక్కుతుంది."మాట వింటే రక్ష లేకుంటే కక్ష"అన్నట్లు దేశ రాజకీయలను మార్చేసి దేశ వనరులను భవిష్యత్ తరాలకు దక్కకుండా చేసి, ఆర్థిక అసమానతలకు సృష్టిస్తున్న బీజేపీకి ప్రజలు ఎందుకు ఓటు వేయాలి ...? బీజేపీ పార్టీ ఆడుతున్న ఈ జగన్నాటకంలో ప్రజలు అమాయకులు అవ్వడం తప్ప మరేమీ లేదు. ఒక అబద్దాన్ని పది సార్లు చెపితే నిజం అయ్యిపోతుంది అనే భ్రమలో మోదీ ఉన్నారనే అనడంలో సందేహం లేదు దానికి ఉదాహరణ కొద్దీ రోజుల క్రితం నాగర్ కర్నూలు ఎన్నికల సభలో 2%+% స్పెక్ట్రమ్ స్కామ్‌ను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటూ వచ్చారు. అసలు 2+ స్పెక్ట్రమ్ కేసులో నేరం జరిగినట్టు ఆధారాలను చూపించడంలో సీబీఐ ఫెయిల్ అయ్యినట్టు ట్రయల్ కోర్ట్ జడ్జిమెంట్ ఇచ్చి కేసును కొట్టివేసింది. ప్రధాని స్థాయిలో వున్న వ్యక్తి అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండడం ఎంత మాత్రం మంచిది కాదు. ఇలా ప్రజలను బహిరంగంగా మోసం చేస్తున్న బీజేపీ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పక మానరు.

## పార్లమెంట్ ఎన్నికల తర్వాత రేషన్ కార్డులు

హైదరాబాద్, ఏప్రిల్ 25 తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారుగా 20 లక్షల కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి. దాదాపు పదేళ్లుగా తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారం లోకి వచ్చాక రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని మూడు నెలల క్రితం ప్రకటించింది. తాజాగా ప్రజానీకానికి గుడ్ న్యూస్ చెప్పింది.తెలంగాణ ప్రభుత్వం మూడు నెలల క్రితం ఆరు గ్యారంటీల అర్హుల ఎంపిక కోసం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఇందులో రేషన్ కార్డు లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఇందులో 19 లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయి. తాజాగా వాటి పరిశీలనపై దృష్టిపెట్టింది. దరఖాస్తు చేసుకోనివారు ఉంటే రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అర్హులందరికీ రేషన్ కార్డు ఇస్తామని చెబుతోంది.ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించి తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కీలక సమాచారం వెల్లడించారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ షురూ అవుతుందని తెలిపారు. కోడ్ ముగిసిన వెంటనే అధికారులను దరఖాస్తుదారుల ఇంటికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామని పేర్కొన్నారు.ఇందిరమ్మ కమిటీలతో కలిసి రేషన్ కార్డుల జారీ కార్యక్రమం ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. జూన్ రెండో వారం నుంచి క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించి జూలైలో కొత్త కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అర్హత ఉన్న అన్ని కుటుంబాలకు రేషన్‌కార్డు అందితే.. పేద ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుంది

## ఆస్తులు లెక్కలు....

# షర్మిల సైలెన్స్ పై అనుమానాలు

కడప, ఏప్రిల్ 25 సోదరుడు జగన్ను షర్మిల వ్యతిరేకించడానికి ప్రధాన కారణం ఆస్తి వివాదాలే. పిత్రార్జితంగా వచ్చిన ఆస్తిని తనకు పంచలేదన్న బాధ ఆమెలో ఉంది. అన్న రాజకీయ ఉన్నతి కోసం ఎంతో బాధపడ్డానని.. కానీ అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం మానేశారని జగన్ పై షర్మిల ఆగ్రహంగా ఉన్నారు. రాజకీయంగా విభేదించడానికి అదే ప్రధాన కారణం.

అయితే తాజాగా తన ఆఫిడవిట్లో అన్న, వదినల నుంచి అప్పు తీసుకున్నానని షర్మిల కొంత మొత్తాన్ని చూపడం వ్యూహంగా తెలుస్తోంది. ఆ అప్పులనే ఆస్తులుగా పరిగణించాలని జగన్ తేల్చి చెప్పి ఉండవచ్చు. అంతటితో సంతృప్తి పడాలని చెప్పి ఉండవచ్చు. అయితే షర్మిల మాత్రం మాటల్లో చెప్పలేని బాధను వ్యక్తం చేస్తున్నారు. తన పిల్లలకు ఏమీ ఇవ్వలేకపోయాను అన్న బాధ ఆమెలో కనిపిస్తోంది. అయితే ఆమె ముందు న్యాయపోరాటం ఆప్షన్ ఉంది.

పిత్రార్జితంలో వాటా కూడా పొందే ఛాన్స్ కనిపిస్తోంది. కానీ ఆమె న్యాయపోరాటానికి ముందుకు రాకపోవడం విశేషం.అయితే అన్నతో విభేదాలు తారాస్థాయికి చేరాయి. చివరకు మేనల్లుడి వివాహానికి కూడా జగన్ వెళ్లలేని పరిస్థితికి అవి చేరుకున్నాయి. అయితే షర్మిల తాజా అఫిడవిట్లో అప్పుల వివరాలు ప్రస్తావించేసరికి వారి మధ్య ఆస్తి వివాదాలు మరోసారి ప్రస్తావనకు వచ్చాయి. అయితే షర్మిల ఇంతలా బాధపడే కంటే అన్న పై న్యాయపోరాటం చేస్తే న్యాయం జరిగేది. ఎన్టీఆర్ ఎప్పుడో ఆస్తిలో మహిళలకు సమాన హక్కు కల్పిస్తూ చట్టం తెచ్చారు. పిత్రార్జితంగా వచ్చిన ఆస్థిలో పిల్లలతో పాటు తల్లికి వాటా ఉంటుంది. అయితే వైయస్ ఆస్తులు ఏంటన్నది తెలియడం లేదు. సీఎం కాక మునుపు ఆయన హైదరాబాదులో ఇంటిని అమ్మకానికి చూపారు. కానీ ఆయన సీఎం అయిన తర్వాత కుమారుడు జగన్ రంగంలోకి దిగారు. పెద్ద ఎత్తున ఆస్తులు సమకూర్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆ ఆస్తులు పిత్రార్జితం కింద రావు. ఇప్పుడు షర్మిల పడుతున్న బాధ అదే. అలా వైయస్ సంపాదించిన ఆస్తులన్నీ ఇప్పుడు జగన్ చేతిలో ఉన్నాయి. అలాగని అవన్నీ పిత్రార్జితంగా చూపుతామంటే కాదు. జగన్ తనకు తానుగా ఉదార స్వభావంతో షర్మిలకు ఇస్తే ఏ ఇబ్బంది ఉండేది కాదు. కానీ సోదరికి ఇచ్చిన అప్పులనే ఆస్తులుగా చూసుకోవాలని చెప్పినట్టు ఉన్నారు. ఒకవేళ అది అప్పులు అయి ఉంటే.. విభేదాలు తారాస్థాయికి చేరుకున్న తరుణంలో ఏనాడో షర్మిల వాటిని తీర్చి ఉండేవారు కదా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.అయితే చాలా వరకు ఆస్తులను జగన్ సైతం తన అఫిడవిట్ లో చూపలేదు. లోటస్ పాండ్ ఎవరిది? తాడేపల్లి ప్యాలెస్ ఎవరిది? యలహంక ప్యాలెస్ ఎవరిది? బెంగళూరు మంత్రి మాల్ ఎవరిది? పులివెందుల, కడప నగరాల్లో భవనాలు ఎవరివి? అన్నది పొందుపరచలేదు. కానీ అవన్నీ అక్రమ మార్గంలో సమకూర్చుకున్నవన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే షర్మిల వాటిపై న్యాయపోరాటం చేయలేరు. పిత్రార్జితంగా చూపించలేరు. తన అన్న తనంతట తానుగా పంచి ఇస్తే మాత్రమే షర్మిల తీసుకోగలరు. కానీ జగన్ ఆ పని చేయడం లేదు. అందుకే రాజకీయంగా దెబ్బతీసి తన పంతాన్ని నెగ్గించుకోవాలన్న ఆలోచనలో షర్మిల ఉన్నారు. అంతకుమించి వేరే ఆలోచన కనిపించడం లేదు.

# అవసరమైతే ఎన్డీయేకు జగన్ మద్దతు

విజయవాడ, ఏప్రిల్ 25, ఎన్నికల తర్వాత కేంద్రంలో నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ కు బలం తగ్గితే మద్దతు ఇస్తామని నేరుగా వైసీపీ అధినేత జగన్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ కార్మికులతో సమావేశమైనప్పుడు ఎన్డీఏకు మెజార్టీ రాకపోతే తాను మద్దతు ఇచ్చి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకుండా హామీ తీసుకుంటానని అన్నారు. ఎన్డీఏకు మెజార్టీ తగ్గుతుందా లేదా .. జగన్మోహన్ రెడ్డి పార్టీకి మద్దతు ఇచ్చేంత సీట్లు వస్తాయా లేదా అన్న విషయం పక్కన పెడితే మద్దతు ఇస్తామన్న ఓ స్ట్రాటజీని మాత్రం బయట పెట్టారు. ఆయన ఆలోచనల్లో ఇండియా కూటమి లేదు. మూడో కూటమి అనే ఆలోచన లేదు. తటస్థం అన్న ఆలోచన కూడా లేదు. అవసరం అయితే ఎన్డీఏకే మద్దతు అని చెప్పారని అనుకోవచ్చు. వైసీపీ కీలక నేత, మంత్రి అంబటి రాంబబా? కూడా ఓ టీవీ చానల్ చర్చలో అదే మాట్లాడారు. అంటే వైసీపీలో ఎన్నికల తర్వాత కూడా ఎన్డీఏకే మద్దతు అన్న ఓ స్ట్రాటజిక్ నిర్ణయం అని అర్థమవుతుంది. అదే కూటమిలో తాను పోరాడుతున్న టీడీపీ, జనేసన ఉన్నప్పటికీ జగన్ మద్దతివ్వాలని ఎందుకు అనుకుంటున్నారు ?2014 నుంచి వైఎస్ఆర్‌సీపీ తన విధానాన్ని బీజేపీకి దగ్గరగానే ఉంచుకుంది. ఎప్పుడూ ఆ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించలేదు. 2014లో కూడా ఇప్పుడు కూటమి కట్టినట్లే అప్పుడు కూడా టీడీపీ, బీజేపీ, జనసేన కూడా కూటమి కట్టాయి. విజయం సాధిం?చయి. జనసేన పార్టీ ఎన్నికల్లో పోటీ చేయలేదు కానీ.. పవన్ కల్యాణ్ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పుడు జనేసన పార్టీ కూడా బరిలో ఉంది. వైఎస్ఆర్‌సీపీపై తీవ్రమైన విమర్శలతో విరుచుకుపడుతున్నారు. 2014లో అప్పట్లో వైసీపీ ఎలాంటి అధికారం అనుభవించలేదు. అందుకే ఆ పార్టీపై ఇప్పుడు చూపిస్తున్నంత వ్యతిరేకత చూపించలేదు. కానీ బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండటంతో .. వైఎస్ఆర్‌సీపీ కూడా బీజేపీతో సన్నిహితంగా ఉంది. కారణం ఏదైనా జగన్మోహన్ రెడ్డితో బీజేపీ పెద్దలు సన్నిహిత సంబందాలు నెరపుతున్నారన్న ఉద్దేశంతోనే టీడీపీ కూటమి నుంచి బయటకు వచ్చిందన్న విశ్లేషణలు కూడా వచ్చాయి. కానీ వైఎస్ఆర్‌సీపీ కూటమిలో చేరే రాజకీయ పరిస్థితులు లేవు. గత ఎన్నికల సమయంలో విడివి?గా పోటీ చేసిన పార్టీలు.. ఇప్పుడు కలిస పోయాయి. విడివిడిగా పోటీ చేసినప్పుడు బీజేపీ.. వైఎస్ఆర్‌సీపీకి సహకరించిందన్న అభిప్రాయాలు గట్టిగానే ఉన్నాయి. రాష్ట్రంలో ఎలాంటి రాజకీయాలు ఉన్నా కేంద్రంలో మాత్రం వైఎస్ఆర్‌సీపీ .. బీజేపీకి నేరుగా సహకరించింది. బీజేపీకి లోక్ సభలో తిరుగులేని మెజార్టీ ఉన్నా రాజ్యసభలో మాత్రం మెజార్టీ లేదు. వైఎస్ఆర్‌సీపీ సభ్యుల మద్దతుతోనే దాదాపుగా ప్రతి కీలకమన బిల్లును నెగ్గించుకున్నారు. బీజేపీ అడగాల్సిన అవసరం కూడా రాలేదు. వైఎస్ఆర్‌సీపీ మద్దతుగా ఎప్పుడూ రెడీగానే ఉంది. వివాదాస్పదమైన సీఏఏ, రైతు చట్టాలకు కూడా మద్దతు తెలిపారు. అయితే ఖచ్చితంగా వైసీపీ ఎంపీల మద్దతు అవసరం అయినప్పుడు రాష్ట్రానికి కావాల్సిన ప్రత్యేకహోదా ఇతర అంశాలపై డిమాండ్ చేయలేదన్న విమర్శలు వైఎస్ జగన్ పై ఉన్నాయి. లోక్ సభ ఎంపీల గురించే ఆయన చెబుతున్నారు కానీ రాజ్యసభ ఎంపీల లోటు వచ్చినప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం డిమాండ్ చేయలేదని.. దానికి కారణం బీజేపీతో ఆయన విబేధించే పరిస్థితి లేకపోవడమని టీడీపీ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఏపీలో ఇప్పుడు వైసీపీని ఓడించడానికి టీడీపీ, జనసేనతో బీజేపీ కలిసింది. అయినా బీజేపీపై పల్లెత్తు మాట అనడం లేదు సీఎం జగన్. పైగా ఢిల్లీలో బీజేపీకే మద్దతిస్తామన్న సంకేతాలు పంపుతున్నారు. తమ పార్టీని ఓడించడానికి కూటమిగా ఏర్పడిన పార్టీని విమర్శించుకుండా తర్వాత తాను మద్దతుగా ఉంటానని చెప్పడం వైసీపీ పొలిటికల్ స్ట్రాటజీలో ఏదో లోపం ఉన్న అభిప్రాయానికి వచ్చేలా చేస్తోంది. రేపు ఢిల్లీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే అందులో టీడీపీ, జనసేన భాగంగా ఉంటాయి. ఆ సమయంలో తమకు రాజకీయంగా ఇబ్బందులు ఎదురవకుండా ఉండటానికే బీజేపీతో సాఫ్ట్ గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ప్రతిపక్ష పార్టీల నుంచి వస్తున్నాయి. జగన్ మోహన్ రెడ్డిపై పలు రకాల కేసులు ఉన్నాయి. ఆ కేసుల భయంతోనే ఆయన ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ఇలా ఉపయోగిస్తున్నారని.. విమర్శలు గుప్పిస్తున్నారు. ఏపీలో ఏ పార్టీ గెలిచినా ఎన్డీఏకే మద్దతు అనే ప్రచారం బీజేపీ .. పొత్తులు పెట్టుకోక ముందు ఉంది. అంటే వైసీపీ ఎంపీ సీట్లు గెలిచినా.. టీడీపీ ఎంపీ సీట్లు గెలిచినా బీజేపీకే మద్దతిస్తాయని అర్థం. అయితే అది బీజేపీ ఓ ఓ పార్టీ కూటమిలో చేరక ముందు. ఇప్పుడు టీడీపీ, జనసేన , బీజేపీ ఓ కూటమిగా ఏర్పడ్డాయి. మరి వైసీపీ వ్యతిరేకమవ్వాలి. కానీ కాలేమని చెబుతోంది.

అంటే.. ప్రజలు కూడా అలా అయితే ఎన్డీఏ కూటమికే ఓటు వేయవచ్చు కదా అనే ఆలోచనకు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటి ప్రమాదం ఉన్నా జగన్ తాను ఎన్డీఏ కూటమి వైపే ఉంటానని సంకేతాలు పంపుతున్నారు. ఇది రాజకీయంగా వైఎస్ఆర్‌సీపీకి మేలు చేస్తుందా లేదా అన్నది ఎన్నికల ఫలితాల తర్వాత తెలుతుంది.

# ఆమ్ ఆద్మీ పార్టీ భవిష్యత్తు ఏంటీ....

దేశ రాజధాని ఢిల్లీ పాలన అనిశ్చితంగానే కొనసాగుతున్నది. ఆప్, బిజెపి రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాల మధ్య ఢిల్లీ గమ్యం ఎటు, ఈ ప్రభుత్వ భవితవ్యం ఏమిటన్నది ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఆప్ ఇటీవలి వరుస ఎన్నికల పరాజయాల వల్ల రాజకీయంగా పగిలిపోయింది మరియు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం చారిత్రక ఆదేశాన్ని నాశనం చేసిందని బీజేపీకి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచే సువర్ణావకాశాన్ని పూర్తిగా తిరస్కరించే స్థితిలో ఉంది. ఘర్షణాత్మక ఎన్‌కౌంటర్లు మరియు వ్యతిరేక రాజకీయాలు వారి ఎన్నికల పునాదిని క్షీణింపజేశాయి.ఢిల్లీలో మే 25న ఎన్నికలు జరగబోతుండడంతో ఈ అనిశ్చిత పరిస్థితులకు కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీహార్ జైలు నుంచి పాలన సాగించేందుకు జైలు నిబంధనలు అనుమతించకున్నా ఆయన అక్కడి నుంచే పాలన సాగిస్తున్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని లెఫ్టినెంట్ గవర్నర్ సక్సేనా చెబుతూ ప్రత్యామ్నాయ ముఖ్యమంత్రిని ఎన్నుకోవాలని కోరుతున్నారు.రాష్ట్రపతి పాలన తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు. తన స్థానంలో మరో ముఖ్యమంత్రిని ఎన్నుకునే అవకాశమున్నా బిజెపి రాష్ట్రపతి పాలన విధిస్తే అది ఎన్నికల్లో తమకు అనుకూలిస్తుందని కేజ్రీవాల్ ప్రత్యామ్నాయ సిఎంను ప్రకటించడం లేదు. ఇది గ్రహించిన బిజెపి కూడా రాష్ట్రపతి పాలనకు తొందరపడడం లేదు. దీనితో ఢిల్లీ పాలన గందరగోళం మరి కొంత కాలం కొనసాగే అవకాశాలున్నాయి. ఈ కేసులోని విచారణపరమైన అంశాలతో సంబంధం లేకుండా కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని నిర్ధారించడానికి వీలులేని పరిస్థితి ఎదురైంది. దీంతో ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం అగ్నిపరీక్షలో పడింది. కేజ్రీవాల్ జైలులో ప్రతివారం ఇద్దరు మంత్రులతో ఆయా విభాగాలకు సంబంధించి పాలనా పరమైన అంశాలపై చర్చిస్తారని, సమీక్షించి ఆదేశాలు జారీ చేస్తారని ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటించింది.జైలు మేన్యువల్ నిబంధనల ఆచరణ చర్చకు దారి తీసింది. జ్యుడీషియల్ కస్టడీలో ముఖ్యమంత్రులు ఉన్నప్పుడు కల్పించిన అవకాశాలను ఆసరా చేసుకుని కేజ్రీవాల్ జైలు మేన్యువల్ గ్యాప్‌ను ఉపయోగించుకుంటున్నారని, జైలు అధికారులు కూడా దీనికి అనుమతిస్తున్నారన్న అభిప్రాయం వస్తోంది. అయితే జైలు మేన్యువల్ కార్యాచరణ (మోడస్ ఆపరెండి) అలా లేదు. ముఖ్యమంత్రిగా జైలులో బాధ్యతలు నిర్వర్తించే అవకాశం అది కల్పించడం లేదు. కేబినెట్ సమావేశాలు నిర్వహించడం కానీ, ఫైళ్లను సమీక్షించడం కానీ జైలు మేన్యువల్ ప్రకారం వీలుకాదు. ముఖ్యమంత్రిగా కొనసాగడానికి కేజ్రీవాల్‌కు చట్టపరమైన అర్హత ఉన్నప్పటికీ, ఆ విధంగా విధులు నిర్వహించడానికి జైళ్ల మార్గదర్శకాలు ఒప్పుకోవు. ఈ విషయంలో ఖైదీల హక్కుల పరంగా జైలు మేన్యువల్ చాలా నిర్మాణాత్మకంగా ఉంది.విచారణలో ఉన్న ఖైదీలు తమ కుటుంబీకులకు, సన్నిహిత బంధువులకు, స్నేహితులకు, న్యాయవాదులకు ఆస్తికి సంబంధించిన వివాదాలపైనే సమాలోచనలు చేయవలసి ఉంటుంది. అలాగే ఆ మేరకు లిఖితపూర్వకంగా డాక్యుమెంట్లపై సంతకాలు చేయడానికి వీలుంటుంది. అంతేకానీ రాజకీయ చిక్కులతో ముడిపడి ఉన్న ఏ వ్యవహారంపైనయినా, సంబంధిత డాక్యుమెంట్లపై సంతకం చేయరాదు. ఈ నిబంధన జైలులో ఉన్న ఏ ముఖ్యమంత్రికైనా వర్తిస్తుంది.ముఖ్యమంత్రిగా సమర్ధవంతంగా పనిచేసే అవకాశం ఈ నిబంధన కల్పించదు. ఈ కారణంగానే భూమి వ్యవహారంలో మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను గత ఫిబ్రవరిలో ఇడి అరెస్ట్ చేసినప్పుడు ముఖ్యమంత్రిగా పాలన సాగించలేని పరిస్థితి ఏర్పడింది.అరెస్ట్ అయిన తరువాత ముఖ్యమంత్రిని ఎన్నుకోవలసిన అవసరం ఏర్పడింది. రెండు రోజుల తరువాత జార్ఖండ్ ముక్తిమోర్చా నేత చంపాయి సోరెన్‌ను అక్కడి ప్రభుత్వం ముఖ్యమంత్రిగా నియమించుకుని ప్రమాణ స్వీకారం చేయించింది. నిబంధనల ప్రకారం లెజిస్లేటివ్ సభ్యుడు ఎవరైనా ఏదైనా కేసుల్లో అరెస్ట్ అయినప్పుడు జైలు నుంచి శాసన సభ స్పీకర్‌తో మాత్రమే సంప్రదింపులు జరపవలసి ఉంటుంది. కేజ్రీవాల్ విషయంలో అలా ఏం జరగడం లేదు. తన వారసునిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చట్టపరంగా ఎవరికీ అప్పగించలేదు. అధికారికంగా ప్రభుత్వంలో ఎలాంటి హోదాలేని తన భార్య సునీతకు, పార్టీ ఎంఎల్‌ఎలకు, కార్యకర్తలకు జైలు నుంచే ఆదేశాలు అందిస్తున్నారు. తనతో పాటు ఆరుగురే తన ఆదేశాలు అమలు చేసేవారిగా కేజ్రీవాల్ చెబుతున్నారు.ఈ ఆరుగురిలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా ఉన్నారు. కానీ చట్టపరంగా ఇదెంత వరకు ఆచరణయోగ్యం అన్నది ప్రశ్న. ఢిల్లీలో ఇప్పుడు రాజ్యాంగపరమైన పాలన విచ్ఛిన్నమైందన్న వాదన వస్తోంది.

1991లో రాజ్యాంగంలో చేరిన ఆర్టికల్ 239 ఎబి ఆధారంగా లెఫ్టినెంట్ గవర్నర్ ఢిల్లీలో పరిపాలన నిబంధనల ప్రకారం సాగడంలేదని చెబుతూ రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేసే అవకాశం కూడా కనిపిస్తోంది.ఈ నేపథ్యంలోఅసాధారణ పద్ధతిలో ఢిల్లీ పాలనా వ్యవహారాలను ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సాగించడం తనతోపాటు తన పార్టీని రాష్ట్రపతి పాలన చట్రంలో ఇరుక్కునేలా చేయడమవుతుంది.

అందుకని ముఖ్యమంత్రి పదవి నుంచి కేజ్రీవాల్ వైదొలగి, లోక్‌సభ ఎన్నికల ప్రచారంపైనే దృష్టి కేంద్రీకరిస్తే చట్టపరమైన చిక్కులు తగ్గుతాయని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు

## లారీని ఢీకొన్న కారు..ఆరుగురు మృతి

కోదాడ సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని దుర్గాపురం స్టేజి వద్ద జాతీయ రహదారిపై తెల్లవారుఝూమున భారీ ప్రమాదం చోటు చేసుకుంది. లారీని వెనక నుండి కారు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు మృతి చెందారు. కారులో నలుగురు పురుషులు, ఒక మహిళ పాప వున్నారు. వీరు హైదరాబాదు నుండి విజయవాడ వెళుతున్నట్టు గా తెలుస్తుంది.. బ్రేక్ డౌన్ అయిన లారీ రోడ్డుపై హైవే పక్కనే నిలబడంతో ఈ ప్రమాదం జరిగినట్టు ప్రాథమిక సమాచారం. గత మూడు రోజుల క్రితం కూడా ఇదే విధంగా టిప్పర్ కారు ఢీకొనడంతో యువ జంట మృతి చెందిన సంఘటన మరువకముందే మరోసారి కోదాడ ప్రాంతంలో ప్రమాదం జరగడం దురదృష్టకరం. వేసవి కావడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లేవాళ్లు రాత్రిపూట ప్రయాణం చేయడం, రోడ్డుపై ఆగి ఉన్న వాహనం గమనించకపోవడంతో ఈ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

### తెలంగాణ రాష్ట్ర

## సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 25 రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేసింది. అయితే, సైబర్ నేరాలకు సంబంధించి విచారణలో దేశానికే మార్గదర్శకంగా ఉన్న తెలంగాణ పోలీస్ శాఖ మరో ముందడుగు వేసింది. నేరాలు జరుగుతున్న తీరును అధ్యయనం చేసి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి ఆర్బీఐకు తాజాగా కొన్ని సూచనలు చేసింది. ఫిర్యాదు చేసినప్పటికీ సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల కొల్లగొట్టిన డబ్బు బాధితునికి రావడం లేదని గుర్తించారు. ఈ క్రమంలో అనవసర జాప్యం నివారిస్తే ఫలితం ఉంటుందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఆర్బీఐకి సూచించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే లావాదేవీ నిలిపేసేందుకు బ్యాంకులు అవసరమైతే ఓ కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. తద్వారా ఏ బ్రాంచి ద్వారా డబ్బు పోయింది, ఏ బ్రాంచిలో జమైంది వంటి వివరాలన్నీ క్షణాల్లోనే తెలిసిపోతాయని వారు పేర్కొన్నారు. కాగా, సైబర్ నేరాల నియంత్రణకు జాతీయ స్థాయిలో సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్, దీనికి అనుబంధంగా 1930 నెంబర్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అక్కడి సిబ్బంది బాధితుడి నుంచి వివరాలన్నీ సేకరించి వాటిని సంబంధిత బ్యాంకుకు అందజేస్తారు. బాధితుడి ఖాతా నుంచి ఏ ఖాతాలో డబ్బు జమైందో బ్యాంకు గుర్తించి సదరు లావాదేవీని వెంటనే నిలిపేయాల్సి ఉంటుంది. అయితే, బ్యాంకుల మధ్య సమన్వయం లేకపోవడం, అవగాహన లోపం వల్ల త్వరగా స్పందించడం లేదు. ఈ అంశాలపైనే రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో.. ఆర్బీఐకు కీలక సూచనలు చేసింది. సైబర్ భద్రతా ప్రమాణాలపై తాము చేసిన సూచనలను అమలు చేసేందుకు ఆర్బీఐ అంగీకరించిందని అధికారులు తెలిపారు

# విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు


హైదరాబాద్, ఏప్రిల్ 25 లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో దేశవ్యాప్తంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే.. కానీ, హైదరాబాద్ మహానగరం పరిధిలోని పలు వార్డులలో ముఖ్యంగా పాతబస్తీ పరధిలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందా లేదా అనే అనుమానం కలుగుతుంది. ఎన్నికల కోడ్ పుణ్యమా అని బెల్ట్ దందా లాభసాటిగా ఉండడంతో గతంలో కేవలం కిరాణా షాపులు మాత్రమే నిర్వహించేవారు కూడా నిబంధనలకు విరుద్ధంగా వార్డులలోని కిరాణా షాపుల్లో శీతల పానీయాలకు తోడుగా కొత్తగా బెల్ట్ దందా షురూ చేయడం గమనార్హం. ఎటువంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపుల్లో బ్రాండెడ్ మద్యం తెల్లవారుజాము నుండి అర్ధరాత్రి వరకు ఎంతైనా దొరుకుతుందని పేర్కొంటున్నారు. దీంతో యువత మద్యానికి బానిసలుగా మారి తాగిన మైకంలో గొడవలకు దీగుతున్నారని.. బెల్టు దుకాణాల మధ్య ఉన్న ఇండ్ల యజమానులు ఆరోపిస్తున్నారు. ఇలా నగరంలోని బెల్ట్ షాపుల దందా విచ్చలవిడిగా కొనసాగుతున్న చర్యలు మాత్రం సున్నాఅని అంటున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న వైన్స్ షాపుల నుండి పట్టణంలోని బెల్ట్ షాపులకు ఆటో, బైకుల ద్వారా యధేచ్చగా మద్యం సరఫరా చేస్తూ ప్రతి గల్లీల్లో కూడా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. అన్ని విషయాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను అమలు చేస్తున్న అధికారులు మద్యం విషయంలో మీనమేషాలు లెక్కిస్తూ లోపాయి కారంగా బెల్ట్ షాపు యాజమాన్యానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిరంతరం నిఘా ఉన్నప్పటికీ ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు ఎన్నికల డ్యూటీలో గస్తీ కాస్తున్నా ఇంత ఈజీగా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా ఎలా అవుతుందని..? నగరంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు ఎలా జరుగుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ చార్మినార్, చత్రినాక, బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా ప్రాంతాల్లో దాదాపు ప్రతి కిరాణా షాపు, కూల్ డ్రింక్ షాపులు ఒక బెల్ట్ షాపుగా మారి ఎమ్మార్పీ ధరలకు మార్కెట్లో దొరకాల్సిన మద్యాన్ని రూ.20నుండి రూ. 50 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్న ఎవరూ నోరు మెదపకుండా చోద్యం చూస్తూ ఉండిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అప్పుడప్పుడు చుట్టపు చూపుగా వచ్చి అడపాదడపా ఒకటి రెండు కేసులు నమోదు చేస్తున్నారు. కానీ అందరికీ తెలిసే అధికారికంగా బెల్ట్ దందా జోరుగా నడుస్తుందని మద్యం ప్రియులే బహిరంగంగా మాట్లాడుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ పరిధిలో నగరంలోని అన్ని బెల్ట్ షాపుల దందా జోరుగా సాగుతుంది. బెల్ట్ షాపుల దందాను అరికట్టాల్సిన ఎక్సైజ్ పోలీసులు, పోలీసులు బెల్ట్ షాపు యాజమాన్యం ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.మరోవైపు ఇళ్ల మధ్యలోనే బెల్ట్ దందా కొనసాగడంతో మహిళలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోకపోవడంతో అధికారుల అండదండలతో కొనసాగుతున్నాయనేది ప్రధానంగా వినిపిస్తున్నమాట. దీనితో అసలు ఇక్కడ ఎన్నికల కోడ్ అమలులో ఉందా లేదా అనేది అర్ధం కావడం లేదని సామాన్యులు సైతం వాపోతు న్నారు. అదే అదునుగా భావించిన రాజకీయ నాయకులు మద్యం మత్తులో ప్రజలను మభ్యపెట్టి ఓట్లకు గాలం వేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు సజావుగా జరగాలంటే బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

# కాజీపేట బ్రిడ్జికి మోక్షం ఎప్పుడు

వరంగల్, ఏప్రిల్ 25 హనుమకొండ, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న కాజీపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి, ఏడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనులు ఇంకా నత్త నడకన కొనసాగుతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రజల రాకపోకలు దృష్ట్యా 1972 లో హైదరాబాద్, హనుమకొండ రోడ్డు మార్గంలో కాజీపేట రైల్వే లైన్ పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పెరిగిన రద్దీకి ఇప్పుడు రాకపోకలు సాగిస్తున్న బ్రిడ్జి సరిపోక ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత బ్రిడ్జికి సమాంతరంగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో 2017 సంవత్సరంలో రూ.78 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం పనులు మొదలయ్యాయి. ఏడు సంవత్సరాలు గడిచినా పనులు నత్తనడకన సాగుతున్నాయి.ట్రై సిటీస్‌గా పేరున్న వరంగల్ నగరంలో కాజీపేట ఒకటి. హైదరాబాద్‌కు వెళ్లాలంటే ప్రధాన రోడ్డు మార్గమైన కాజీపేట మీదుగా వెళ్లాలి. అయితే హైదరాబాద్ కు వెళ్లే రోడ్డు మార్గంలో కాజీపేట రైల్వే లైన్ ఉండడంతో 1972లో ప్రజల అవసరాలు, వాహనదారుల రాకపోకల దృష్ట్యా రైల్వే లైన్ పై ఓవర్ బ్రిడ్జి నిర్మించడం జరిగింది. అయితే అప్పటి రద్దీకి అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరిగింది. సిటీ విస్తరించటం హైదరాబాద్ కు రాకపోకలు పెరగడంతో అప్పటి బ్రిడ్జి ఇరుకుగా మారడంతో, తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. చిన్న ప్రమాదం జరిగినా, భారీ వాహనాలు సాంకేతిక లోపంతో బ్రిడ్జిపై నిలిచిన గంటల తరబడి ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. అంతే కాకుండా పాత బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడం, భారీ వాహనాలు వెళ్లినప్పుడు బ్రిడ్జి ధ్వసం అవుతుండడంతో ప్రమాదాన్ని గమనించిన అప్పటి ప్రభుత్వం పాత బ్రిడ్జికి సమాంతరంగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి 78 కోట్ల నిధులు మంజూరు చేసింది.2017 సంవత్సరంలో ప్రారంభమైనా, ఇప్పటికీ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రైల్వే లైన్ కు ఇరువైపులా 80 శాతం పనులు పూర్తయిన రైల్వే లైన్ పై చేపట్టాల్సిన పనులు నిలిచిపోయాయి. అయితే రైల్వే లైన్ పై బ్రిడ్జి పనులు పూర్తి చేయడానికి ఏళ్ల తరబడి వేచి చూస్తున్నారు వాహనదారులు. రైల్వే లైన్ పై బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టాలంటే రైల్వే జీఎం నుంచి అనుమతులు రావడం, రైల్వే నిబంధనల ప్రకారం వారి అధికారుల సమక్షంలో పనులు చేయాల్సి ఉంటుంది. అయితే రైల్వే అధికారుల నుండి అనుమతులు రాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రైల్వే లైన్‌పై నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపెట్టకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని విమర్శలున్నాయి. కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ రెండు సార్లు ఎన్నికల్లో గెలిచి దాదాపు 10 ఏళ్లు అధికారంలో కొనాసగింది. గత ప్రభుత్వంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలైనా, దాదాపు ఏడేళ్లు పూర్తయినా పనులు పూర్తి కాదేలు. ఈ క్రమంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో బ్రిడ్జి పనులు ఇప్పటికైనా పూర్తి అవుతాయా.. లేక పాత లెక్కలు పరిశీలించడంతో మరింత ఆలస్యం జరిగే ఛాన్స్ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు చొరవ చూపి రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేయాలని వాహనదారులతో పాటు నగర ప్రజలు కోరుకుంటున్నారు.నూతన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో మొదట్నుంచీ అడ్డంకులు ఎదురవుతున్నాయి. సమాంతర బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి ల్యాండ్ సేకరించడంతో పాటు బ్రిడ్జి నిర్మాణ పనుల టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం అప్పటి ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. పనులు ఎప్పటికి పూర్తవుతాయోనని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు

# భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్

## –నేడు ఆయన వర్ధంతి



అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త మన శ్రీనివాస రామానుజన్. 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఉత్తర అర్కాట్ జిల్లా ఈరోడ్‌లో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టాడు. ఆయన తలిదండ్రులు కోమలమ్మాళ్, శ్రీనివాస అయ్యంగార్. పన్నెండేళ్ల వయసులోనే అసాధారణ బాలునిగా గుర్తింపు పొందిన రామానుజన్ 'ఆయిలర్' సూత్రాలు, త్రికోణమితికి చెందిన అనేక సమస్యలను స్వయంగా సాధించాడు. రామానుజన్‌లోని తెలివితేటలను బయటకు తీసుకువచ్చిన గ్రంథం కార్ రాసిన 'సినాప్సిస్', అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్ద పెద్ద ప్రొఫెసర్‌లు సైతం ఎన్నో పుస్తకాలు రిఫర్ చేసినా అర్థం చేసుకోలేకపోయిన సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవాడు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం తెలియకపోవడంతో వాటిని తన పద్ధతితో సాధించాడు. కుంభకోణం గవర్నమెంటు కాలేజీలో చేరిన రామానుజన్ ఎఫ్.ఎ. పరీక్ష తప్పాడు. తర్వాత మద్రాస్‌లోని పచ్చయ్యప్ప కాలేజీలో చదువుకు చేరాడు. అక్కడ గణితోపాధ్యాయునిగా ఉన్న ఎన్.రామానుజాచారి సమస్యలను కఠినంగా చెప్తుంటే, రామానుజన్ వాటిని తనదైన రీతిలో తక్కువ సోపానాలతో సాధించే వాడు. రామానుజన్ ప్రతిభను గమనించిన ప్రొఫెసర్ సింగారవేలు ముదలియార్, రామానుజన్‌తో కలిసి మ్యాథమెటికల్ జర్నల్స్‌లో క్లిష్టమైన సమస్యలను చర్చించి సాధిస్తుండేవారు. తర్వాత రామానుజం 1909లో జానకి అమ్మాళ్‌ను పెళ్లి చేసుకున్నాడు. మ్యాజిక్ స్క్వేర్స్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, ప్రధాన సంఖ్యలు, పార్టిషన్ ఆఫ్ నంబర్స్, ఎలిప్టిక్ ఇంటిగ్రల్స్ వంటి విషయాలపై పరిశోధనలు కొనసాగించేవాడు. 1913లో మద్రాస్ పోర్ట్‌ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డా?వాకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి, రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్డ్ హార్డి (1877–1947)కి పంపాడు. ఉన్నతస్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జి.హెచ్.హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. అక్కడ రాత్రనకా, పగలనకా గణితం పైనే ఏకాగ్రత పెట్టి కొత్త సిద్ధాంతాలను కనిపెట్టాడు రామానుజన్. ఫిబ్రవరి 28, 1918లో 'ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ' గౌరవం పొందిన రెండవ భారతీయుడిగా, 1918 అక్టోబర్‌లో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజ' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా చరిత్రకెక్కాడు. 1919 మార్చిలో భారతదేశానికి తిరిగి వచ్చాడు. మనదేశ ఔన్నత్యాన్ని జగతికి చాటిన రామానుజన్, అనారోగ్య కారణంగా చివరకు ఏప్రిల్ 26, 1920న అస్తమించాడు. అప్పటికి ఆయన వయసు 33. చివరిదశలో 'మ్యాజిక్ స్క్వేర్', 'ప్యూర్ మాథ్స్‌కు చెందిన నంబర్ థియరీ', 'మాక్ తీటా ఫంక్షన్స్' చాలా ప్రసిద్ధి పొందాయి. వీటి ఆధారంగా ఆధునికంగా కనుగొన్న స్ట్రింగ్ థియరీ, క్యాన్సర్ పరిశోధనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని 1986–87 రామానుజన్ శతజయంతి ఉత్సవాల్లో గణిత శాస్త్రవేత్తలు ప్రకటించారు. రామానుజన్ నోటు పుస్తకాలపై, గణిత సిద్ధాంతాలపై రామానుజన్ ఇనిస్టిట్యూట్‌లో, అమెరికాలోని 'ఇలినాయిస్' యూనివర్సిటీలో నేటికీ రీసెర్చ్ జరుగుతోంది. గణితశాస్త్రంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును 'జాతీయ గణితదినోత్సవం'గా ప్రకటించింది.

# ఆ 25 మంది ఎమ్మెల్యేలు ఎవరు... మైండ్ గేమేనా..

హైదరాబాద్, ఏప్రిల్ 25 తెలంగాణ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల వేళ? అధికార కాంగ్రెస్ టార్గెట్‌గా బీజేపీ, బీఆర్‌ఎస్ వేస్తున్న ఎత్తులు హస్తం పార్టీని డిఫెన్స్‌లో పడేస్తున్నాయి. ఒకవైపు రేవంత్ సర్కార్ పడిపోతుందని ఇప్పటికే రెండు పార్టీల నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల తర్వాత బీజేపీలో చేరతాడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వీటిని సీఎం ఖండించకపోవడంతో విపక్షాలు అధికార పార్టీపై మరింత దూకుడు పెంచాయి. ఈ క్రమంలో తాజా ఎన్నికలు సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ అన్నట్లుగా మార్చేస్తున్నారు.ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయగా, బీఆర్‌ఎస్‌ఎల్పీ నేతగా కేసీఆర్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఇక అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే కీలక నేతలు బీఆర్‌ఎస్‌ను వీడారు. ముగ్గురు సిటింగ్ ఎమ్మెల్యేలు కూడా జంప్ అయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీని ఖాళీ చేసే ప్రయత్నంలో కాంగ్రెస్ ఉండగా, రాజకీయ చతురుడైన కేసీఆర్ మైండ్‌గేమ్ మొదలు పెట్టారు. తమ పార్టీ నుంచి వెళ్తున్న నేతలు అడ్డుకోవడంతోపాటు, క్యాడర్‌లో జోష్ నింపేందుకు.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు 25 మంది తనతో టచ్‌లో ఉన్నారని సంచల వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతాయని సంకేతాలు ఇచ్చారు. బీజేపీ రేవంత్ సర్కార్‌ను వదిలి పెట్టదని హెచ్చరించారు.ఇదిలా ఉంటే.. కేసీఆర్ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో కలకలం రేపాయి. ఇప్పుడు ఆ పార్టీలో కొత్త చర్చ మొదలైంది. తాజాగా కేసీఆర్ ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమతో చట్‌లో ఉన్నారని స్పష్టం చేశారు. దీంతో కేసీఆర్‌తో చట్‌లో ఉన్న ఆ 25 మంది ఎవరని అధిష్టానం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఇంటర్వ్యూలో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి గురించి కూడా కేసీఆర్ ప్రస్తావించారు. ఆయన కాంగ్రెస్ సర్కార్ త్వరలో పడిపోతుందని, డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని చెబుతున్నాడని, బీజే పీ ఎంపీ లక్ష్మణ్ కూడా రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోతుందంటున్నారని తెలిపారుప్రధాని మోదీ ఏదో కార్యక్రమానికి హైదరాబాద్ వస్తే సీఎం ఏవంత్ ఆప్ బడే భాయ్ హై, మై చోటే భాయ్ హై అనటం పైన కేసీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కొందరిలో అనుమానాలు మొదలయ్యాయని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌లో ఉన్న కొందరు బీఆర్‌ఎస్‌తో టచ్‌లోకి వచ్చారని చెప్పారు. మీరు, మేము కలిసి గవర్నమెంట్ ఫామ్ చేద్దామని ప్రతిపాదనలు కూడా తెచ్చారని పేర్కొన్నారు. అయితే, టచ్‌లో ఉన్నది ఎవరో చెప్పేందుకు కేసీఆర్ నిరాకరించారు.ఇక లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పుంజుకుంటుందని, 8 నుంచి 12 స్థానాల్లో తమ పార్టీ ఎంపీలు గెలుస్తారని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అదే జరిగితే లోక్‌సభ ఎన్నికల తర్వాత రాజకీయాలు మారడం ఖాయం. అయితే ఇప్పుడున్న పరిస్థితిలో బీఆర్‌ఎస్ అన్ని సీట్లు గెలుస్తుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు వచ్చిన సర్వేల్లో దాదాపు అన్నీ బీఆర్‌ఎస్‌కు 2 నుంచి 3 సీట్లు మాత్రమే వస్తాయని తెలిపాయి. కొన్ని సర్వేలు 0 నుంచి 1 వస్తాయని పేర్కొన్నాయి. ఈ క్రమంలో కేసీఆర్ 8 నుంచి 12 అనడం కూడా చర్చనీయాంశమైంది

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



విజయవాడ కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు పిల్లి వాని లంక కృష్ణా నది పాయలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం అయింది. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. సుమారు పది రోజులు క్రితం చనిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానం. మృతుడి వంటిపై దుస్తులు లేవు. మృతుడి సమీపంలో లుంగి, చెప్పులు ఉన్నట్లు గమనించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పార్టీ ఉనికి కాపాడుకోనెదేలా...

హైదరాబాద్, ఏప్రిల్ 25 తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఎనిమిది నుంచి పది సీట్లు వస్తున్నాయని సర్వేలు చెబుతున్నాయి.. కష్టపడితే మరో రెండు, మూడు సీట్లు వస్తాయని కేసీఆర్, కేటీఆర్ పదే పదే చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ సర్వేల పేరుతో కేసీఆర్ పార్టీ శ్రేణుల్లో నమ్మకాన్ని కలిగించారు. కేటీఆర్ కూడా వంద స్థానాల్లో విజయం ఖాయమని చెబుతూ వచ్చారు. కానీ చివరికి ఫలితం తేలిపోయింది. ఆ తర్వాత ఓటమి ఖాయమని రెండు వారాల ముందే తేలిందని కానీ అప్పుడు అభ్యర్థుల్ని మార్చలేం కదా అని ఆయన పార్టీ నేతలకు చెప్పినట్లుగా ప్రచారం జరిగింది. నిజానికి అప్పట్లో బీఆర్‌ఎస్ ఓడిపోతుందని ఎక్కువ మంది అనుకోలేదు. ఇప్పుడు కేసీఆర్ కేసీఆర్ సర్వేల్లో ఎనిమిది నుంచి పది సీట్లు అని చెబుతున్నారు కానీ.. గెలుస్తుందని బీఆర్‌ఎస్ కార్యకర్తలు కూడా నమ్మలేకపోతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ తక్షణ కర్తవ్యం.. కనీసం ఐదు లోక్ సభ సీట్లు సాధించడం. అలా సాధిస్తేనే ఇంకా ప్రజలు ఆ పార్టీ వైపు ఉన్నారన్న అభిప్రాయం ఏర్పడుతుంది. ఒకటి లేదా రెండు సీట్లకు పరిమితమైతే.. వారు కూడా పార్టీలో ఉంటారన్న గ్యారంటీ ఉండదు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఏర్పడిన పరిస్థితులు బీఆర్‌ఎస్ ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. దశాబ్దన్నర తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, దశాబ్దకాల అధికారం అనుభవించిన పార్టీ ఒక్క ఓటమికే తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోంది. వంద రోజుల్లో రాష్ట్రంలో జరిగిన ఈ పరిణామం రాజకీయవర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు ఆగం చేయగా కళ్ళముందున్న లోక్ సభ ఎన్నికల గండాన్ని గట్టెక్కి కొన్ని స్థానాల్లోనైనా 'పరువు' నిలబెట్టుకోవడం ఆ పార్టీకి అందించే అత్యవసరమైన ఆక్సిజన్ గా మారనున్నది. అనేక అవాంతరాల మధ్య సానుకూల పరిస్థితి కోసం కేసీఆర్ తో పాటు ఆయన కుటుంబం సర్వశక్తులొడ్డుతోంది. లోక్ సభ ఎన్నికల ఫలితాలు కనీసం ఊపిరిపోయకపోతే ఆ పార్టీ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారానికి దూరం అయినా 39 మంది ఎమ్మెల్యేలతో బలమైన ప్రతిపక్షంగానే ఉన్నారు. కానీ ఆ ప్రతిపక్ష స్థానాన్ని బీఆర్‌ఎస్ కాపాడుకోగలదా అన్న ప్రశ్న ఈ మూడు నెలల్లోనే వచ్చింది. అధికారం ఉందని వలస వచ్చిన నేతలు అధికారం పోగానే తిరుగుముఖం పట్టారు. నిన్నా మొన్నటి ఎవరు ఏ పార్టీలో గెలిచినా బీఆర్ ఎస్ పార్టీలో చేరిపోతారనే విమర్శలు వినిపించేవి. ఒక్క మాటలో చెప్పాలంటే ఒకరో ఇద్దరో మినహా ఫలనా నాయకుడు పార్టీ మారడనే అభిప్రాయానికి తావులేకుండా పోయింది. వారు వీరు అనేదీ లేకుండా అన్ని పార్టీలకు చెందిన వారంతా బీఆర్‌ఎస్ లో చేరిపోయారు. విపక్షాలకు పోటీచేసే గట్టి అభ్యర్థిలేకుండా చేసే ప్రయత్నంలో కేసీఆర్ విజయవంతమయ్యారని అనుకోవచ్చు. కానీ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షంగా ప్రజలే మారితే పరిస్థితి మరిపోతుంది. తర్వాత అదే జరిగింది. బీఆర్‌ఎస్ ఎన్నికల్లో ఓటమి వరకూ అత్యంత బలమైన పార్టీగా కనిపించింది. లోక్ సభ, రాజ్యసభ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మున్సిపల్ కార్పొరేషన్ లు, జిల్లా పరిషత్ లు, మండల, గ్రామ స్థాయి వరకు అంతా ఆ పార్టీ ప్రజా ప్రతినిధులే ఉన్నారు. వేళ్ళ మీద లెక్కించేంత మంది మాత్రమే విపక్ష పార్టీ ప్రతినిధులున్నారు. ఓ మోస్తారు సంఖ్యలో విపక్షాలు గెలిచినా తెల్లవారేసరికి గులాబీ గూటికి చేరిపోయే వారు. అసెంబ్లీ ఎన్నికల వరకు మూడవసారి ముచ్చటగా అధికారం, వందకు పైగా సీట్లు మనవే అంటూ గంభీరంగా ప్రకటించిన కేసీఆర్ తెలంగాణ ప్రజల విలక్షణ తీర్పుతో ఓటమిపాలైంది. అధికారం కోల్పోయినప్పటి నుంచి జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుండగా ప్రజా తీర్పు నుంచి కోలుకోకముందే పార్లమెంట్ ఎన్నికలురావడం 'అగ్ని పరీక్ష'గా మారింది. తిరిగి లోక్ సభ ఎన్నికల్లో పోటీచేసేందుకు పార్టీ సమాయత్తమవుతున్న తరుణంలో గట్టి దెబ్బతగిలింది. సిట్టింగు ఎంపీల్లో మెజార్టీ పార్టీ చేజారిపోయారు. సగం మంది బీజేపీలో చేరితే మరికొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. నిన్నటి వరకు ఎంపీలుగా ఉన్న సిట్టింగుల్లో కొందరిని మార్చాలని పార్టీ అధిష్టానం ఆలోచన చేస్తుండగా పార్టీలు మారిపోయారు. కొందరు టికెట్ రాదని మారిపోతే, మరికొందరు ఇతర పార్టీల్లో టికెట్ రావడంతో మారిపోయారు. కొందరు మాత్రం ఈ పార్టీ పక్షాన పోటీచేస్తే గెలవడం కష్టమని భావించి పార్టీ ఫిరాయించారు. అభ్యర్థులుగా ప్రకటించిన తర్వాత గడ్డం రంజిత్ రెడ్డి, కడియం కావ్యలు కాంగ్రెస్ లో చేరిపోవడం ఆ పార్టీ గెలుపు గుర్రం కాకపోవడమే కారణమని చెప్పవచ్చు. రాష్ట్రంలోని 17 స్థానాల్లో పోటీలో నిలుపగల నాయకులు ఆ పార్టీలో ఉన్నప్పటికీ నిన్న అధికారంలో ఉన్నప్పటికీ పరిస్థితికి, ఓటమి తర్వాత పరిస్థితి పూర్తిగా తారుమారైంది.ఎన్నికలన్న తర్వాత గెలుపోటములు సహజం. కానీ ఒక్క ఓటమికే బీఆర్‌ఎస్ చెల్లాచెదురు అవుతోంది. లోక్ సభ ఎన్నికల్లో కూడా ఇలాంటి ఓటమి ఎదురైతే.. ఇక బీఆర్‌ఎస్ స్థానాన్ని బీజేపీ అందుకుంటుంది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పార్టీని కాపాడుకునేందుకు మరోసారి రంగంలోకి దిగారు. ఆరోగ్యం సహకరించకపోయినా ఆయన బస్సు యాత్రకు సిద్ధమయ్యారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా క్షేత్రస్తాయిలో ప్రచారాన్ని కొనసాగించేందుకు బస్సు యాత్ర చేపట్టడం వల్ల కొంతైనా పార్టీ కేడర్ కు విశ్వాసం పెరుగుతోంది. ఎంపీ ఎన్నికల్లో కొంతైనా ఫలితాలు సానుకూలంగా వస్తే దాని నుంచి ఊపిరిపీల్చుకుని తర్వాత పార్టీని కింది నుంచి నిర్మాణం చేసుకునేందుకు చాన్సు దక్కుతోంది.

ఈ త్రిముఖ పోటీలో బీఆరెస్ కనీసంగానైనా ఎంపీ స్థానాలు దక్కించుకోలేకపోతే మొదటికే మోసం వస్తుంది. తిరిగి పార్టీని క్షేత్రస్థాయి నుంచి నిర్మించి చిత్తుశుద్ధితో ముందుకు పోతే తప్పితే అధికారానికి బాగా అలవాటు పడిన పార్టీలో వచ్చే ఐదేళ్ళ వరకు నాయకులు, కేడర్ ను కాపాడుకోవడం అంత ఈజీ కాదు. ఎందుకంటే ప్రత్యామ్నాయం రూపంలో బీజేపీ రెడీగా ఉంది మరి. అందుకే కేసీఆర్ ఇది.. ఉనికి సమస్యతో కూడిన కఠినమైన సవాల్ అనుకోవచ్చు.

# ఒకటి, రెండు రోజుల్లో దోస్త్ నోటిఫికేషన్

హైదరాబాద్, ఏప్రిల్ 25 తెలంగాణలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్దేశించిన 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్–తెలంగాణ(దోస్త్)' ఏప్రిల్ 27 లేదా మే 1న వెలువడే అవకాశం ఉంది. అదేసమయంలో 'దోస్త్' ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ఏప్రిల్ 24న ఇంటర్‌మీడియట్ ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో.. ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశ షెడ్యూలు ప్రకటించడానికి సన్నాహాలు చేస్తోంది. దోస్త్ పరిధిలో రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీల పరిధిలో 1054 డిగ్రీ కాలేజీలుండగా, వాటిలో 136 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు, నాన్ దోస్త్ కాలేజీలు 63 ఉన్నాయి. మిగిలినవి ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో మొత్తం 3,86,544 డిగ్రీ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# మూగజీవాలకు నీరు ఎలా

కరీంనగర్, ఏప్రిల్ 25 కరీంనగర్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. పొద్దు పొద్దున్నే నిప్పులు కక్కుతూ ఉదయిస్తున్న సూర్యుడు.. మధ్యాహ్నం వరకు మాడు పగిలిపోయేలా మండుతున్నాడు. ఉదయం 10 దాటితే బయటకి రావాలంటే జంకుతున్నారు జనం. జనజీవనమే ఎండల ధాటికి తట్టుకోలేక పోతుంటే, నోరు లేని మూగ జీవాల పరిస్థితి దారుణంగా మారింది.హైదరాబాద్ మహానగరంలోని లోయర్ మానేరు డ్యామ్ సమీపంలో ఉన్న జింకల పార్క్‌లో వన్య ప్రాణులు ఎండలతో అల్లాడుతున్నాయి. రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో డీర్ పార్క్ లో ఉన్న జంతువులు, పక్షులు, ఇతర జీవాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. పార్క్ లో కృష్ణ జింకలు, చుక్కల దుప్పి, నీల్ గాయి లాంటి జంతువులతో పాటు నెమళ్ళు, అడవి కోళ్లు, రామ చిలుకలు, ఆఫ్రికన్ చిలుకలు, క్లోనింగ్ రాట్స్, కుందేళ్లు, యూరోపియన్ పిగ్స్ లాంటి వందలాది జంతుజాలం ఉంది. పక్షులతో పాటుగా జంతువులు, కోసం ప్రత్యేకంగా షెడ్లు నిర్మించారు. జింకల కోసం ఓపెన్ ప్లేస్ లో చెట్ల నీడ ఉండేలా ఏర్పాట్లు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పళ్ళు కూరగాయలతో పాటుగా ప్రత్యేకమైన అహారాన్ని అందిస్తున్నారు.వన్యప్రాణులు నివసించే షెడ్ లలో క్రింద ఇసుక పోసి చుట్టూ గోనె సంచులు ఏర్పాటు చేశారు. ఎండ వేడి తగలకుండా నీటితో తడుపుతూ రోజుకి మూడు సార్లు చల్లబరుస్తు ఉపశమనం కలిగిస్తున్నారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ విదేశాల నుంచి తెచ్చిన కొన్ని ప్రాణులు ఇక్కడి ఉష్ణోగ్రతలను తట్టుకోలేక పోతున్నాయి. ఏప్రిల్ నెలలోనే ఈ పరిస్థితి ఉంటే మరో 40 రోజుల పాటు మరింత ఎక్కువ ఎండలు కాసే అవకాశాల ఉన్నాయి.. అరుదైన జీవులను రక్షించడం అధికారుల కు కత్తి మీద సాముగా మారిందని చెప్పవచ్చు

# యాదాద్రి ప్లాంట్ కు లైన్ క్లియర్

నల్గొండ, ఏప్రిల్ 25, యాదాద్రి పవర్ ప్లాంట్‌కి లైన్ క్లియర్ అయ్యింది. యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి, కేంద్ర అటవీ పర్యావరణ శాఖ అనుమతి ఇచ్చింది. గత కొంత కాలం నుండి సిద్ధంగా ఉండి అనుమతులకోసం జెన్కో ఎదురు చూస్తోంది. అ?యితే కేంద్ర అటవీ ప ర్యావరణ శాఖ అనుమతి ఇవ్వడంతో ఇక విద్యుత్ ఉత్పత్తికి జెన్కో సన్నాహాలు చేస్తోంది. అయితే మొదటి విడతగా 800 మెగా వాట్లను ఉత్పత్తి చేసే రెండు యూనిట్లతో 1600 మెగా వాట్ల విద్యుత్ ను జెన్కో ఉత్పత్తి చేయనుంది. ఆ తర్వాత రెండవ విడతలో 800 మెగా వాట్ల మూడు యూనిట్లతో 2400 మెగా వాట్ల ఉత్పత్తి, మొత్తం గా 4000 మెగా వాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో యాదాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటయింది.. గత కొంత కాలం నుండి సిద్ధంగా ఉండి అనుమతులకోసం జెన్‌కో ఎదురు చూస్తోంది.యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నల్లగొండ జిల్లా దామరచర్లలోని వీర్లపాలెంలో నిర్మించారు. 4 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దీని సామర్థ్యం. రూ.30 వేల కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఈ పవర్ ప్లాంటు దక్షిణ భారతదేశంలోని రెండో అతిపెద్ద విద్యుత్ కేంద్రం.2015, జూన్ 8న అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ దీనికి భూమి పూజ చేశారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించనున్న ఈ ప్లాంట్‌కు జూన్ 26, 2017లో కేంద్ర పర్యావణ శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో రూ. 29వేల కోట్ల రూపాయతో జెన్‌కో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రయివేటు ఎజెన్సీలకు ఈ పనులు కట్టబెట్టకుండా ఆనాడు కెసిఆర్ సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థ బిహెచ్‌ఇఎల్‌కు ఆ నిర్మాణ పనుల బాధ్యతలను అప్పగించింది. నిర్మాణ పనులు పూర్తవుతుండగా ఈ ప్రాజెక్టు నుండి విద్యుత్ ఉత్పత్తి చేపడితే నల్లమల అభయారణ్యంలో ఉన్న ప్రాణులకు ముప్పు ఏర్పడుతుందని దీని అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ముంబయికి చెందిన కన్జర్వేటీవ్ యాక్షన్ ట్రస్ట్, విశాఖపట్నంకు చెందిన సమత అనే స్వచ్ఛంధ సంస్థ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆ ఎన్జీటీ యాదాద్రి అనుమతులపై స్టే విధించిందివన్య ప్రాణులకు ఏర్పడే ముప్పుపై అధ్యయనం చేసి టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్జీటీ ఆదేశించింది. అయితే కేంద్ర ప్రభుత్వం టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ జారీ చేయకుండా జాప్యం చేసింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. అనుకున్న గడువులో ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. కేంద్ర పర్యావరణ శాఖ జాప్యం చేస్తోంది.. టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ తో సంబంధం లేకుండా విద్యుత్ ఉత్పత్తికి అనుమతి ఇవ్వాలని జెన్‌కో గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసింది. జెన్‌కో పిటిషన్ స్వీకరించిన గ్రీన్ ట్రిబ్యునల్ తాజాగా పర్యావరణ అనుమతికి అవసరమైన టర్మ్ ఆఫ్ రిఫరెన్స్‌పై నివేదిక పంపాలని ఆదేశించింది. యాదాద్రికి ఎంత దూరంలో అంటే ఏరియల్ డిస్టెన్స్ ఎంత ఉందో తెలియజేయాలని జెన్కోను పర్యావరణ శాఖ ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీ శాఖ సైతం సర్వే జరిపి అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ యాదాద్రి ప్లాంట్ కు 14.3 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు తెల్చి చెప్పింది.ఈ నివేదిక అనుసరించి కేంద్ర అటవీ పర్యావరణ శాఖ సానుకూలతను వ్యక్తం చేస్తూనే గతంలో పర్యావరణ అనుమతులకోసం ప్రజాభిప్రాయ సేకరణ చేశారని, అది కాకుండా మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణ చేసి పంపాలని సూచించింది.

# పెద్దమ్మ తల్లి బోనాలకు హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హన్మకొండ స్టేషన్ ఘనపూర్ మండలం ఇప్పగూడెం, చాగల్లు గ్రామాలలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి బోనాలకు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ విజేతలను అభినందించిన మాజీ మంత్రి హరీష్ రావు

ఆలిండియా సివిల్ సర్వీస్‌కు ఎంపికైన రాష్ట్ర విద్యార్థులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావును కలిశారు. వారికి హరీష్ రావు అభినందనలు తెలిపారు. తమను ప్రోత్సహించినందుకు విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి సేవ చేసేందుకు దక్కిన అద్భుత అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పేద ప్రజలకు అండగా నిలవాలని హరీష్ రావు వారిని కోరారు. వృత్తిలో నిబద్ధతతో పనిచేస్తూ, మరింత మంది యువతీయువకులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. మంచి పనీతీరుతో, సామాజిక సేవతో మీ తల్లిదండ్రులకు, తెలంగాణకు పేరు తేవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల యువతీయువకులకు సివిల్స్ పరీక్షల్లో అత్యుత్తమ శిక్షణ ఇస్తూ ఐఏఎస్‌లను తయారుచేస్తున్న సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత గారిని హరీష్ రావు ఈ సందర్భంగా సన్మానించారు. మాజీ మంత్రి హరీష్ రావు ప్రతియేటా సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికై ఇంటర్వ్యూకు వెళ్లే విద్యార్థులకు గైడెన్స్ ఇస్తుంటారు. ప్రభుత్వ పాలన, రాజకీయాలు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తూ వారి విజయానికి దోహదపడుతుంటారు.

# విద్యుత్ కోతలున్నాయి..రైతు బంధు లేదు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్యాలయంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థితో కలిసి ఆరుగురు ఎమ్మెల్యేల మీడియా సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రుణ మాఫీ చేయకపోవటం పై ప్రశ్నిస్తే., బెదిరించేలా మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రజలను మభ్య పెడుతున్నాడు. కేసీఆర్ హయంలో విద్యుత్ కోతలు అనేవి లేవు. నేడు కాంగ్రెస్ హయంలో విద్యుత్ కోతలు, రైతు బంధు సైతం సరిగ్గా అందటం లేదు. రేపు రాబోయే ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకోవాలి.

ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ ఎల్బీ నగర్ లో మెట్రో ట్రైన్ ఎక్కి కూకట్పల్లి వరకు ప్రయాణం చేశాము. గత పది సంవత్సరాల్లో కేసీఆర్ కేటీఆర్ లు తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో అన్ని రంగాలలో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టారు. ప్రజలకు ఇబ్బంది కాకుండా ప్రయాణ సౌలభ్యం కోసం మెట్రో రైలును తీసుకొని వచ్చారు. చెరువులో ఉండే చేపలు మాయం అయ్యాయి.. చెరువులు ఎండిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరువు వచ్చింది. 4వేల రూపాయల పింఛను అని ఆశ చూపెట్టి ఉన్న 2 వేలు కూడా పోగొట్టారు. కాంగ్రెస్ వచ్చినప్పటి నుండి ప్రజలకు తాగు నీటి సమస్య మొదలయ్యింది. ఛ ముఖ్యమంత్రికి, మంత్రులకు అడ్మినిస్ట్రేషన్ రావటం లేదు. పాలన చేయకుండా తిట్లతో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రియల్ ఎస్టేట్ రంగం కుదేలు అయ్యింది. కరోనా సమయంలో సైతం ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొలేదని అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం. కాంగ్రెస్, బిజెపి పార్టీలు తమ అభ్యర్థులను ఇంపోర్ట్ చేసుకున్నారు. రాగిడి లక్ష్మారెడ్డి స్థానికుడు. రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించి కేసీఆర్ కు మల్కాజ్ గిరి సీటును బహుమతిగా ఇస్తామని అన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ 14 సంవత్సరాలు కొట్లాడి తెలంగాణ తీసుకొని వచ్చి 10 సంవత్సరాల పాలనతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి బడుగు బలహీన వర్గాల ఉన్నతికి కృషి చేశారు.

రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓడిపోయాక ... మల్కాజ్ గిరి ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి యంపి గా గెలిచి, మోసం చేసి ఏ ఒక్క రోజు కూడా పార్లమెంటులో మాట్లాడింది లేదు.

యంపి అయ్యాక పీసీసీ అధ్యక్షుడై అబద్ధాలు చెప్పి గెలిచి ముఖ్యమంత్రి అయ్యాడు.

కేసీఆర్ పట్నం మహేందర్ రెడ్డి ఇంట్లో అందరికీ ఉద్యోగాలు కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మూడు నెలలో ఇప్పుడు యంపి ఉద్యోగం కోసం మహేందర్ రెడ్డి పార్టీ మారారు. బిజెపి అభ్యర్థి చెల్లని రూపాయి. సొంత నియోకవర్గంలో గెలవలేని వ్యక్తి ఇక్కడ యంపి గా పోటీ చేస్తున్నారు.

మల్కాజ్ గిరి పార్లమెంట్ లో మా యంపి కనపడటం లేదని గతంలో పోలీస్ స్టేషన్లలో ప్రజలు ఫిర్యాదు చేశారు. రానున్న ఎన్నికల్లో స్థానిక వ్యక్తినైనా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కంటోన్మెంట్ అభ్యర్థి నివేదిత మాట్లాడుతూ తన తండ్రి, సోదరి మరణాల తరువాత తనకు ఎన్నికల్లో పోటీ చేయటానికి కేసీఆర్ అవకాశం కల్పించారు. ఛ కేసీఆర్ హయంలో అభివృద్ధి ఎంతో జరిగింది. తన తండ్రి సాయన్న కంటోన్మెంట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. తన తండ్రిని, సోదరిని ఏ విధంగా ఆదరించారో, తనని సైతం ఆదరించి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. .

# లారీని ఢీకొన్న కారు..డ్రైవర్ సజీవదహనం

సంగారెడ్డి జిల్లా ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రింగ్ రోడ్డు పై ఆగి ఉన్న బొగ్గు లారీని వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కారు పూర్తిగా దగ్ధమై కారు నడుపుతున్న వ్యక్తి పూర్తిగా సజీవ దహనం అయ్యారు. ముత్తంగి ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద మేడ్చల్ నుంచి వస్తున్న కారు వైజాగ్ నుంచి పాశమైలారం లో బొగ్గును అన్ లోడ్ చేసేందుకు వెళ్లే క్రమంలో ఓఆర్ఆర్ పై ఆగి ఉన్న లారీని వెనక నుంచి వచ్చి ఢీ కొట్టింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధమవడంతో పాటు కారు నడుపుతున్న ఓ వ్యక్తి సజీవ దహనమయ్యారు. కారు నంబర్ ప్లేట్ సగం వరకు కాలిపోవడం, వ్యక్తి పూర్తిగా దగ్ధమవడంతో ఇంకా వివరాలు తెలియాల్సి ఉందని పటాన్ చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. అగ్నిమాపక సిబ్బందితో మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో మేడ్చల్ నుంచి శంషాబాద్ వెళ్లే ఓఆర్ఆర్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. కారు పూర్తిగా దగ్ధం అవ్వడంతో పోలీసులు కార్ నెంబర్ ను గుర్తించి వివరాలు తెలుసుకునే పనిలో ఉన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉందని సీఐ ప్రవీణ్ రెడ్డి వెల్లడించారు.

# సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభించిన జీహెచ్ఎంసి కమిషనర్

హైదరాబాద్ తాము చదువుకుంటున్న సమయంలో విద్యార్థుల పై ఇంత ఒత్తిడి ఉండేది కాదని ఇప్పుడు చదువుకునే విద్యార్థులలో ఎక్కువగా ఒత్తిడి ఉంటుందని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. కూకట్ పల్లి జోనల్ పరిధిలోని 7వ ఫేజ్ లో జిహెచ్ఎంసి సమ్మర్ కోచింగ్ క్యాంప్ ను ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్, కూకట్ పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ తో కలిసి కోచింగ్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని చోట్లా ఈ సమ్మర్ క్యాంపులను ఏర్పాట్లు చేశామన్నారు. పిల్లలకు ఉపయోగపడే విధంగా వారిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఆటలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్ లు వేసవి ముగిసే వరకు కొనసాగుతుందని వెల్లడించారు. పిల్లలకు ఈ ఆటలు ఇలానే కొనసాగించాలి అంటే జిహెచ్ఎంసి పరిధిలో అన్ని ఆటల విభాగాలలో మంచి కోచ్ లు సైతం అందుబాటులో ఉన్నారని వారిని మరింత నైపుణ్యంగా తీర్చిదిద్దేందుకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని కమిషనర్ అన్నారు.

# గాంధీభవన్ ఎదుట 'నయవంచన' పేరుతో ఫ్లెక్సీ




హైదరాబాద్ టీపీసీసీ కార్యాలయం గాంధీ భవన్ ఎదుట నయవంచలన పేరిట ఫ్లెక్సీ కలకలం రేపింది. పదేండ్ల మోసం- వందేళ్ల విధ్వంసం అంటూ బీజేపీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల పేరుతో ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసారు. తెలంగాణ కు బీజేపీ గత పదేండ్లలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదని, కృష్ణా జలాల్లో వాటా వంటి అంశాలతో బ్యానర్ లో వున్నాయి

# ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపిన చింతమనేని

దెందులూరు నిన్న శ్రీకాకుళంలో పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బి-ఫామ్ అందుకున్న దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, గురువారం ఉదయం ఆధ్యాత్మిక భావనతో పలు ఆలయాలను దర్శించారు.పెదవేగి మండలంలోని రాట్నాలకుంట ఆలయంలో శ్రీ రాట్నాలమ్మ అమ్మవారిని, ద్వారకా తిరుమల దేవస్థానంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని, హనుమాన్ జంక్షన్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి వారితో పాటు విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న చింతమనేని ప్రభాకర్ – బి ఫామ్ నీ ఆలయంలో అందించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు చింతమనేనికి విజయాన్ని ఆశీర్వదిస్తూ వేద ఆశీర్వచనం అందించారు. మరికాసేపట్లో టిడిపి తరపున అభ్యర్థిగా తన బి – ఫామ్ నీ దెందులూరు ఎమ్మార్వో కార్యాలయంలో ఎన్నికల అధికారికి అందచేయించి – నియోజకవర్గంలో జరిగే విస్తృత స్థాయి ఎన్నికల ప్రచారంలో చింతమనేని ప్రభాకర్ పాల్గొననున్నారు

# రాజధాని లేకపోవడమే రాష్ట్రానికి దుస్థితి షర్మిల



విజయవాడలో ఎన్నికల ప్రచారంలో బాగంగా సభలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గోన్నారు. వైఎస్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి రాజధాని లేదు. రాజధాని లేని రాష్ట్రం ఎక్కడా లేదు. మన రాష్ట్రానికే ఈ దుస్థితి. మనకు చేతిలో చిప్ప తప్పా ఏమి లేదు. సింగపూర్ అన్నాడు చంద్రబాబు. 3డి గ్రాఫిక్స్ చూపించారు. 30 వేల ఎకరాలు తీసుకున్నారు. 2015 లో మోడీ వచ్చి భూమి పూజ చేశాడు. యమునా నది నుంచి మట్టి తెచ్చాడు. మనకు మిగిలింది చివరికి మట్టి, డిల్లీ తలదన్నే రాజధాని ఉండాలని మోడీ చెప్పాడు. బాబు సింగపూర్ లాంటి రాజధాని అన్నాడని అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధాని అన్నాడు. అమరావతి కాస్త చివరికి భ్రమరావతి చేశాడు. – హైదరాబాద్ నేనే కట్టా అన్నాడు. హైదరాబాద్ మించిన రాజధాని అని మళ్ళీ చెప్పాడు. బాబు హయాంలో తాత్కాలిక భవనాలు తప్పా మిగిలింది ఏమి లేదు. దేశ విదేశాలు తిరిగాడు తప్పా... పెట్టుబడులు రాలే. ఉద్యోగాలు లేవు..పరిశ్రమలు లేవు. ఇక జగన్ మోహన్ రెడ్డి గెలిస్తే వాసింగ్ టన్ టఇ అన్నాడు. తర్వాత ఒక్కటి కాదు మూడు అన్నాడు. మూడు కాదు కదా ఒక్క రాజధానికి దిక్కులేదని అన్నారు. 10 ఏళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు అలానే ఉంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. రాజధాని కి సహాయం చేస్తామని బీజేపీ మోసం చేస్తే... మళ్ళీ వాళ్ల కొంగు పట్టుకొని తిరుగుతున్నారు. ఎందుకు నిధులు ఇవ్వలేదు అని అడిగిన వాళ్ళు లేరు. మోడీ కోసం చేస్తే నిలదీసే దమ్ము లేదు. ఈ సారి బాబు కి ఓటు వేసినా,జగన్ కి వేసినా డ్రైనేజీ లో వేసినట్లే. మనకు రాజధాని కావాలి అంటే...కాంగ్రెస్ రావాలి. పోలవరం కట్టాలి అంటే రాజధాని రావాలని అన్నారు. మనకు ఈ పొత్తులు, తొత్తులు వద్దు. కాంగ్రెస్ అధికారంలో వస్తేనే రాష్ట్ర అభివృద్ధి వుంటుందని అన్నారు.

# తెలంగాణలో ఉత్తారాఖండ్ సీఎం ప్రచారం

హైదరాబాద్ ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. నిజామాబాద్, వరంగల్ లో జరగనున్న నామినేషన్, సభలకు పుష్కర్ సింగ్ ధామి హజరు అవుతారు. పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోడీ హవా కొనసాగుతోంది. ఇండియా కూటమి కేవలం కుటుంబ కూటమిగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్యధిక సీట్లు గెలిచే అవకాశం ఉంది. తెలంగాణలో బీజేపీ ప్రభంజనం కొనసాగుతోందని అన్నారు.

# ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం వద్ద ఉద్రిక్తత

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఐపీఎల్ టికెట్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటుందని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ శ్రేణులు ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద ఆందోళనకు దిగాయి. హెచ్సీయే అధ్యక్షుడు జగన్మోహన్రావు దిష్టిబొమ్మను యూత్ కాంగ్రెస్ నేతలు దహనం చేసారు. నేడు సన్రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజ్ బెంగళూరు ల మధ్య జరగనున్న మ్యాచ్ పై యూత్ కాంగ్రెస్ నేతలు ఆందోళన చేస్తున్నారు. తక్షణమే హెచ్సియే ం అధ్యక్షుడు జగన్మోహన్ రావు రాజీనామా చేయాలంటూ నిరసనలు వ్యక్తం చేసారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డిని, యూత్ కాంగ్రెస్ శ్రేణులను రాచకొండ పోలీసులు అరెస్టు చేసారు.

# భువనగిరి బీజేపీలో గ్రూప్ వార్

యాదాద్రిభువనగిరి బిజెపిలో గ్రూప్ వార్ బయటపడింది. ఎంపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ వైఖరిపై సీనియర్ ల అలకబూనారు. క్యాస్ట్ పాలిటిక్స్ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రచారానికి దూరంగా సీనియర్ లుగూడూరు నారాయణ రెడ్డి,శ్యామ్ సుందర్ వున్నారు. గ్రూప్ వార్ తో అయోమయంలో కేడర్ వుండిపోతున్నారు. ఎన్నికల వేలా అధిష్టానానికి తలనొప్పిగా బూర నర్సయ్య గౌడ్ వ్యవహారం మారింది. బీఆర్ఎస్ పార్టీకికోవర్ట్ గా పనిచేస్తున్నాడంటూ నర్సయ్య గౌడ్ పై సీనియర్ లు విమర్శలు గుప్పిస్తున్నారు.

# రామన్న పేటబీజేపీలో చేరికలు

రామన్న పేట కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై రామన్న పేట మండలం లో బి ఆర్ ఎస్ పార్టీ నుండి సుమారు వందమంది పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారికి ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ జినుకల ప్రభాకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# దేశ గౌరవాన్ని పెంచిన మోడీ

హైదరాబాద లోక్ సభ ఎన్నికల్లో గుజరాత్ లోని సూరత్ లోక్ సభ స్థానాన్ని బీజేపీ ఏకగ్రీవంగా గెలుచుకుంది. ఇంకా 399 సీట్లలో మనం విజయాన్ని అందించాలని గుజరాత్ ముఖ్యమంత్రి భూపేందర్ పటేల్ అన్నారు. మోదీజీ రిని ఆశీర్వదించండి.. తెలంగాణ సంక్షేమాన్ని మోదీ చూసుకుంటారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో 400 సీట్లలో విజయం సాధిస్తాం. మోదీజీ మూడోసారి ప్రధానమంత్రి కానున్నారు. నరేంద్ర మోదీ పాలనలో ప్రపంచంలో భారతదేశం గౌరవాన్ని పెంచారు. భారత విద్యార్థులను తిరిగి సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపిన ఘనత నరేంద్ర మోదీది. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయండి. 400 సీట్లలో విజయాన్ని అందించండనిఅన్నారు.

# తెలంగాణలో టీడీపీ పాలన నడుస్తోంది

సికింద్రాబాద్ రాష్ట్రంలో తెలుగుదేశం కాంగ్రెస్ పార్టీ పాలన జరుగుతుందని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ సంచలన ఆరోపణలు చేశారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా సర్వే నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసలైన కాంగ్రెస్ వాదులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు. టికెట్ల కేటాయింపులో మాదిగలకు అన్యాయం జరిగిందన్నారు. కంటోన్మెంటకాంగ్రెస్ బి ఫామ్ ఇస్తే కాంగ్రెస్ తరపున పోటీ చేస్తానని లేని పక్షంలో కాంగ్రెస్ రెబల్ గా బరిలో ఉంటానన్నారు. ఇతర పార్టీల నుండి వచ్చిన వారిని చేర్చుకుని సీట్లు కేటాయించడం సరైన విధానం కాదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవర్తన మార్చుకోకుంటే కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడ సాధ్యం కాధని, కాంగ్రెస్ పార్టీలో సీనియర్లను విస్మరించడం తగదని హెచ్చరించారు.లోక్ సభ లో మాదిగలకు సీట్లు కేటాయించడంలో కాంగ్రెస్ విఫలమైందని, కోటి మంది జనాభా కలిగిన దళితులు కాంగ్రెస్ కు దూరమయ్యే అవకాశం ఉందని అన్నారు.

# సినిమా



## ఎమోషనల్ కామెంట్స్ చేసిన ఇలియానా



తెలుగు ప్రేక్షకులకు ఇలియానా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. దేవదాసు సినిమాతో సినీ ఇండస్ట్రీకి పరిచయమైన ఈ ముద్దుగుమ్మ పోకిరి సినిమాతో స్టార్ హీరోయిన్గా గుర్తింపు తెచ్చుకుంది.పోకిరిసినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మకి వరుస సినిమాల్లో స్టార్ హీరోల సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. అలా ఇప్పటివరకు టాలీవుడ్ లో ఉన్న దాదాపుగా అందరూ స్టార్ హీరోలు సరసన నటించింది. ఈ నేపథ్యంలోనే కెరియర్ సాఫీగా సాగుతున్న సమయంలో బాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చింది. అలా టాలీవుడ్ ని విడిచి వెళ్లడంతో ఇలియానా కెరియర్ డౌన్ అయిపోయింది.ఇకపోతే ఇలియానా కంటే ముందు వచ్చిన త్రిష శ్రేయా వంటి స్టార్ హీరోయిన్లు ఎప్పటికీ హీరోయిన్లుగా రాణిస్తున్నారు. కానీ ఇలియానా మాత్రం టాలీవుడ్ ని వదిలి బాలీవుడ్ కి వెళ్లడంతో టాలీవుడ్ లో తన క్రేజ్ మొత్తం పడిపోయింది. అంతేకాదు అప్పట్లో ఇలియానాకి సంబంధించిన ప్రేమ వ్యవహారాలు టాలీవుడ్ ని ఒక ఊపు ఊపేసాయి. బ్రేకప్ ల వల్ల ఎంతో కృంగిపోయిన ఇలియానా ఒక ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫర్ ని ప్రేమించింది కొంతకాలం కలిసే ఉన్నప్పటికీ ఇద్దరికీ బ్రేకప్ కావడంతో డిప్రెషన్ లోకి వెళ్లిన ఇలియానా తిరిగి కోలుకొని మరొక వ్యక్తిని ప్రేమించి ఒక బిడ్డకు తల్లి కూడా అయింది. ప్రస్తుతం తన భర్త కొడుకుతో సంతోషంగా ఉంది. ప్రస్తుతం కొడుకు, భర్తతో హ్యాపీగా ఉన్న సమయంలో ఇలియానా చేసిన ఎమోషనల్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ఇలియానా అప్పుడప్పుడూ ఆఫర్స్ అందుకుంటూ సినిమాల్లో నటిస్తోంది. ఇలియానా నటించిన లేటెస్ట్ మూవీ దో ఔర్ దో ప్యార్ చిత్రానికి మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇలియానా ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. ఈ ఇంటర్వ్యూలో ఇలియానా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

## అందుకే సూపర్ సక్సెస్ అవుతున్నాయ్



ఇటీవల కాలంలో సినీ ప్రేక్షకుల పంథా పూర్తిగా మారిపోయింది. ఒకప్పటిలా కమర్షియల్ సినిమాలను ఆదరించడం ఎప్పుడో మరిచిపోయారు ప్రేక్షకులు. ఈ క్రమంలోనే సరికొత్త కథలను ఇక ఆదరించి సూపర్ సక్సెస్ లు అందించడం చేస్తున్నాము అన్న విషయం తెలిసిందే. ఒకప్పుడైతే నాలుగు పాటలు మూడు ఫైట్లు రెండు ఎమోషన్స్ సీన్స్ ఉన్నాయి అంటే చాలు సినిమా హిట్ అవుతుంది అనుకునేవారు ఇక సినిమాలో స్టార్ హీరో హీరోయిన్లు ఉంటే చాలు కదా బలంగా లేకపోయినా హిట్టైనా సినిమాలు చాలానే ఉన్నాయి.కానీ ఇప్పుడు అలా కాదు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎంతటి స్టార్ హీరో హీరోయిన్ సినిమాలో నటించినప్పటికీ.. కథ బాలేదు అంటే సినిమాను అడర్ ఫ్లాప్ చేసేస్తూ ఉన్నారు ప్రేక్షకులు. ఇక వందల కోట్ల బడ్జెట్లో తెరకేక్కుతున్న సినిమాలు ప్రస్తుతం చివరికి ఫ్లాప్ గా మిగిలిపోతూ ఉండడం కూడా నేటి రోజుల్లో చూస్తూ ఉన్నాం. అయితే ఈ మధ్యకాలంలో అటు మలయాళ సినిమాలు అక్కడి ఇండస్ట్రీలో మాత్రమే కాదు మిగతా భాషల్లో కూడా మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటూ సూపర్ హిట్ గా నిలుస్తూ ఉన్నాయ్ అన్న విషయం తెలిసిందే. అయితే ఇలా ఇటీవల కాలంలో మలయాళ సినిమాలు కేవలం సొంత భాషలోనే కాదు వివిధ భాషల్లో సూపర్ హిట్ కావడానికి గల కారణం ఏంటి అన్న విషయాన్ని నటుడు పహాద్ ఫాసిల్ చెప్పుకొచ్చాడు. ఈ సక్సెస్ కు కారణం భిన్నమైన కంటెంట్ మాత్రమే అంటూ చెప్పుకొచ్చాడు. కొత్త కథలను చూసేందుకు ప్రజలు థియేటర్లకు వస్తున్నారు అంటూ ఫహద్ తెలిపారు.

## హైప్ మాములుగా పెంచట్లేదుగా?



3 దశాబ్దాలా క్రితం స్టార్ హీరోల సినిమాల షూటింగ్ మొత్తం నెలరోజుల్లో పూర్తైన సందర్భాలు కూడా చాలానే ఉన్నాయి. అయితే ఇప్పుడు మాత్రం ఒక్కో సినిమా ఖచ్చితంగా రెండు నుంచి మూడేళ్ల పాటు షూటింగ్ జరుపుకుంటోంది.మెగాస్టార్ చిరంజీవి మల్లిడి వశిష్ట కాంబినేషన్ లో తెరకెక్కుతున్న విశ్వంభర సినిమాకు ఇంటర్వెల్ సీక్వెన్స్ కీలకం కాగా ఇంటర్వెల్ లో వచ్చే ఫైట్ సీన్ కోసం ఏకంగా 26 రోజుల సమయం పట్టిందని సమాచారం తెలుస్తోంది. చిరంజీవి కెరీర్ లోని బెస్ట్ ఫైట్ సీన్లలో ఈ సీన్ ఒకటిగా నిలుస్తుందని సమాచారం తెలుస్తుంది.హైదరాబాద్ శివార్లలోని భారీ సెట్ లో ఈ ఫైట్ సీన్ షూటింగ్ జరగగా ఈ ఫైట్ సీన్ టాలీవుడ్ ఇండస్ట్రీలో ట్రెండ్ సెట్ చేసే ఫైట్ సీన్ అవుతుందని మూవీ టీం వారి నుంచి ఇంకా అలాగే ఫ్యాన్స్ నుంచి కామెంట్లు వ్యక్తమవుతున్నాయి. యూవీ క్రియేషన్స్ నిర్మాతలు ఈ మూవీని పాన్ ఇండియా లెవెల్ లో భారీ స్థాయిలో నిర్మిస్తుండటం గమనార్హం. ఈ సినిమాలో దొరబాబు అనే రోల్ లో మెగాస్టార్చిరంజీవి కనిపించనున్నారు.మెగాస్టార్ చిరంజీవి ఈ సినిమాకు ఏకంగా 60 కోట్ల రూపాయల రేంజ్ లో రెమ్యునరేషన్ తీసుకుంటున్నారు. సీనియర్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం.కీరవాణి ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. చిరంజీవి కీరవాణి కాంబినేషన్ లో చాలా సంవత్సరాల తర్వాత సినిమా తెరకెక్కుతుండటంతో మెగాస్టార్ ఫ్యాన్స్ ఎంతగానో సంతోషిస్తున్నారు. 2025 సంవత్సరం సంక్రాంతి పండుగ కానుకగా ఈ మూవీ రిలీజ్ అవుతుండటం గమనార్హం.చిరంజీవి విశ్వంభర సినిమా విడుదలైన తర్వాత కొత్త సినిమాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ విశ్వంభర సినిమా పాన్ ఇండియా మూవీగా రిలీజ్ కానుంది. విశ్వంభర సినిమా కథ, కథనం చాలా కొత్తగా ఉంటాయని తెలుస్తోంది.

### ఓటీటీలోకి వచ్చేసిన 'భీమా'

టాలీవుడ్ మాచో స్టార్ గోపీచంద్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం 'భీమా'. యాక్షన్ ఎంటర్‌టైనర్గా వచ్చిన ఈ సినిమాకు కన్నడ దర్శకుడు ఏ హర్ష దర్శకత్వం వహించగా..ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం మహా శివరాత్రి కానుకగా మార్చి 08న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద యావరేజ్గా నిలిచింది. అయితే ఈ సినిమా తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది.ప్రముఖ ఓటీటీ వేదిక డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఈ సినిమా ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ విషయాన్ని డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కేకే రాధామోహన్ ఈ సినిమాను నిర్మించగా.. 'సలార్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందించాడు. ప్రియాంక భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్లుగా అలరించిన ఇందులో వెన్నెల కిషోర్, రఘుబాబు, నాజర్, నరేష్ కీలకపాత్రల్లో నటించారు.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అది కర్ణాటకలోని పరశురామ క్షేత్రం– మహేంద్రగిరి. ఆ ప్రాంతంలో దివ్యఔషధ గుణములుండే మొక్కలు వుంటాయి. అలాగే ఓ మహిమ గల శివాలయం వుంటుంది.

## దానిలో ఇంత మీనింగ్ ఉందా..?



తెలుగు సినీ పరిశ్రమలో మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటిగా పేరు తెచ్చుకున్న వారిలో ఫరియా అబ్దుల్లా ఒకరు. ఈమె నవీన్ పోలిశెట్టి హీరోగా ప్రియదర్శి , రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలలో అనుదీప్ కేవీ దర్శకత్వంలో రూపొందిన జాతి రత్నాలు సినిమాలో నవీన్ పోలిశెట్టి కి జంటగా నటించి మంచి గుర్తింపును సంపాదించుకుంది.ఈ సినిమాలో చిట్టి పాత్రలో నటించిన ఈమె తన కామెడీ టైమింగ్ తో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఇక ఆ తర్వాత ఈమెకు తెలుగులో పర్వాలేదు అనే స్థాయి క్రేజ్ ఉన్న ఎన్నో సినిమాలలో అవకాశాలు దక్కాయి. అందులో భాగంగా ఇప్పటికే చాలా సినిమాల్లో నటించి తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్ ను టాలీవుడ్ ఇండస్ట్రీ లో దక్కించుకుంది. ఇది ఇలా ఉంటే తాజాగా ఈ బ్యూటీఅల్లరి నరేష్ హీరోగా రూపొందిన ఆ ఒక్కటి అడక్కు అనే సినిమాలో హీరోయిన్ గా నటించింది. ఈ మూవీ మరికొన్ని రోజుల్లోనే విడుదల కాబోతోంది. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడడంతో ఈ బ్యూటీ వరుస ఇంటర్వ్యూలలో , టీవీ షో లలో పాల్గొంటూ ఈ సినిమాను ఫుల్ గా ప్రమోట్ చేస్తూ వస్తుంది. అందులో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా తన టాటూ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను చెప్పుకొచ్చింది. ఫరియా కాలుకు చెట్టు వేల లాంటి సింబల్ తో ఓ టాటూ ఉంది. దాని గురించి ఈమె వివరిస్తూ ... పేర్లు ఎంత స్ట్రాంగ్ గా ఉంటే మనం అంతా ఎత్తుకు ఎదగగలం.

## టిల్లు మరోసారి డైరెక్టర్ మారనున్నాడా...



తెలుగు సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు కలిగిన యువ హీరోలలో ఒకరు అయినటువంటి సిద్దు జొన్నలగడ్డ కెరియర్ ప్రారంభంలో చాలా సినిమాల్లో హీరోగా నటించినప్పటికీ వాటి ద్వారా ఈయనకు భారీ స్థాయిలో గుర్తింపు లభించలేదు.అలాంటి సమయం లోనే ఈయన విమల్ కృష్ణ దర్శకత్వంలో రూపొందిన డిజె టిల్లు అనే సినిమాలో హీరోగా నటించాడు. ఈ మూవీ అద్భుతమైన విజయం అందుకుంది. ఈ సినిమాతో ఒక్క సారిగా ఈ నటుడి క్రేజ్ తెలుగు లో భారీగా పెరిగిపోయింది. ఇందులో నేహ శెట్టి హీరోయిన్ గా నటించింది. ఇకపోతే ఈ సినిమా మంచి విజయం సాధించడంతో ఈ మూవీ కి కొనసాగింపుగా టిల్లు స్క్వేర్ అనే మూవీ ని అనౌన్స్ చేశారు. దానితో ఈ సినిమాకు కూడా విమల్ కృష్ణ అనే దర్శకత్వం వహిస్తాడు అని అంతా భావించారు. కానీ చివరకు సీన్ రివర్స్ అయ్యింది. టిల్లు స్క్వేర్ మూవీకి మల్లిక్ రామ్ దర్శకత్వం వహించాడు. ఈ మూవీ కొన్ని రోజుల క్రితమే థియేటర్ లలో విడుదల అయింది. అనుపమ పరమేశ్వరం ఈ సినిమాలో హీరోయిన్ గా నటించింది. మంచి అంచనాల నడుమ విడుదల అయిన ఈ సినిమా బాక్స్ ఆఫీస్ దగ్గర సూపర్ సాలిడ్ విజయాన్ని అందుకొని 100 కోట్లకు పైగా కలెక్షన్ లను కొల్లగొట్టింది. ఈ సినిమాకు కొనసాగింపుగా తాజాగా టిల్లు క్యూబ్ అనే మూవీ చేశారు. ఇక దీనికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తాడు అని అంతా అనుకున్నారు. కానీ టిల్లు క్యూబ్ మూవీ కి మ్యాడ్ సినిమాకు దర్శకత్వం వహించినటువంటి కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహించే అవకాశం ఉంది అని ప్రస్తుతం ఈయన ఇందుకోసం ఈ దర్శకుడు వర్క్ చేస్తున్నట్లు ఓ వార్త వైరల్ అవుతుంది. మరి ఇది ఎంత వరకు నిజమో తెలియాలి అంటే చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇచ్చేవరకు వేచి చూడాల్సిందే.

## పాలిక్ శ్రీను దర్శకత్వంలో నయా సినిమా



ఐ.ఐ.టి.కృష్ణమూర్తి ఫేమ్ పృథ్వీ హీరోగా, రూపాలి, అంబిక హీరోయిన్లుగా రచిత్ శివ, ఆర్.ఆర్.క్రియేషన్స్ అండ్ పాలిక్ స్టుడియోస్ పతాకాలపై తెరకెక్కుతున్న ప్రొడక్షన్ నెం.3 చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దుర్గం రాజేష్, రావుల రమేష్, టి.ఎస్.రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి స్టోరీ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం పాలిక్ శ్రీను. నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ హీరో, హీరోయిన్లపై క్లాప్ కొట్టి టీమ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా సీనియర్ నటి ఆమని మాట్లాడుతూ,'ఈ చిత్రంలో నేను ఓ ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నా. లవ్ అండ్ సెంటిమెంట్ ఎమోషనల్ కామెడీ మూవీ. ఇది గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న చిత్రం' అని తెలిపారు. 'ఈ చిత్రాన్ని పెద్ద ఎత్తున్న నిర్మించడానికి రావుల రమేష్, టి.ఎస్.రాజులతో కలిసి ముందుకు వచ్చాం. హీరో పృథ్వీని తెలంగాణ నుంచి, హీరోయిన్లను బాలీవుడ్ నుంచి, మళయాలం నుంచి అనిరుధ్‌ని విలన్గా%ొ% ఇలా అన్ని ప్రాంతాల నుంచి ఆర్టిస్టులను తీసుకుని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం' అని నిర్మాత దుర్గం రాజేష్ చెప్పారు. నిర్మాత రావుల రమేష్ మాట్లాడుతూ,' ఇటీవలే కాలకేయ ప్రభాకర్‌తో కలిసి 'రౌద్రరూపాయ నమ:' చిత్రాన్ని విడుదల చేశాం. ఆ చిత్రానికి మంచి పేరు వచ్చింది. ఈ చిత్రానికి ఎక్కువ థియేటర్లు లభిస్తాయని ఆశిస్తున్నా' అని అన్నారు. 'నా మిత్రుడు ఎస్.ఆర్.పి. కథతో ఈ సినిమా చేస్తున్నాం. పాటలు బాగా వచ్చాయి. వచ్చే నెల 25 నుంచి సెట్స్ మీదకు వెళుతుంది. ఐదు షెడ్యూల్స్‌లో సినిమాని పూర్తి చేసి దీపావళికి సినిమాని విడుదల చేస్తున్నాం' అని దర్శకుడు పాలిక్ చెప్పారు.

## ఒక నటికి ఇంతకంటే ఏం కావాలి?

"ప్రేక్షకుడికి ఒక మంచి సినిమాని ఇవ్వాలనే ఆలోచన తప్ప మిగతా ఏ రకమైన ఒత్తిడీ నాపైన ఉండదు. తెలుగు సినిమా.. నటిగా నాకు రెండో జీవితాన్నిచ్చింది.తెలుగు ప్రేక్షకులు నన్ను వాళ్ల సొంతం చేసుకున్నారు. ఆ ప్రేమే నన్ను హైదరాబాద్‌కి మారిపోయేలా చేసింది. 'శబరి'తో మరోసారి తెలుగువాళ్ల మనసుల్ని గెలుస్తాననే నమ్మకం ఉంది" అన్నారు వరలక్ష్మి శరత్‌కుమార్. ఇటీవల ఆమె ప్రధాన పాత్రధారిగా 'శబరి' తెరకెక్కింది. అనిల్ కాట్జ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మే 3న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా వరలక్ష్మి శరత్‌కుమార్ బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. ఆ విషయాలివీ... "ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ కథ. అంతకుముందు నేను చేసిన పాత్రలతో పోలిస్తే కొత్తగా అనిపించింది. భర్త నుంచి వేరు పడిన ఓ మహిళ, తన కూతురిని కాపాడుకోవడం కోసం ఏం చేసిందనేదే ఈ చిత్రం. ఇదివరకు యాక్షన్ ప్రధానంగా సాగే పాత్రలు చేశా కానీ ఇందులో చేసిన యాక్షన్ భిన్నం.



# క్రీడలు



## ఐపీఎల్ హిస్టరీలోనే అత్యంత చెత్త రికార్డు?



ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఎంత హోరాహోరీగా జరుగుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ క్రమంలోనే ప్రస్తుతం సగంకి పైగా మ్యాచ్లు ముగిసాయి అని చెప్పాలి.ఇక ప్లే ఆఫ్ లో అడుగుపెట్టబోయే టీమ్స్ ఏవి అనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. అన్ని టీమ్స్ కూడా టైటిల్ గెలవడమే లక్ష్యంలో హోరాహోరీగా పోరాటం కొనసాగిస్తున్నాయ్. ప్రతి మ్యాచ్లో కూడా భారీ స్కోర్లు నమోదు అవుతూ ఉన్నాయి. ఒకప్పుడు ఐపీఎల్ లో ఒక మ్యాచ్ లో 200 స్కోర్ నమోదయిందంటే అదే గొప్ప అనుకునేవారు. కానీ ఇప్పుడు ప్రతి మ్యాచ్ లో కూడా 200 స్కోర్ నమోదవుతున్నాయి. ఇక రెండు టీమ్స్ కూడా 200 ప్లస్ స్కోర్లు నమోదు చేస్తూ ఉండడం గమనార్హం. దీంతో ఈ ఐపీఎల్ పోరు మరింత రసవత్తరంగా మారిపోయింది. అయితే ఎంతోమంది ప్లేయర్లు అత్యుత్తమమైన ప్రదర్శన చేసి అరుదైన రికార్డులు కూడా సృష్టిస్తున్నారు. అదే సమయంలో కొంతమంది ప్లేయర్లు చెత్త ప్రదర్శనలు కారణంగా ఇక ఎన్నో వరల్డ్ రికార్డులను కూడా ఖాతాలో వేసుకుంటూ ఉండడం గమనార్హం. కాగా ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగకుండా అద్భుతంగా రాణించిన ఢిల్లీ జట్టు.. 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఇక ఈ మ్యాచ్ లో ఇరు జట్లు బ్యాట్స్మెన్లు పరుగుల ప్రవాహాన్ని కొనసాగించారూ అని చెప్పాలి. కాగా ఇటీవలే ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్లో గుజరాత్ బౌలర్ మోహిత్ శర్మ ఒక చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. ఐపీఎల్ హిస్టరీలోనే అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్గా ఒక అపఖ్యాతిని మూటగట్టుకున్నాడు అని చెప్పాలి. ఢిల్లీతో జరిగిన మ్యాచ్లో మోహిత్ శర్మ నాలుగు ఓవర్లు వేసి ఒక వికెట్ కూడా తీయకుండానే 73 పరుగులు సమర్పించుకున్నాడు. దీంతో చెత్త రికార్డు అతని ఖాతాలో వచ్చి చేరింది. గతంలో ఈ రికార్డు బాసిల్ తంబి పేరిట ఉండేది. ఏకంగా అతను 70 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక ఇప్పుడు ఈ రికార్డును మోహిత్ శర్మ బద్దలు కొట్టాడు. ఇక వీరి తర్వాత యష్ దయాల్ 69, రీస్ టాప్లే 68 పరుగులు ఇచ్చిన బౌలర్లుగా ఉన్నారు.

## భారత మాజీ కీలక వ్యాఖ్యలు?



ఇటీవల కాలంలో క్రికెట్లో అధునాతనమైన టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఈ టెక్నాలజీని ఉపయోగించి ఇక ప్రతి నిర్ణయాన్ని కూడా ఎంతో ఖచ్చితత్వంతో తీసుకోగలుగుతున్నారు.ఇక ఒకప్పుడు ఎల్బీడబ్ల్యు విషయంలో కన్ఫ్యూజన్ నెలకొనేది. ఫీల్డ్ ఎంపైర్ అవుట్ ఇచ్చిన తర్వాత ఇక కచ్చితత్వంతో చెక్ చేసేందుకు టెక్నాలజీ అందుబాటులో ఉండేది కాదు. కానీ ఇప్పుడు మాత్రం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అయితే ఏదైనా నిర్ణయం విషయంలో అంపైర్లకు అనుమానాలు ఉన్నాయి అంటే చాలు థర్డ్ అంపైర్ కు రిఫర్ చేయడం చూస్తూ ఉన్నాం. దీంతో థర్డ్ అంపైర్లు అన్ని యాంగిల్స్ లో కెమెరాలను చెక్ చేసిన తర్వాత అక్కడ ఏం జరిగింది అనే విషయంపై అసలైన నిర్ణయాన్ని ప్రకటించడం చేస్తున్నారు. మరి ముఖ్యంగా ఎల్బీడబ్ల్యు విషయంలో ఇక ఇలాంటివి ఎక్కువగా చూస్తూ ఉన్నాం. ఇక ఈ మధ్యకాలంలో క్యాచ్ ల విషయంలో కూడా ఇలాంటి రివ్యూలు తీసుకుంటూ ఉన్నారు ఫీల్డ్ అంపైర్లు. అయితే ఇదే విషయంపై అటు భారత మాజీ ఆటగాడు నవజ్యోత్ సింగ్ సిద్ధు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. పూర్తిగా టెక్నాలజీ మీదే ఆధారపడితే ఇంకా ఫీల్డ్ ఎంపైర్లు ఎందుకు అంటూ ఆయన చేసిన కామెంట్లు కాస్త వైరల్ గా మారిపోయాయి. సాంకేతికత సహాయంతో 90% నిర్ణయాలు థర్డ్ అంపైర్లు తీసుకుంటున్నారు. దీంతో ఇలా క్రికెట్లో టెక్నాలజీ హవా నడుస్తున్న నేపథ్యంలో ఫీల్డ్ ఎంపైర్లు నామమాత్రంగా మారిపోయారు అంటూ నవజ్యోత్ సింగ్ సిద్ధూ అభిప్రాయం వ్యక్తం చేశాడు. రానున్న రోజుల్లో అయినా ఫీల్డ్ ఎంపైర్లు విచక్షణతో సరైన నిర్ణయాలు తీసుకుంటేనే మేలు జరుగుతుంది అంటూ అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఇక ప్రతి నిర్ణయం విషయంలో థర్డ్ అంపైర్ పైనే ఆధారపడితే ఇక ఫీల్డ్ ఎంపైర్లు ఉండాల్సిన అవసరం ఏముంది అంటూ ప్రశ్నించాడు. అయితే ఇది నిజంగా ఆలోచించాల్సిన విషయమే అంటూ నవజ్యోత్ సింగ్ సిద్ధు చేసిన కామెంట్స్ పై నేటిజన్స్ కూడా స్పందిస్తున్నారు అని చెప్పాలి.

## ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులోకి విధ్వంసకర ప్లేయర్?



2024 ఐపీఎల్ సీజన్లో భారీ అంచనాల మధ్య బరిలోకి దిగింది ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు. యాక్సిడెంట్ కారణంగా దాదాపు ఏడాదిన్నర కాలం పాటు ప్రొఫెషనల్ క్రికెట్కు దూరంలో ఉన్న ఆ చెట్టు కెప్టెన్ రిషబ్ పంత్ మళ్లీ ఐపీఎల్లోకి ఎంట్రీ ఇచ్చాడు ఈ క్రమంలోనే అతని కెప్టెన్సీలో బరిలోకి దిగింది ఢిల్లీ క్యాపిటల్స్ అయితే ఈసారి తప్పకుండా టైటిల్ గెలిచి తీరుతుందని అందరూ నమ్మకం పెట్టుకున్నారు. కానీ ఊహించని రీతిలో ఆ జట్టు పడుతూ లేస్తూ ప్రయాణాన్ని సాగిస్తోంది. పెద్దగా చెప్పుకొదగ్గ ప్రదర్శన చేయడం లేదు. ఒక రకంగా చెప్పాలంటే టైటిల్ వేటలో కాస్త వెనకబడిపోయింది అని చెప్పాలి. ఈ క్రమంలోనే ఢిల్లీ క్యాపిటల్స్ ఆటపై తీవ్ర విమర్శలు కూడా వస్తూ ఉన్నాయి. అయితే ఇక తర్వాత మ్యాచ్ లలో పుంజుకుని అద్భుతంగా రానించాలి అని ఆ జట్టు ప్రణాళికలను సిద్ధం చేసుకున్న సమయంలో.. ఇటీవల ఢిల్లీ క్యాపిటల్స్ కి బిగ్ షాక్ తగిలింది అన్న విషయం తెలిసిందే. ఏకంగా జట్టు విజయాలలో కీలకంగా వ్యవహరిస్తాడు అనుకున్న మిచెల్ మార్ష్ ఇటీవలే ఇక గాయం కారణంగా ఐపీఎల్ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. మార్చి మూడవ తేదీన జరిగిన మ్యాచ్లో అతని చివరి మ్యాచ్ ఆడడు మళ్ళీ కోలుకొని జట్టులోకి వస్తాడు అనుకున్నప్పటికీ అది జరగలేదు. మిచెల్ మార్ఛ్ ఇలా ఐపీఎల్ టోర్నీకి మొత్తం దూరం కావడంతో అతని స్థానంలో ఇక మరో ఆటగాడిని జట్టులోకి తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ఇదే పనిలో నిమగ్నమైందట. అతని స్థానంలో సౌత్ ఆఫ్రికా విధ్వంసకర ఆటగాడు వందర్ డసన్ ను జట్టులోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. కాగా ఐపిఎల్ 2024 మినీ వేలంలో అతను అమ్ముడుపోలేదు. అయితే ఇప్పుడు అతని బేస్ ప్రైజ్ రెండు కోట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కాగా డాసేన్ గత పాకిస్తాన్ సూపర్ లీగ్ లో ఏడు మ్యాచ్లలోనే 364 పరుగులతో సెకండ్ లీడింగ్ స్కోరర్ గా నిలిచాడు అన్న విషయం తెలిసిందే.

## పాక్ ప్లేయర్ పై ప్రశంస..

## జోక్ ఆఫ్ ది ఇయర్ అంటున్న నేటిజన్స్?




పాకిస్తాన్ ఆటగాళ్లు ఏం చేసినా అది సోషల్ మీడియాలో ఎప్పుడు సెన్సేషన్ గా మారిపోతూ ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ప్లేయర్లు చేసిన పని ఏదైనా ఎప్పుడు ట్రోల్స్ కి గురవుతూ ఉంటుంది.ఏకంగా తమ గురించి తాము గొప్పలు చెప్పుకోవడంలో ఆ దేశ ఆటగాళ్లు ఎప్పుడూ ముందుంటారు. అదే సమయంలో భారత క్రికెటర్లపై విమర్శలు గుప్పించడంలో కూడా ముందుంటారు అని చెప్పాలి. భారత క్రికెటర్లకంటే తాము గొప్పవాళ్ళు అని ఎప్పుడు సెల్ఫ్ డబ్బా కొట్టుకుంటూ ఉంటారు. ఇంకోవైపు ఇక తమ ఆట తీరుతో కూడా ఎప్పుడు వార్తల్లో హాట్ టాపిక్ గా మారిపోతూ ఉంటారు పాకిస్తాన్ క్రికెటర్లు. తప్పకుండా గెలుస్తుంది అనుకున్న మ్యాచ్లో చిన్న చిన్న తప్పిదాలు చేసి ఓడిపోవడం.. తప్పకుండా ఓడిపోతుంది అనుకున్న మ్యాచ్ లో అద్భుతమైన ఆట తీరుతో గెలవడం. కేవలం పాకిస్త్రాన్క్రికెట్ జట్టుకు మాత్రమే సాధ్యమవుతుంది సాధరణంగా సొంత డబ్బా కొట్టుకోవడం అంటూ ఉంటారు కదా. ఇక ఇలాంటి విషయంలో ఎప్పుడు పాక్ ప్లేయర్లు ముందుంటారు. ఇక ఇటీవల ఇలాంటి సొంత డబ్బాతో సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎదుర్కొంటున్నారు పాకిస్తాన్ ప్లేయర్లు. పాకిస్తాన్ వికెట్ కీపర్ మహమ్మద్ రిజ్వాన్ పై ఆ దేశ ఫాస్ట్ బౌలర్ షాహీన్ ఆఫ్రీది ప్రశంసలు కురిపించాడు. ఇలా ప్రశంసలు కురిపించడంలో తప్పేమీ లేదు. కానీ ఏకంగా మహమ్మద్ రిజ్వాన్ ను క్రికెట్ లెజెండ్ బ్రాడ్ మాన్ తో పోల్చాడు షాహిన్ అఫ్రీది. దీనిపై సోషల్ మీడియాలో నెటిజన్స్ ఆఫ్రిదిని ఏకీపారేస్తున్నారు. జోక్ ఆఫ్ ది ఇయర్ అంటూ కొంతమంది సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. మహమ్మద్ రిజ్వాన్ బ్రాడ్ మాన్ కాదు బ్రెడ్ మ్యాన్ అని ఇంకొంతమంది ట్రోల్స్ చేస్తున్నారు. రిజ్వాన్ ను బ్రాడ్మన్ తో పోల్చి ఆయన గౌరవాన్ని తగ్గించోద్దు అంటూ ఇంకొంతమంది కామెంట్ చేస్తున్నారు.


## ధోనీని అంత కోపంగా ఎప్పుడు చూడలేదు



సాధారణంగా ఎంతో కూల్ గా కనిపించే క్రికెటర్లు ఏదో ఒక సమయంలో అగ్రేసీవ్ గా కనిపించడం చూస్తూ ఉంటాం. అయితే తన జట్టును గెలిపించాలి అనే ఉద్దేశంతో కొన్ని కొన్ని సార్లు ఏకంగా తమ బాగోద్వేగాలను కంట్రోల్ చేసుకోవడంలో విఫలమౌతూ ఉంటారు.

ఈ క్రమంలోనే కోపంతో ఊగిపోవడం జరుగుతూ ఉంటుంది అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదానికి దిగడం కూడా చేస్తూ ఉంటారు ఎంతమంది ప్లేయర్లు. ఇలా ఇప్పటివరకు ప్రొఫెషనల్ క్రికెట్లో ఎంతోమంది ప్లేయర్లు ఏకంగా ప్రత్యర్తి ఆటగాళ్లతో వివాదానికి దిగిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కానీ ఇక మిస్టర్ కూల్ అనే పదానికి మాత్రం అటు టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని కేరాఫ్ అడ్రస్ గా ఉంటాడు అన్న విషయం తెలిసిందే. ఇక ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా సరే ఎంతో కూల్ గా ఉంటాడు. తన చిరునవ్వుతోనే ప్రత్యర్థులను భయపెడుతూ ఉంటాడు మహేంద్ర సింగ్ ధోని. తన వ్యూహాలతో ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్ ను తన వైపుకు తిప్పుకోగల సమర్థుడు ధోని అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎప్పుడు ఎంతో కూల్ గా కనిపించే ధోని కొన్ని కొన్ని సార్లు మాత్రం కోపంతో ఊగిపోతూ ఉంటాడు. అయితే ఇదే విషయం గురించి ఇక ధోని సహచరుడు సురేష్ రైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2014లో పంజాబ్ చేతిలో క్వాలిఫై%తీ% 2 లో ఓడినా తర్వాత ధోని చాలా కోపంగా కనిపించాడు అంటూ రైన చెప్పుకొచ్చాడు. మిస్టర్ కూల్ ని అలా ఎప్పుడూ చూడలేదు అంటూ గుర్తు చేసుకున్నాడు. 31 బంతుల్లో 42 పరుగులతో ధోని క్రీజులో ఉన్న జట్టును గెలిపించుకోకపోవడంతో డ్రెస్సింగ్ రూమ్ లోకి వచ్చి ప్యాడ్లు బ్యాట్ ని విసిరి కొట్టాడు అంటూ రైన గుర్తు చేసుకున్నాడు. కాగా ఈ మ్యాచ్లో 27 పంతులు 81 అడుగులు చేశాడు సురేష్ రైన.

## టీ20 వరల్డ్‌కప్ జట్టులో హార్దిక్ నో ప్లేస్.!



ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ కొనసాగుతోంది. అయితేనేం మరో నెలన్నర రోజుల్లో మొదలుకానున్న టీ20 ప్రపంచకప్‌పైనే అందరి కళ్లు. టీమిండియాకి ఏయే ప్లేయర్స్ ఎంపిక అవుతారు.? ఎవరికి ఉద్వాసన పలకనున్నారు.? అనేది ఇప్పుడు అందరి మదిలోనూ మెదులుతున్న ప్రశ్న. టీ20 వరల్డ్‌కప్ గెలుపే లక్ష్యంగా బీసీసీఐ పావులు కదుపుతోంది. ఇప్పటికే 10 మందికిపైగా ప్లేయర్ల ఎంపిక జరిగినట్టు.. మరో 10 మంది కోసం ఎంపికలు జరుగుతున్నట్టు సమాచారం. ఈ తరుణంలో ఓ ఇంటరెస్టింగ్ న్యూస్ బయటకొచ్చింది. చెత్త ఫామ్ కొనసాగిస్తున్న హార్ధిక్ పాండ్యాకు బదులు.. టీమిండియాలోకి ఓ తెలుగోడిని తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. అతడు మరెవరో కాదు నితీష్ రెడ్డి. ఎస్‌ఆర్‌హెచ్ టీమ్‌కు దొరికిన ఈ ఆణిముత్యం. క్వాలిటీ ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్నాడు. ప్రస్తుతం అద్భుత ఫాంలో ఉన్న నితీష్ రెడ్డిపై టీమిండియా సెలెక్టర్లు కన్ను పడ్డట్టు సమాచారం. హార్దిక్ పాండ్యాకు రీప్లేస్‌మెంట్‌గా నితీష్ రెడ్డిని తీసుకోవాలని భావిస్తున్నారట. ప్రస్తుతం ముంబై ఇండియన్స్‌కు సారధ్యం వహిస్తోన్న హార్దిక్ పాండ్యా.. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీలోనూ ఘోరంగా విఫలమయ్యాడు. అలాగే ఎప్పుడు గాయపడతాడో కూడా తెలియని పరిస్థితి. అందుకే శివమ్ దూబేతో పాటు టీ20 వరల్డ్ కప్ 2024 జట్టులోకి నితీష్ రెడ్డిని కూడా తీసుకోవాలని సెలెక్టర్లు ఆలోచిస్తున్నారట. అటు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇందుకు సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. సన్‌రైజర్స్ టీంలో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేయడంతో పాటు మిడిలార్డర్‌లో యాంకర్ రోల్ పోషిస్తున్నాడు నితీష్ రెడ్డి. దీంతో పాండ్యా ప్లేస్‌కి నితీష్ కరెక్ట్ ఆప్షన్ అని క్రికెట్ నిపుణులు అంచనా. కానీ కొందరైతే నితీష్ రెడ్డిని ముందుగా ద్వైపాక్షిక సిరీస్‌లలో ప్రయత్నించాలని సూచిస్తున్నారు.

## వైయస్సార్ సీపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీనియర్ పాత్రికేయుడు చావాన్ సుదర్శన్



ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..అవినీతిపరులు, అవకాశవాదులను ఎదుర్కొని తరిమెందుకే తాను సీనియర్ పాత్రికేయునిగా వైయస్సార్ సీపీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రముఖ సీనియర్ పాత్రికేయుడు చావాన్ సుదర్శన్ పేర్కొన్నారు. నామినేషన్లు వేసుకునేందుకు చివరి రోజైనా గురువారం తన నామినేషన్ను దాఖలు చేసిన అనంతరం ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మోసపూరితమైన హామీలు పనికిరాని సంక్షేమ పథకాలు కార్యక్రమాలను అమలు చేస్తున్నామంటూనే ప్రజలను అడుగడుగున మోసగిస్తున్న కాంగ్రెస్, బిజెపిలకు తగిన విధంగా గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అటు కేంద్రంలో బిజెపి సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వ ఖజానాను గండికోటెల మోసగిస్తున్నాయని ఆరోపించారు. తాను గతంలో కూడా నిర్మల్ శాసనసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తే స్వాతంత్ర అభ్యర్థులలో అత్యధిక ఓట్లు తనకు వేసి నిర్మల్ నియోజకవర్గం ప్రజలు అభినందించారని పేర్కొన్నారు. అదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోని ఏడు నియోజకవర్గాలలో రోజువారీగా తిరుగుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వైఫల్య కార్యక్రమాలను అవగాహన కల్పిస్తూ అవకాశవాద రాజకీయ నాయకులు పార్టీలకు తగిన విధంగా గుణపాఠం చెప్పేలా ముందుకెళ్తానని చెప్పారు.

లంబాడ సామాజిక వర్గానికి చెందిన తనకు వైఎస్సార్సీపీ అధినేత ఆహ్వానం పలికి ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం మరువలేనని పార్టీ విధివిధానాలకు అనుగుణంగా ఈ ఎన్నికలలో తగిన విధంగా ముందుకెళ్లి గెలుపే లక్ష్యంగా కష్టపడతానని తెలిపారు. ఏడు నియోజకవర్గాలలోని లంబాడ సామాజిక వర్గాల వారందరూ తనకు తోడు నీడగా నిలవాలని కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ లో లంబాడ సామాజిక వర్గానికి చెందిన వారికి కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఇతర వర్గాలకు టికెట్లు ఇచ్చి ఎన్నికలలో పోటీకి దించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికలలో తనకు పోటీ బిజెపి కాంగ్రెస్ తోనేనని ఇరుపాటిల ప్రజా వైఫల్యాల పైనే తన పోరాటం ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు సుదర్శన్,సురేష్, గణేష్ శివాజీ రాథోడ్ తదితరులు ఉన్నారు

## తెజస అధినేత కోదండరాంని కలిసిన డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు




ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా..తెలంగాణ జన సమితి అధినేత, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం ను డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఏఎన్ రెడ్డి కాలనీ లో ప్రొఫెసర్ కోదండరాంను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. రాష్ట్ర రాజకీయాలు, జరగబోయే పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీహరి రావు మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరాం తెలంగాణ ప్రజలకు ఉద్యమానాయకుడుగారాష్ట్ర జెఎసి అధ్యక్షుడిగా సుపరిచితుడని అన్నారు.తెలంగాణా రాష్ట్ర సాధన కొరకు జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేశారని సబ్బండ వర్గాలను ఒక్క తాటిపైకి తెచ్చి తెలంగాణ సాధనలో కీలక బూమి పోషించారని అన్నారు. ఇందులో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎర్రవోతూ రాజేందర్,తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షులు కొట్టే శేఖర్ ఉన్నారు

## తూప్రాన్ నలందా జూనియర్ కళాశాల విద్యార్థినిల ప్రభంజనం




తూప్రాన్, ఎప్రిల్, 25 ప్రజాబలం న్యూస్ :- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్మీడియెట్ ఫలితాలలో తూప్రాన్ నలంద జూనియర్ కళాశాల విద్యార్థినుల ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ పి.వెంకట రమణ హర్షం వ్యక్తం చేశారు. తూప్రాన్ పట్టణంలో 2023-24 విద్యా సంవత్సరంలో కేవలం బాలికలకు మాత్రమే తరగతులను నిర్వహించి, అతి తక్కువ అడ్మిషన్ల నుండి అత్యధిక ఫలితాలను సాదించి విజయ దుందుభి మోగించిన ఏకైక కళాశాల మీ ,మా,మన నలంద జూనియర్ కళాశాల అని తెలిపారు. 2023-2024 సంవత్సరంలో కేవలం 74 మంది బాలికలను అడ్మిషన్లు తీసుకోని నేటి ఫలితాల్లో 51.65 శాతం పాస్ పర్సంటేజ్ సాధించిన ఏకైక కళాశాల నలంద కళాశాల అని అన్నారు. 2024 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో మెరుగైన ఫలితాలను సాధించిన మా విద్యాకుసుమాలు..

ఎం.పి.సి లో ఏ.స్రవంతి 470 మార్కులకు గాను 418 మార్కులు సాధించి ర్యాంక్ పొంది కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిందన్నారు. అలాగే జి. శృతి 470 మార్కులకు గాను 410 మార్కులు సాధించి ర్యాంక్ తెచ్చారని అన్నారు. వి.కల్పన 440/416, సి.హెచ్.దీపిక 378/440, సి.ఈ.సి లో అర్.వైష్ణవి 425/500, ఎస్.శ్రావణి 422/500, పి.పూజిత 420/500, బి.రేవతి 403/500. ఇలా ఇంకా ఎన్నెన్నో

తూప్రాన్ పట్టణ, పరిసర ప్రాంత విధ్యార్థుల మరియు వారి తల్లి తండ్రుల కోరిక మేరకు 2024-25 సంవత్సరం నుండి బాలికలకు మరియు బాలురకు ప్రత్యేకంగా తరగతులను నిర్వహించడం జరుగుతుందనీ 2024-25 కి అడ్మిషన్ లు ప్రారంభమైందని తెలిపారు.

## మల్కాజిగిరి నియోజకవర్గానికి (114 ) మంది అభ్యర్థులకు గాను (177 ) నామినేషన్లు

ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 25:పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ లో భాగంగా మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి చివరి రోజున (61 )మంది అభ్యర్థులకు గాను (91 )నామినేషన్లు వేయడం జరిగిందని మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. మల్కాజిగిరి లోక్ సభ నియోజకవర్గ స్థానానికి , ఈ నెల 18 నుండి 25 వరకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ లో భాగంగా మల్కాజిగిరి నియోజకవర్గానికి (114 ) మంది అభ్యర్థులకు గాను (177 ) నామినేషన్లు పత్రాలు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

## పెద్దపల్లి ఎంపీగా భారీ మెజారిటీతో వంశీని గెలిపించండి

**ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తాం**

**కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్**

**లక్షెట్టిపేట పట్టణంలో ఇంటింటా ప్రచారం**



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 : పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసి తీరుతామని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్ పేర్కొన్నారు.గురువారం అయన పట్టణంలో ఇంటింటికి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ,చేతి గుర్తుకు ఓటేయ్యాలని ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన 6 గ్యారెంటీలను అమలుపై ఇలాంటి సందేహాలు అవసరం లేదన్నారు.పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ ద్వారానే సాధ్యమౌతుందన్నారు. మౌళిక,సంక్షేమ రంగాలకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని తెలిపారు.అభివృద్ధికై నిరంతరం తపించే నాయకులనే గెలిపించాలన్నారు.అనంతరం ఓటు ఎలా వేయాలో ప్రజలకు, ఓటర్లకు అవగాహన కల్పించారు.వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ ఎంపీగా గడ్డం వంశీకృష్ణ ను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఉత్తురి రవీందర్,కొత్త వెంకటేశ్వర్లు,రాజమౌళి, నడిమెట్ల రాజన్న,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు షెడ్డును నిర్మించడం హర్షనీయం అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలోని ఉత్కూర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడంతో అధికారులు స్పందించి ప్రయాణికుల కోసం తాత్కాలిక షెడ్డు నిర్మించడం చాలా హర్షనీయమని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు పేర్కొన్నారు.గురువారం అయన స్థానిక నాయకులతో కలిసి నూతనంగా నిర్మించిన తాత్కాలిక షెడ్డును పరిశీలించి ప్రయాణికులతో మాట్లాడారు. రాజు మాట్లాడుతూ...24 గంటల్లో స్పందించిన మున్సిపల్,ఆర్టీసీ, పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బైరం లింగన్న,పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్,గరిసే రవీందర్, శ్రీనివాస్,ప్రయాణికులు పాల్గొన్నారు.

## డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి నామినేషన్కు మద్దతు



చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి నామినేషన్ గురువారం సాయంత్రం 4.00 గంటలకు ముగియగా అందులో మణికొండ స్థానిక కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు ప్రెసిడెంట్ ఇందిరా, డాక్టర్ ప్రభావతీ, సావిత్రి, రమాదేవి, మంజుల, చందన, స్వర్ణ తదితరులతో పాటు శ్రీనివాస్, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు రాజేంద్ర నగర్ లో జరిగిన బహిరంగ సభలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం గావించినారు.

## కోలాహలంగా కొట్టు నామినేషన్

### విజయ యాత్రను తలపించిన భారీ ర్యాలీ

### జనం మధ్యలో నుంచి కాలినడకన ముందుకు సాగిన వైనం

తాడేపల్లిగూడెం వేలాదిమంది వెంట రాగా జనం మధ్యలో నుంచి కాలినడకన ముందుకు సాగి నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్లారు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ. ఆయన ఇంటి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు వేలాది మందితో సాగిన ఈ మహా ర్యాలీ విజయ యాత్రను తలపించింది. ఇసుక వేస్తే రాలనంతగా జనంతో రహదారులన్నీ క్రిక్కిరిసిపోయాయి. గురువారం మధ్యాహ్నం 12:30 గంటల సమయానికి వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి కొట్టు సత్యనారాయణ తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కే. చెన్నయ్య కు అందజేశారు. కొట్టు నామినేషన్ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలు, వార్డుల నుంచి ప్రజలు తండోపతండాలుగా ఉదయం 9 గంటల సమయానికే పార్టీ కార్యాలయానికి చేరుకోవడం మొదలైంది. మోటార్ సైకిళ్లు, ఆటోలు, కార్లు, వ్యాన్లు పై భారీగా జనం తరలివచ్చారు. వైఎస్ఆర్సిపి జెండాలను చేతపట్టుకుని యువకులు కేరింతలు కొట్టి డాన్సులు వేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా కొట్టు నామినేషన్ కార్యక్రమానికి ఉరకలు వేసుకుంటూ ఉవ్వెత్తున తరలి వచ్చారు. ఉదయం 10:30 గంటలు సమయం అయ్యేసరికి పార్టీ కార్యాలయం, మంత్రి నివాసం ప్రాంతమైన గీతా మందిరం రోడ్డు, పవన్ మెస్ రోడ్డు, కొండయ్య చెరువు రోడ్డు, కోదండ రామాలయం గుడి వైపు రోడ్డు ఇలా నాలుగు వైపులా రోడ్లు జనంతో నిండిపోయాయి. మనిషి నడిచి వెళ్లేందుకు కూడా వీలులేనంతగా జనం పోటెత్తారు. సరిగ్గా 11:30 గంటల సమయానికి మంత్రి కొట్టు ఇంట్లో నుంచి నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరేందుకు బయటకు వచ్చారు. ఆ సమయంలో జనం ఆయనకు పూలమాలలు వేయడానికి, పుష్పగుచ్చాలు అందించడానికి, మెడలో కండువాలు వేయడానికి, ఆయనతో కరచాలనానికి విపరీతంగా పోటీపడ్డారు. దాంతో ఆయనను ముందుకు తీసుకురావడానికి భద్రత సిబ్బంది చాలా శ్రమించవలసి వచ్చింది. వేలాదిమంది జనం మధ్యలో నుంచి అందరికీ నమస్కరిస్తూ కొట్టు కాలినడకన ముందుకు సాగారు. కొన్ని వేల అడుగులు ఆయన వెంట ముందుకు కదిలాయి. కనుచూపుమేరలో జనమే జనం. ఆ జనం మధ్యలో నుంచి కొట్టు ముందుకు సాగగా ఆయనకు వెనకా ముందు కూడా వేలాది మంది జనం అనుసరించడంతో మహా ర్యాలీగా ముందుకు వెళ్లారు. ఈ దృశ్యం చేసిన ప్రతి ఒక్కరికి నామినేషన్ రోజే విజయ యాత్రను తలపించింది. ఈ కార్యక్రమంలో నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఈలి నాని, పసల కనక సుందరరావు, కొట్టు మురళి, కొట్టు విశాల్, కొట్టు బాల రాజేష్, కొట్టు నాగేంద్ర, జడ్పీటిసీలు, ఎంపీపీలు, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, సొసైటీల చైర్మన్లు, డైరెక్టర్లు, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డుల ఇన్చార్జిలు, దేవస్థానాలు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, వార్డుల ఇన్చార్జిలు, పార్టీ ప్రెసిడెంట్లు, మహిళా ప్రెసిడెంట్లు, యూత్ ప్రెసిడెంట్లు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తోపాటు వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఆర్ఆర్ఆర్ జోష్..!

మంత్రులు తుమ్మల, పొంగులేటి,ఎంపీ రేణుకా చౌదరి తో కలిసి నామినేషన్ కు ర్యాలీగా

వందలాదిగా కదిలొచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

మద్దతు తెలిపిన వామపక్షాలు







ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం) ఖమ్మం కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి ( ఆర్ ఆర్ ఆర్ )నామినేషన్ సందర్భంగా ఖమ్మంలో గురువారం జోష్ నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ అభ్యర్థిగా ఖరారు అయ్యాక తొలిసారిగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి తో కలిసి ఖమ్మం రాగా ఖమ్మం కాంగ్రెస్ శ్రేణుల నుంచి రఘురాం రెడ్డికి కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ ఘన స్వాగతం లభించింది కాల్వొడ్డు నుంచి కలెక్టరేట్ కు ఆటో బైకులతో ప్రదర్శన నగరంలోని కాల్వొడ్డు నయాబజార్ కళాశాల నుంచి కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థి రఘు రాం రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు రేణుక చౌదరి, కాంగ్రెస్ శాసన సభ్యులు, కొత్తగూడెం సీ పీ ఐ ఎమ్మెల్యే సాంబశివరావు , సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ , పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువాళ్ళ దుర్గ ప్రసాద్ తో కలిసి తో కలిసి కొత్త కలెక్టరేట్ వరకు ర్యాలీ గా వచ్చారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో వందలాదిగా తరలి వచ్చారు. అనంతరం కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి వి.పి. గౌతమ్ కు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి భాగం హేమంతరావు, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ , జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు , కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావేద్ , మద్దినేని బేబీ స్వర్ణ కుమారి, ముమ్వా విజయ బాబు, తుళ్ళూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# బీసీ కులాలన్నీ ఏకమై కాంగ్రెస్ కు బుద్ది చెప్పాలి

నాకు యాదవులు మద్దతుగా నిలవాలి

యాదవులు మాటిస్తే వెనక్కిపోరు

యాదవుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, తాతా మధు, వద్దిరాజు రవిచంద్ర



ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం) ఖమ్మం కేసీఆర్ ఆశీర్వదించి,బీఫామ్ ఇచ్చి మీ వద్దకు పంపారు.. బీసీలంతా సమైఖ్య%శీ%గా కలసి మెలసి పని చేసి తనను గెలిపించి మళ్లీ పార్లమెంట్ కు పంపాలని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలో



గురువారం జరిగిన యాదవుల ఆత్మీయ సమావేశంలో నామ మాట్లాడారు.యాదవులతో తనకు అవినాభవ సంబంధం ఉందని, యాదవులు మాట ఇస్తే వెనక్కిపోరని అన్నారు.వారికి మంత్రి పదవి ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని కులాలు కలిసి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తన కన్న బిడ్డల కంటే మిన్నగా దివంగత చిత్తారు శ్రీహరి యాదవ్ కోరిక మేరకు ఆయన కుమార్తె ను లక్షల డోనేషన్ కట్టి ఎంబీబీఎస్ చదివించానని చెప్పారు. గత ఎన్నికల్లో కూడా యాదవులు తనకు మద్దతుగా నిలిచారని , ఈ ఎన్నికల్లో కూడా తనకు మద్దతుగా నిలిచి, తనను మంచి మెజార్టీతో గెలిపించాలని అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ బీసీ బిడ్డ కూరాకుల నాగభూషణం ను కుట్రతో పదవి నుంచి దించిన కాంగ్రెస్ కు యాదవులు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కలిసి కడుపు మంటతో ఈ పని చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు సాదించగల సత్తా , ధైర్యం ఉన్న నామకు ఆశీస్సులు అందజేయాలని అన్నారు.



రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ గడి దొరకు , రైతు బిడ్డ నామకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీసీలంతా ఐక్యంగా నామకు మద్దతుగా నిలవాలన్నారు. ఓటేసినందుకు కాంగ్రెస్ బీసీలపై కక్ష గట్టిందని, కుట్ర చేసి, బీసీ బిడ్డ కూరాకుల నాగభూషణం ను పదవి నుంచి తొలగించారని తెలిపారు. కేసీఆర్ 10 ఏళ్ల అద్భుత పాలనలో 86 బీసీ కులాలకు హైదరాబాద్ లో విలువైన స్థలాలు ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు.ఈ సందర్భంగా కూరాకుల నాగభూషణం ను, నామను, వద్దిరాజు రవిచంద్ర ను శాలువా తో సన్మానించారు.

యాదవ్ సంఘం నాయకులు చిత్తా రు సింహాద్రి యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చిలకల వెంకటనర్సయ్య యాదవ్, మేకలసుగుణారావు,కూరాకుల వలరాజు, మీగడ శ్రీనివాసరావు, తుమ్మ రాంబాబు, కోడి లింగయ్య, చిత్తారు ఇందుమతి, చింతలచెర్వు లక్ష్మీ, పద్మ, విజయలక్ష్మి, అమరబోయిన లింగయ్య, మొర్రిమేకల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ వైద్యశాల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య అధికారు లకు ఫిర్యాదు..



జమ్మికుంట ప్రజబలం ప్రతినిధి ఏప్రిల్ 25జమ్మికుంట పట్టణంలోని మమత హాస్పటల్ లో తనకు జరిగిన అన్యాయం గురించి మమత హాస్పటల్ యాజమాన్యంపై జమ్మికుంట పట్టణానికి చెందిన లావణ్య భర్త రచ్చ రవికృష్ణ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ( డి ఎం హెచ్ ఓ) లకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే పేషెంట్ ప్రెగ్నెన్సి పరిక్షకు వెళ్ళగా థైరాయిడ్ మరియు ఇతర టెస్టుల కోసం రక్తం షాంపిల్స్ ఇవ్వడం జరిగింది ఒక వారం రోజుల తరువాత రిపోర్ట్స్ వస్తాయని తెలిపారు. 06-04- 2024 రోజున రక్త నమూనాలు తీసుకున్నారు. వారం తరువాత హాస్పటల్ కు వెళ్ళి వైద్య సిబ్బందిని రిపోర్ట్స్ అడుగగా ఇంకా రాలేదని నిర్లక్ష్య సమాదానం చెప్పారు. ఇలా రోజు వెళ్లి అడుగగ ఇంకా రిపోర్ట్స్ రాలేదని చెప్పారు. తేది 24-04-2024 బుధవారం రోజున హాస్పటల్ కు వెళ్ళి హాస్పటల్ సిబ్బందిని రిపోర్ట్స్ గురించి ఎందుకు ఇలా తిప్పించుకుంటున్నారని అడగగా మీ రక్త నమూనాలు(షాంపిల్) మిస్ అయ్యాయని మళ్లీ రక్త నమూనాలు ఇవ్వాలని మళ్లీ టెస్టులకు పంపిస్తామని నిర్లక్యంగా వ్యవహరిస్తూ తమపై దురుసుగా ప్రవర్తించారు. పేద ప్రజలను టెస్టుల పేరుతో దోచుకుంటున్న మమత హాస్పటల్ పై చట్ట పరమైన చర్యలు తీసుకొని తనాకు జరిగిన అన్యాయానికి, న్యాయం చేయాలని బాధిత దంపతులు గురువారం రోజున జిల్లా కలెక్టర్, వైద్య అధికారి, కి ఫిర్యాదు చేశారు.

## ఎండకు దగ్దమయిన సెల్ టవర్

మణుగూరు మండలం, సాంబాయిగూడెం లో ఎండ తీవ్రతతో జియో నెట్వర్క్ సెల్ టవర్ పూర్తిగా దగ్ధమైంది. ఎండ వేడికి వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చేలరేగింది. సెల్ టవర్ చుట్టు ఎవ్వరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ మంటలను బి.టి.పి.ఎస్. కు చెందిన ఫైర్ సిబ్బంది అదుపు చేసారు

## ఉప్పల్ స్టేడియంలో పార్లమెంటు ఎన్నికల SVEEP కార్యక్రమాలు

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి గౌతమ్




ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఏప్రిల్ 25:కేంద్ర మరియు రాష్ట్ర ఎన్నికల అధికారి గారుల ఆదేశాల మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మరియు ఎన్నికల అదికారి గౌతమ్ పొట్రు గారు వారి టీమ్ ఉప్పల్ స్టేడియంలో ఈరోజు జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా స్టేడియం వచ్చే క్రికెట్ మ్యాచ్ వీక్షకులకు పార్లమెంటు ఎన్నికల %ూఎజుజుూ% కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ స్టేడియం లోపల మరియు బయట పాదచారులుకు కనపడే విధంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, స్టాండ్లు ,బోర్డులు ఏర్పాటు చేయడం జరిగింది. స్వీప్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా టీమ్ నోడల్ అధికారి మరియు సిబ్బంది స్టేడియం లోపల పలు ప్రాంతాలలో టీములుగా ఏర్పడి వారికి ఓటు పై అవగాహన కల్పించడంతోపాటు. దేశం కోసం ఓటు... నా మొదటి ఓటు దేశం కోసం.. ఓటు దేశ భవిష్యత్తు కోసం ....ఎన్నికల పర్వం దేశానికి గర్వం ...అనే నినాదాలతో చైతన్య పరుస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది నూతన ఓటర్లు, యువతి యువకులు, మ్యాచ్ సందర్భంగా ఫ్లెక్సీల పై ఉన్న సమాచారంతో చూపర్లకు ఆకట్టుకునే విధంగా ఉన్నవి.. ప్రతి ఫ్లెక్సీ ఓట్లను చైతన్య పరచడంతో పాటు సమాజానికి ఒక మంచి మెసేజ్ అందించడంలో సఫలీకృతం అయినట్లుగా భావించవచ్చు.. స్టేడియం లో జరిగే క్రికెట్ మ్యాచ్ ను ఎన్నికల సందర్భంగా ప్రచారం కార్యక్రమం నిర్వహించడం పలువురు హర్షం వ్యక్తం చేశారు...

## సోషల్ మీడియాలో పోస్టులపై రామగుండము కమీషనరేట్ పోలీసుల నిఘా రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే జైలుకే

## పోలీస్ కమీషనర్ ఐపిఎస్(ఐజీ)ఎం శ్రీనివాస్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 : సామాజిక మాధ్యమాల్లో చట్టవ్యతిరేక పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నిఘా పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ లో సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ పోలీస్ కమీషనర్ ఐపిఎస్(ఐజీ)ఎం శ్రీనివాస్ పోలీస్ అధికారులతో కలిసి ప్రారంబించడం జరిగింది. గురువారం ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ...ట్విటర్, ఫేస్‌బుక్,వాట్సాప్,ఇతర సోషల్ మీడియా వేదికగా కొందరు వివిధ రాజకీయ నేతలను టార్గెట్‌గా చేసుకుని కొందరు,ఓమతాన్ని లేదా మతానికి సంబంధించిన ప్రముఖుల్ని టార్గెట్‌గా చేసుకుని మరికొందరు పోస్టులు పెడుతున్నారు.ఓ వర్గాన్ని కించపరుస్తూ పోస్ట్ చేసినా,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో పుకార్లు ప్రచారం చేసినా జైలుకు వెళ్లాల్సి ఉంటుందంటున్నారు.అలాంటి వారికి జైలు శిక్ష,జరిమానా తోపాటు కేసు తీవ్రతను బట్టి జీవిత ఖైదు పడే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా.సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేముందు,వచ్చిన పోస్టులను ఫార్వర్డ్ చేసేముందు అవి నిజమా కాదా అని ఒకసారి ఆలోచించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.24లె7 నిరంతరం సోషల్ మీడియా పోస్ట్ లపై నిరంతరం నిఘా ఉంటుంది. మత ఘర్షణల కలిగేలాగా,లా అండ్ ఆర్డర్ సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా,సోషల్ మీడియాలో మతాలను, కులాలను,ఒకరినొకరు కించపరుస్తూ గాని,లేనిపోని అబద్దపు పుకార్లను సృష్టించి ఎవరైనా సోషల్ మీడియా లో పోస్టులు పెడితే వారిపై సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా ఉంటుంది.

## కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గెలుపు కోసం గడప గడపకు కాంగ్రెస్ నాయకులు




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 : కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గెలుపు కోసం గడప గడపకు మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డ్ అధ్యక్షుడు నవాబ్ ఖాన్,గుత్తికొండ శ్రీధర్ ఆధ్వర్యంలో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ గుర్తు చేయి గుర్తుకు ఓటు వేసి పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీ కృష్ణ ని గెలిపించాలని అందరిని కోరడం జరిగింది.అంతేకాకుండా వార్డులో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని మన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు దృష్టికి తీసుకువెళ్లడానికి వాళ్లు చెప్పిన సమస్యలను రాసుకొని వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లే దిశ గురువారం కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో నాయకులు మినుముల శాంతి కుమార్,గరిసె రవి,అయూబ్,అజ్జు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా పై అవగాహన ర్యాలీ

ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 : ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో వెంకట్రావుపేట గ్రామంలో గ్రామ ప్రజలకు మలేరియా వ్యాధి పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది.గురువారం ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత,దోమలు పుట్టకుండా,దోమలు కుట్టకుండా ప్రతి వారానికి ఒక రోజు శుక్రవారం చేపట్టవలసిన డ్రై డే ప్రాముఖ్యత గురించి,ప్రజలు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్,హెచ్ ఈ ఓ లక్మణ్ స్వామి,హెల్త్ సూపర్ వైజర్ మార్త,ఫార్మాసిస్ట్ సునీత, ఎంఎల్ హెచ్ పీలు,హెల్త్ అసిస్టెంట్లు యం.ఏ.గఫూర్, వేణు,ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎంలు ఆశావర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మహమ్మద్ రసూల్



ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం) లోకసభ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని 17-ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గానికి బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మహ్మద్ రసూల్ స్వతంత్ర అభ్యర్థిని గా ఒక సెట్ నామినేషన్ ను దాఖలు చేశారు

## కాంగ్రెస్ నామినేషన్ ఘట్టం ముగిసింది



రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 25 ఏప్రిల్ 2024:చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి నామినేషన్ గురువారం సాయంత్రం 4.00 గంటలకు ముగియగా అందులో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం గావించినారు.

## వాకింగ్ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి వినూత్న ప్రచారం



ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం) ఖమ్మం కాంగ్రెస్ లోక్ సభ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి గురువారం సాయంత్రం నగరంలోని గొరిల్లా పార్క్ సమీప వాకర్స్ ప్యారడైజ్ లో, ట్యాంక్ బండ్ వద్ద ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తో కలిసి వాకింగ్ చేస్తూ.. అక్కడ వాకింగ్ చేస్తున్నవారిని పలకరిస్తూ... ఓట్లు అభ్యర్థించారు. అమ్మా..అక్కా.. అంటూ ఆప్యాయంగా మాట్లాడించారు. చేతి గుర్తుపై ఓటేసి.. తనను ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమ పాలన కోసం కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని వివరించారు



కాంగ్రెస్ కార్యాలయంలో ఎన్ ఎస్ యూ ఐ సమావేశం

కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఎన్ ఎస్ యూ ఐ సమావేశానికి కాంగ్రెస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థి నాయకులంతా తమ ప్రాంతాల్లో యువ న్యాయ్ పథకం గురించి వివరించి, చైతన్యం నింపి .. భారీ మెజారిటీకి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షులు మహమ్మద్ జావిద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాజీ కార్పొరేటర్ నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు, నాయకులు కొప్పుల చంద్రశేఖర రావు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మొక్కా శేఖర్ గౌడ్, సయ్యద్ హుస్సేన్, షేక్ అబ్దుల్ రెహ్మాన్, తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నామ నాగేశ్వరరావు



ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 25 (ప్రజాబలం) బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు గురువారం రఘు నాధపాలెం మండలం లోని పలు గ్రామాల్లో పర్యటించి పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.రాములు తండాలో నూతన వధూ వరులు భూక్యా రాజా ను దీవించగా బద్యా తండాలో నూనావత్ మహేష్ - స్వాతి గారి తో పాటు మాలోత్ పవన్ - శైలజ లను ఆశీర్వదించారు. మంగ్య తండాలో గుగులోత్ కృపా జ్యోతి - సుమన్ లను, కోయచలకలో గొర్రె కృష్ణయ్య - రాధమ్మ కుమారుడు సతీష్ - కావేరి లను నామ గారు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ రఘునాధపాలెం మండల అధ్యక్షులు వీరూ నాయక్, ఉప్పల వెంకట రమణ, తండాల పెద్దలు నూనావత్ పెంట్యా, నూనావత్ లకుపతి, ద్రస్రూ, బాణోత్ లాల్ చంద్, బాణోత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి, వైఎస్. జగన్ పులివెందుల నుంచి నామినేషన్

### రాజశేఖర్ రెడ్డి దుర్మరణానికి కుట్ర పన్నిన వారితోనే తన సోదరీమణులు చేతులు కలిపారు

విజయవాడ ఏప్రిల్ 25 ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సిపి అధ్యక్షుడు వైఎస్. జగన్ గురువారం పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన నామినేషన్ ఫైల్ చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల తన హార్ట్ బీట్ అన్నారు. పులివెందుల ఓటర్ల మద్దతుతోనే తన పయనం కొనసాగుతోందన్నారు.సిఎస్ఐ గ్రౌండ్ లో జగన్ ప్రసంగిస్తున్నప్పుడు 'జై జగన్' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. జగన్ తన ప్రసంగంలో కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్. షర్మిల, వైఎస్. సునీత లను విమర్శించారు. తన పినాన్న వివేకానంద రెడ్డి మరణానికి కారకులెవరో ప్రజలకు బాగా తెలుసునని జగన్ తెలిపారు. తన తండ్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి దుర్మరణానికి కుట్ర పన్నిన వారితోనే తన సోదరీమణులు చేతులు కలపడంపై ఆయన సంతాపం వ్యక్తం చేశారు. అలాగే అవినాశ్ రెడ్డికి కళంకం అంటగట్టడానికి ప్రయత్నించడాన్ని కూడా ఆయన దుయ్యబట్టారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com